PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 173 | విజయవాడ, బుధవారం 25 జనవరి 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 25 January 2023 | Rs

మానవత్వం కోసం నిలిచిన చే

- క్యూబా ప్రజల ఐక్యతను నాశనం చేయడానికి అమెరికా ప్రయత్నం
- చేగువేరా కుమార్తె అలైదా గువేరా

లోపలి పేజీలో..



ఆస్కార్ బరిలో 'నాటు నాటు'

- ఒరిజినల్ సాంగ్ విభాగంలో స్థానం
- తుది జాబితా ప్రకటించిన కమిటీ

న్యూఢిల్లీ : రాజమౌళి దర్శకత్వంతో రూపొందిన 'ఆర్ఆర్ఆర్' సినిమా మరో ఘనతను సాధించింది. ఈ చిత్రంలోని 'నాటు నాటు' పాట ఆస్కార్ అవార్డుకు నామినేట్ అయింది. బరిలో నిలిచిన చిత్రాల తుది జాబితాలో బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో 'నాటు-నాటు' పాట నామినేట్ అయినట్లు అస్కార్ అవార్డుల అకాడమి ప్రకటించింది. దీంతో ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డుకు మరో అడుగు దూరంలో ఈ పాట నిలిచినట్లైంది. వివిధ భాషల నుండి దాదాపు 300 చిత్రాలు షార్ట్ లిస్ట్‌కాగా, వాటిలో అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన చిత్రాల జాబితాను అస్కార్ సభ్యులు తుది జాబితాకు ఎంపిక చేశారు. 22 ఏళ్ల కిందట భారతీయ సినిమా నుండి లగాన్ ఆస్కార్ అవార్డుకు నామినేట్ అయినప్పటికీ అవార్డు దక్కలేదు. అయితే, స్లమ్ డాగ్ మిలియనీర్‌కు పనిచేసిన ఏఆర్ రహమాన్, రసూల్ పూకుట్టిలకు ఆస్కార్ అవార్డులు లభించాయి. ఒరిజనల్ సాంగ్ విభాగంలో 'నాటు నాటు' కాకుండా అప్లాజ్ (టెల్ ఇట్ లైక్ ఏ ఉమెన్), హోల్డ్ మై హ్యాండ్ (టాప్‌గన్ : మార్వెరిక్), లిఫ్ట్ మీ అప్ (బ్లాక్ పాంథర్), ది ఈజ్ ఏ లైఫ్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్) పాటలు కూడా నామినేట్ అయాయి.

ఆసియాలో ఆకలి కేకలు!

అధిక ధరలతో పెరిగిన ఆహార అభద్రత • ఎఫ్ఎఓ నివేదిక వెల్లడి



బ్యాంకాక్ : అధిక ధరలు, పెరుగుతున్న దారిద్ర్యంతో ఆసియా ఖండంలో ప్రజానీకం తీవ్ర ఆహార అభద్రతకు గురవుతున్నారని ఐక్యరాజ్యసమితికికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) పేర్కొంది. యునిసెఫ్, డబ్ల్యుహెచ్ఓ తదితర సంస్థలతో కలిసి రూపొందించిన నివేదికను ఆ సంస్థ మంగళవారం విడుదల చేసింది. దక్షిణాసియాలో దాదాపు 50కోట్ల మంది ప్రజలు పౌష్టికాహార లోపాన్ని ఎదుర్కుంటున్నారని, ప్రతి ప్రతి పదిమందిలో 8 కన్నా ఎక్కువమందే ఈ దుస్థితిలో ఉన్నారని పేర్కొంది. మరో వంద కోట్ల మంది ప్రజలు ఒక మోస్తరు నుండి తీవ్ర ఆహార అభద్రతను 2021లో ఎదుర్కున్నారని తెలిపింది. ఇక మొత్తంగా ప్రపంచ దేశాల్లో 2014లో ఆహార అభద్రత 21శాతంగా వుండగా, 2021 వచ్చేసరికి అది 29శాతానికి పైగా పెరిగింది. 'కోవిడ్ మహమ్మారితో పెద్ద ఎదురుదెబ్బ తగలింది. మూకుమ్మడిగా ఉద్యోగాలు పోయాయి. తర్వాత వచ్చిన ఉక్రెయిన్‌లో యుద్ధంతో ఆహారం, ఇంధనం, ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో అనేక లక్షలమందికి తగినంత ఆహారం అందుబాటులో లేకుండా పోయింది.' అని ఆ నివేదిక పేర్కొంది. ఈ గణాంకాలు చూసినట్లైతే, ఆకలిపై పోరాటంలో మందగమనం కొనసాగుతోందని నివేదిక వ్యాఖ్యానించింది. నగరాలకు తరలివెళ్ళిపోయిన ప్రజలు ఆహార అభద్రత సమస్యను చాలా తీవ్రంగా ఎదుర్కొంటున్నారని, అక్కడ వారికి అందుబాటు ధరల్లో ఆహారం దొరికే పరిస్థితి లేదని పేర్కొంది.

200 కోట్లమందిపై ప్రభావం

'ధాన్యం, గోధుమలు, చమురు వంటి ప్రాథమిక వస్తువుల ధరలు పెరుగుతూ రావడం పేదలను బాగా దెబ్బతీసింది. ఆహారం, ఆకలి, ఎరువులు, ఇంధనం, ఆర్థిక సాయం - '5ఎఫ్' సంక్షోభంగా ఐక్యరాజ్య సమితి సంస్థలు పిలిచే ఈ పరిస్థితిలో ఇదంతా ఒక భాగమే. గోధుమలు, వంట నూనెలు, ఎరువులు కోసం ఉక్రెయిన్‌పై ఆధారపడే దేశాలకు అక్కడ యుద్ధం బాగా దెబ్బతీసింది.' అని నివేదికలో పేర్కొన్నారు. దాదాపు రెండు వందల కోట్ల మంది ఇలా ఉక్రెయిన్‌పై ఆధారపడుతున్నారని, వారిలో 45శాతం మంది ఆసియాలోనే వున్నారని తెలిపింది. 'వీరికిఆరోగ్యకరమైన ఆహారం అందడం లేదు. దాంతో వారు రక్తహీనత, ఊబకాయం, క్షుద్భాద వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు.' అని పేర్కొంది.

పిల్లల ఎదుగుదలలో సమస్యలు ...

అనారోగ్యకరమైన ఆహారం, తగినంత రీతిలో ఆహారం లభ్యం కాకపోవడంతో భవిష్యత్ ఆరోగ్యం, ఉత్పాదకత విషయంలో రాజీపడాల్సి వస్తుందని, ఫలితంగా పిల్లలు ఎదుగుదల సమస్యలతో బాధపడతారని, వారు మరింత అస్వస్థతకు గురవడానికి అవకాశాలు ఎక్కువుగా వుంటాయని నివేదిక హెచ్చరించింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో దాదాపు నాలుగోవంతు మంది పిల్లలు సరిగా ఎదగకపోవడం అంటే వారి వయస్సుకు తగిన ఎత్తు, బరువు లేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నారని నివేదిక తెలిపింది.

క్లుప్తంగా

- ఆఫ్ఘనిస్తాన్‌లో 70శాతం మంది ఒక మోస్తరు నుండి తీవ్ర ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు. తాలిబన్లు అధికారాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత విదేశీ సాయం కూడా నిలిచిపోవడంతో పరిస్థితులు మరింత దుర్భరంగా మారాయి.
- కంబోడియాలో దాదాపు సగం మంది జనాభాకు సరిపడనంతా ఆహారం లేదు.
- ఆసియా మొత్తం మీద 15-49ఏళ్ల వయస్కుల్లో మూడో వంతుమంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు.
- దీంతో ఊపిరితిత్తులు, గుండె సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయి.



జిఓ 1పై తీర్పు రిజర్వు

ప్రజాశక్తి- అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు, రోడ్ మార్జిన్‌లలో బహిరంగ సభలు, రోడ్‌షోలను నియంత్రిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2న జారీ చేసిన జీవో 1ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన వాజ్యాలపై హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరుపక్షాల వాదనలు పూర్తి కావడంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ప్రకటించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ సోమయాజులుతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వారంలోగానే తాము తీర్పును వెలువరించే ప్రయత్నం చేస్తామని చెప్పింది. జీవో 1 అమలును ఈ నెల 23వ తేదీ వరకు నిలిపివేస్తూ వెకేషన్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పొడిగించేందుకు సిజె నేతత్వంలోని ధర్మాసనం నిరాకరించిన విషయం విదితమే. తాజాగా మంగళవారం టిడిపి పిటిషనర్ తరపు న్యాయవాది జిఓ 1 అమలును నిలిపివేత ఉత్తర్వులు ఇవ్వాలని కోరితే అందుకు అంగీకరించలేదు.

నోటిఫికేషన్‌లో రెండు పేరాలు అదృశ్యం

విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ పికె మిశ్రా కల్పించుకుని.. వెకేషన్ కోర్టు విచారణ చేసినప్పటి నోటిఫికేషన్‌లోని రెండు పేరాగ్రాఫ్‌లు ఇప్పుడు అదశ్యం అయ్యాయని విస్మయాన్ని వ్యక్తం చేశారు. డివిజన్ బెంచ్ పైనుంచి ఇంతకు మించి ఏమీ వ్యాఖ్యానించలేనన్నారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వులో పెడుతున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

రిటైర్‌మెంట్ @ 63?

రాష్ట్ర సర్కారు కసరత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు మరోమారు పెరగనుందా? విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ ప్రశ్నకు సమాధానం అవుననే! ప్రస్తుతమున్న 62 సంవత్సరాల ఉద్యోగవిరమణ వయసును 63 సంవత్సరాలకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు విస్తృతస్థాయిలో కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. అయితే, తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదని, న్యాయపరమైన అంశాలతో పాటు, ఇతర విషయాలను పరిగణలోకి తీసుకుని పరిశీలిస్తున్నామని ఉన్నతస్థాయి అధికారి ఒకరు చెప్పారు. 'అన్ని విషయాలను లోతుగా పరిశీలించిన తరువాతే తుది నిర్ణయం ఉంటుంది.' అని ఆయన అన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత 2014 జూన్‌లో ఉద్యోగ విరమణ వయసును 58 నుంచి 60 ఏళ్లకు పెంచుతూ నిర్ణయించగా, జగన్మోహన్‌రెడ్డి సర్కారు 62 ఏళ్లకు పెంచింది. తాజాగా మరో ఏడాది పెంచాలన్న ఆలోచన వెనుక ఆర్థికాంశాలే కీలకమని భావిస్తున్నారు. ఈ నిర్ణయం వల్ల విరమణ అనంతరం ఉద్యోగులకు కల్పించాల్సిన ప్రయోజనాలు మరో ఏడాది వరకు వాయిదా వేయవచ్చని, దీనివల్ల కొంత మేర ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని అంటున్నారు. అదే సమయంలో నిరుద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత కూడా వచ్చే అవకాశం ఉన్నందున ఆ దిశలో ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందా అన్నది చర్చనీయాంశంగా మారింది.

ఐఐఎఫ్‌టికి నిధుల లేమి



కాకినాడలోనే ఏర్పాటు చేసిన ఐఐఎఫ్‌టి తాత్కాలిక క్యాంపస్

- జెఎన్‌టియుకెలో తాత్కాలిక క్యాంపస్
- అరకొర వసతుల మధ్య తరగతుల నిర్వహణ
- విభజన హామీ అమలులో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కాకినాడలోని ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టి) దక్షిణాది క్యాంపస్ నిధుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక ప్రాత్ర పోషించనున్న ఈ క్యాంపస్‌లో కనీస వసతులు కరువయ్యాయి. కాకినాడ జెఎన్‌టియులో తాత్కాలిక క్యాంపస్‌లోనే కొనసాగుతోంది. అరకొర వసతుల మధ్య విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విభజన హామీ అమలులో కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దేశంలో ఢిల్లీ, కోల్‌కత్తా తర్వాత ఐఐఎఫ్‌టి మూడో క్యాంపస్‌ను రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. దీన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని తొలుత భావించారు. చివరకు కాకినాడలో ఏర్పాటు చేశారు. స్థానిక జెఎన్‌టియుకె ప్రాంగణంలో గతేడాది అక్టోబర్ 28న కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అట్టహాసంగా ప్రారంభించారు. బియ్యం, ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులకు కాకినాడ మంచి వేదికగా ఉంది. రాష్ట్రం మొత్తం ఎగుమతుల్లో సింహ భాగం ఇక్కడ నుంచే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐఐఎఫ్‌టి విద్యార్థులకు అవసరమైన క్షేత్రస్థాయి నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు కాకినాడ ప్రాంతం అనువుగాఉంటుందని నిర్ణయానికి వచ్చారు. శాశ్వత భవనాలు నిర్మించే వరకూ జెఎన్‌టియుకె ప్రాంగణంలో ఐఇటిఇ భవనంలో ఐఐఎఫ్‌టి తాత్కాలిక క్యాంపస్‌ను ఏర్పాటు చేశారు. జెఎన్‌టియుకెకు అద్దె చెల్లిస్తున్నారు. మూడు అంతస్తులున్న ఈ భవనంలో మూడు గదులను మాత్రమే కేటాయించారు. ఇవి ఎంతమాత్రమూ చాలట్లేదు. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపిఎం) కోర్సు మాత్రమే ప్రస్తుతం 40 మందితో నడుస్తోంది. మన రాష్ట్రంతోపాటు ఢిల్లీ, బెంగాల్, పంజాబ్, హర్యానా, కేరళ, తమిళనాడు, ఒడిశా, యుపి తదితర ప్రాంతాల విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. ఇంటర్నేషనల్ బిజినెస్ (ఎంబిఎ), ఎకనామిక్ ట్రేడ్ అండ్ ఫైనాన్స్ (ఎంఎ) కోర్సులు అందుబాటులోకి రావాలంటే మరి కొన్నేళ్లు ఆగాల్సిన పరిస్థితి. కాకినాడ రూరల్ తిమ్మాపురంలో విద్యార్థులకు 25 గదులుగల హాస్టల్ భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. దీంతో, అద్దెల భారం ఎక్కువగా ఉంది. లైబ్రరీకి అదనపు గదులు అవసరం ఉంది. ఫ్యాకల్టీ, రీసెర్చ్, ప్రాజెక్టు పనుల కోసం ఈ భవనం సరిపోవడం లేదు.

నిధుల విడుదల ఎప్పుడు?

కాకినాడ సెజ్‌లో ఐఐఎఫ్‌టి శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 25 ఎకరాలు కేటాయించింది. అత్యాధునిక వసతులతో దీన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అకాడమిక్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాకులు, ఆడిటోరియం, తరగతి గదులు, స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇతర శాశ్వత నిర్మాణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 ప్రకారం రూ.115 కోట్లు నిధులివ్వాలి. దీనికి అదనంగా కేంద్రం మరో రూ.40 కోట్లు

మిగతా 2లో



నేపాల్‌లో భూకంపం

- ఒకరి మృతి, పలువురికి గాయాలు
- ఢిల్లీ, రాజస్థాన్‌లోనూ ప్రకంపనలు

ఖాట్మండు : నేపాల్‌లో మంగళవారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.8గా నమోదైంది. ఈ భూకంపంతో నేపాల్‌లో ఒకరు మృతి చెందగా, అనేక మంది గాయపడ్డారు. అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయి. రాజధాని ఖాట్మాండ్‌కు సుమారు 400 కిలోమీటర్ల దూరంలో భుజురు జిల్లాలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2.28గంటల సమయంలో నేపాల్‌లో భూ కంపం సంభవించిందని జాతీయ భూకంప కేంద్రం (ఎన్‌సిఎస్) తెలిపింది. కాగా, కాగా, ఢిల్లీ, రాజస్థాన్ సహా చుట్టుపక్కల ప్రాంతాల్లో భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయని భారత అధికారులు తెలిపారు. ఢిల్లీలో భూమి కంపించిందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్ ట్వీట్ చేశారు. ఫ్యాన్లు, ఇంట్లో వస్తువులు కంపిస్తున్న వీడియోలను ఢిల్లీ ప్రజలు సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ ప్రకంపనలు దాదాపు ఒక నిముషం వరకు కొనసాగాయి. అయితే ఎక్కడా నష్టం జరిగినట్లు వార్తలందలేదు. 2400కిలోమీటర్ల విస్తీర్ణంలోని హిమాలయన్ కొలిజన్ జోన్‌లో ఈ భూకంప కేంద్రం వుందని సీనియర్ భూకంప శాస్త్రవేత్త తెలిపారు. ఈ ప్రాంతమంతా భూకంపాలు చాలా ఎక్కువగా వచ్చే ప్రాంతమని, మంగళవారం సాయంత్రం 3గంటలతో ముగిసిన గత 24గంటల్లో మొత్తంగా నాలుగు చోట్ల భూమి కంపించిందని తెలిపారు. అస్సాంలోని కేచర్ రీజియన్‌లో సోమవారం రాత్రి 7గంటలకు, భూటాన్‌లో రాత్రి 10.55గంటలకు, 12.53గంటలకు రెండు చోట్ల, నేపాల్‌లో 5.8 తీవ్రతతో భూమి కంపించిందని చెప్పారు.

ఢిల్లీ మేయర్ ఎన్నిక మళ్లీ వాయిదా

- బిజెపి, ఆప్ సభ్యుల నినాదాలతో సభలో గందరగోళం

న్యూఢిల్లీ : ఢిల్లీ మేయర్ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. మంగళవారం ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసిడి) సమావేశం కాగా, బిజెపి, ఆప్ కౌన్సిలర్ల నినాదాలతో సభ ఉద్రిక్తంగా మారింది. ఇరు పార్టీల కౌన్సిలర్లు ఇష్టారీతీగా వ్యవహరించారు. పోటాపోటీ నినాదాలతో సభ హోరెత్తింది. దీంతో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని, సభను నిరవధికంగా వాయిదా వేస్తూ ప్రిసైడింగ్ అధికారి సత్యశర్మ ప్రకటించారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక వాయిదా పడటం ఇది రెండోసారి. జనవరి 6న కూడా ఇదే రీతిలో ఎన్నిక ప్రక్రియ ఆగిపోయింది. ఆ రోజు సభ్యుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా నియమించిన ప్రిసైడింగ్ అధికారి సత్యశర్మ మొదట 10మంది నామినేటెడ్ కౌన్సిలర్స్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అయితే మేయర్ ఎన్నికలో వారు ఓటు వేయడానికి అనుమతి లేదని ఆప్ వెల్లడించింది. క్రితంసారి వారి ప్రమాణ స్వీకారం విషయంలోనూ ఆప్ నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మేయర్ ఎన్నికను బీజేపీ అనుకూలంగా మార్చేందుకు, ఉద్దేశపూర్వకంగానే వారిని నామినేట్ చేశారని విమర్శించింది. కాగా, మంగళవారం కార్పొరేషన్ కేంద్ర కార్యాలయం వద్ద భారీ భద్రతను ఏర్పాటుచేశారు. మార్షల్స్‌ను సిద్ధంగా ఉంచారు.



సమావేశమైన సిపిఎం, సిపిఐ నాయకులు

రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి

ఐక్య పోరాటాలు

- సిపిఎం, సిపిఐ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలెదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, దీనికోసం ఐక్య పోరాటాలు నిర్వహించాలని సిపిఎం, సిపిఐ నిర్ణయించాయి. సిపిఎం, సిపిఐ సమావేశం మంగళవారం విజయవాడలోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, సిపిఐ నుండి రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, జల్లి విల్సన్, అక్కినేని వనజ, జి ఈశ్వరయ్య, కెవివి ప్రసాద్ హాజరయ్యారు. ఎపికి ప్రత్యేక హోదా విభజన హామీల సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాలు ఈ నెల 25 నుండి ఫిబ్రవరి నాలుగో తేదీ వరకూ హిందూపురం నుండి ఇచ్ఛాపురం వరకూ చేపట్టిన బస్సుయాత్రకు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. రోడ్‌షోలు, ర్యాలీలు, సభలకు అనుమతి నిరాకరిస్తూ అప్రజాస్వామికంగా తీసుకొచ్చిన జిఓ నెంబరు 1పై పోరాటం చేయాలని నిర్ణయించాయి. ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరాయి. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 30న విశాఖపట్నంలో జరిగే కార్మిక మహాగర్జనకు రెండు పార్టీలు మద్దతు ప్రకటించాయి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోడీ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశాయి.

హైకోర్టు న్యాయమూర్తులుగా జ్యోతిర్మయి, కృష్ణారావు

- నోటిఫై చేసిన కేంద్రం
- 32కు చేరిన జడ్జీల సంఖ్య

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులుగా ఇద్దరు జ్యుడీషియల్ అధికారుల నియామకాన్ని కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. జ్యుడీషియల్ అధికారులు పి వెంకట జ్యోతిర్మయి, వి గోపాలకృష్ణ రావును ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తులుగా నియమించింది. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు ట్వీట్ చేశారు. జనవరి 10న సుప్రీంకోర్టు కొలీజియం వీరిని నియమించాలని సిఫారసు చేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 37 మంది న్యాయమూర్తుల నియామకానికి అవకాశం ఉండగా, తాజా నియామకాలతో న్యాయమూర్తుల సంఖ్య 32కు చేరింది.

'యువగళానికి' 17 షరతులతో అనుమతి

చిత్తూరు జిల్లా ఎస్‌పి రిషాంత్‌రెడ్డి



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

యువగళం పేరుతో ఈ నెల 27 నుంచి తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టనున్న పాదయాత్ర, పబ్లిక్ మీటింగులకు షరతులతో కూడిన అనుమతులు ఇచ్చామని చిత్తూరు జిల్లా ఎస్‌పి రిషాంత్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతుల కోసం పలమనేరు డిఎస్‌పి సుధాకర్‌రెడ్డికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిఎ మనోహర్ వినతిపత్రం అందజేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 17 షరతులతో అనుమతి ఇచ్చామని తెలిపారు.

నిబంధనలు ఇవే....

- పాదయాత్రలో ప్రజలకు, వాహనదారులకు, ఎమర్జెన్సీ సర్వీసెస్ రాకపోకలకు ఎలాంటి ఆటంకాలూ కలిగించకూడదు.
- బహిరంగ సభల సమయానికి కట్టుబడి ఉండాలి.
- ప్రభుత్వ, ప్రయివేటు ఆస్తులకు ఎలాంటి నష్టమూ కలిగించకూడదు.
- రోడ్లపై ఎలాంటి సమావేశాలూ నిర్వహించకూడదు.
- ఆరోగ్య అత్యవసర పరిస్థితులను నిర్వహించడానికి నిర్వాహకులు సమావేశ స్థలంలో ప్రథమ చికిత్స, వైద్య పరికరాలతో అంబులెన్స్‌లను ఏర్పాటు చేసి ఏదైనా అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు సమావేశ స్థలం దగ్గర అగ్నిమాపక యంత్రం ఉంచాలి.
- ఫైర్ క్రాకర్స్ పేల్చడం పూర్తిగా నిషేధం.
- పార్టీ కార్యకర్తలు, సమావేశంలో పాల్గొనేవారు సమావేశంలోనికి మారణాయుధాలు తీసుకెళ్లకుండా నిర్వాహకులు నిర్ధారించుకోవాలి.
- నిర్వాహకులు డ్యూటీలో ఉన్న పోలీసుల ఆదేశాలను ఎప్పటికప్పుడు పాటించాలి.
- వీటితోపాటు మరికొన్ని నిబంధనలు ఉన్నాయి.

విచారణకు హాజరు కాని అవినాష్‌రెడ్డి

- ఐదు రోజులు సమయం కావాలని లేఖ
- పులివెందుల్లోనే సిబిఐ బృందం

లోపలి పేజీలో..

ఏజెన్సీ ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టులు సరికాదు

- సిఎంకు మాజీ ఎంపి మధు లేఖ

లోపలి పేజీలో..

ఆప్కో ఛైర్మన్‌గా గంజి చిరంజీవి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆప్కో ఛైర్మన్‌గా గంజి చిరంజీవిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం జిఒ నెంబరు 8ని జారీ చేసింది. బుధవారం ఉదయం సిఎం చేతుల మీదుగా నియామకపత్రాలను చిరంజీవి అందుకోనున్నారు. ప్రభుత్వం ఛైర్మన్ పదవితో పాటు క్యాబినెట్ హోదా ర్యాంకు కూడా కల్పించింది. ఇప్పటివరకు ఈ పదవిలో కొనసాగిన చిల్లపల్లి మోహన్‌రావు పదవీకాలం డిసెంబరుతో ముగిసింది. చిరంజీవి గతేడాది ఆగస్టులో టిడిపిని వీడి వైసిపిలో చేరి ఆ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే.

డిఎస్‌పిలకు అడిషనల్ ఎస్‌పిలుగా పదోన్నతులు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 2022-23 సంవత్సరానికి సంబంధించి అడిషనల్ ఎస్‌పి పదోన్నతుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ మేరకు రోస్టర్‌పాయింట్ల ఆధారంగా స్క్రీనింగ్ కమిటి రూపొందించిన 18 మంది డిఎస్‌పిలకు అడిషనల్ ఎస్‌పిలుగా పదోన్నతులు పొందేవారి జాబితాను మంగళవారం విడుదల చేసింది. పదోన్నతులు పొందే డిఎస్‌పిలలో వైబిటిఎ ప్రసాద్, ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, ఆర్ రాఘవేంద్ర, ఎంజెవి భాస్కర్‌రావు, ఆర్ శ్రీహరిబాబు, ఎస్ ఖాదర్‌భాష, గురుగుపల్లి ప్రేమ్ కాజల్, షేక్ మాసుం భాష, జె తిప్పేస్వామి, గుంటుపల్లి శ్రీనివాసరావు, ఎన్ విష్ణు, జివి రమణమూర్తి, బి ఉమామహేశ్వరరావు, ఎల్ సుధాకర్, కె ప్రవీణ్‌కుమార్, సిహెచ్ సురేష్, ఎస్‌కె చంద్రశేఖర్, ఆర్ విజయభాస్కర్‌రెడ్డిలకు అడిషనల్ ఎస్‌పిలుగా పదోన్నతులను కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర హోమ్‌శాఖ ముఖ్యకార్యదర్శి హరిష్‌కుమార్ గుప్త ఉత్తర్వులు జారీ చేశారు.

వైన్, మైన్ మీదే నడుస్తున్న జగన్ ప్రభుత్వం

- రాష్ట్రంపై కేంద్రమంత్రి దేవాన్ష్ ఆరోపణ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు స్తంభించాయని, ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇచ్చేందుకు డబ్బులు లేవని, వైన్, మైన్ మీదే జగన్ ప్రభుత్వం నడుస్తోందని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి దేవాన్ష్ చౌహాన్ ఆరోపించారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ నిజయోవర్గ కార్యాలయ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన మంగళవారం కర్నూలులోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో విలేకర్లతో మాట్లాడారు. 14, 15 ఆర్థిక సంఘాల నిధులను సర్పంచుల ఖాతాల్లో వేసిన ఒక్క రోజులోపే వాటిని రాష్ట్ర ప్రభుత్వం విత్‌డ్రా చేసుకుని వేరే వాటికి వినియోగిస్తోందన్నారు. వలంటీర్లు వైసిపి కార్యకర్తల్లా పని చేస్తున్నారన్నారని విమర్శించారు.

రైల్వేల్లో రాయితీ పునరుద్ధరించాలి..

జర్నలిస్టులకు రైలు ఛార్జీలలో ఇచ్చే 50 శాతం రాయితీని పునరుద్ధరించాలని కేంద్ర మంత్రి దేవాన్ష్‌కు ఎపిడబ్ల్యుజెఎఫ్ విన్నవించింది. ఈ మేరకు కర్నూలు నగర కార్యదర్శి నాగేంద్ర, ఉపాధ్యక్షులు విద్యాసాగర్, నాయకులు వినయ్‌కుమార్, చంద్రమోహన్ మంత్రికి వినతిపత్రం సమర్పించారు.

4 శాఖల్లో ఎఫ్‌ఆర్‌బిఎ ఎస్ నుంచి మినహాయింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్య ఆరోగ్యశాఖ, పాఠశాల విద్య, గ్రామ వాలంటీర్లు, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్‌కు సంబంధించిన సెక్రటరియేట్ ఉద్యోగులకు ఎఫ్‌ఆర్‌బిఎఎస్ యాప్ అటెండెన్స్ నుంచి ప్రభుత్వం మినహాయింపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

28 నుంచి ఎన్‌టిఎక్స్‌పి సందడి

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ (విశాఖ)

: విశాఖలో నేషనల్ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి జి.మహేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 3 వరకూ జరిగే ఈ కార్యక్రమంలో మూడు రాష్ట్రాల నుంచి 200 మంది గిరిజన యువతీ యువకులు పాల్గొంటున్నారని చెప్పారు.

అందులో భాగంగా రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్ ప్రాంగణంలో వారం రోజులపాటు జాతీయ స్థాయి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చత్తీష్‌ఘడ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. సిఆర్‌పిఎఫ్, ఐడిబిపి, బిఎస్‌ఎఫ్ ప్రతినిధులు యువతకు సహకారంగా వస్తున్నారని వెల్లడించారు. గిరిజన యువతకు సంబంధించిన భాష - సంస్కృతి, జీవన వ్యవహార శైలి, ఆర్థిక పరిస్థితులు, నివసించే పద్ధతులు, ప్రాంతాలను బట్టి వివిధ రకాల జీవన విధానాలు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. గిరిజన సంప్రదాయాలపై నృత్య ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. పారిశ్రామిక, పర్యాటక ప్రాంతాల సందర్శన ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎన్‌వైకె.పరిపాలనా అధికారి అల్లం రాంప్రసాద్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఆర్.లీలాప్రసాద్ పాల్గొన్నారు. మరోపక్క ఈ ప్రోగ్రాం వాల్ పోస్టర్‌ను రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మిందిలోని తన స్వగృహంలో ఆవిష్కరించారు.

హెటిరో రెండో పైప్‌లైన్‌కు గ్రీన్‌సిగ్నల్

- సిఆర్‌జెడ్ అనుమతులు
- 419 రోజులుగా మత్స్యకారుల ఆందోళన
- అయినా పట్టించుకోని ప్రభుత్వం



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పర్యావరణ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నక్కపల్లి హెటిరో డ్రగ్స్ కంపెనీకి కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్‌జెడ్) నుంచి రెండో పైప్‌లైన్‌కు అనుమతులు లభించాయి. సముద్రంలోకి హెటిరో రసాయన వ్యర్థ జలాలు విడిచిపెట్టడంతో చేపల వేటలేక జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులంతా రెండో పైపులైన్‌కు అనుమతులు ఇవ్వొద్దని 419 రోజుల నుంచి ఆందోళన కొనసాగిస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు పాటించకపోవడం వల్ల జరిగిన పర్యావరణ నష్టాన్ని రూ.6.94 కోట్లుగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) నియమించిన కమిటీ గతేడాది అంచనా వేసింది. ఆ మేరకు పరిహారం విధించాలని సిఫార్సు చేసింది. హెటిరో రసాయన వ్యర్థ జలాలను సముద్రంలోకి వదలడంతో చేపలు చనిపోతున్నాయని, మళ్లీ కొత్తగా రెండో పైప్‌లైన్ ఏర్పాటుకు అనుమతులివ్వొద్దని అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట, బోయపాడు, పెదతీనార్ల, చినతీనార్ల, దొండవాక, అమలాపురం, డిఎల్.పురం, బంగారయ్యపేట మత్స్యకారులు 2021 డిసెంబరు ఒకటి నుంచి ఆందోళన కొనసాగిస్తూనే, మరోవైపు ఎన్‌జిటిని ఆశ్రయించారు. ఎన్‌జిటి నియమించిన ఆరుగురు నిపుణుల కమిటీ తన నివేదికలో కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు, సూచనలు పాటించకపోవడంతో పర్యావరణ నష్టం రూ.6.94 కోట్లు ఉంటుందని అంచనా వేసి పరిహారం విధించాలని ఎన్‌జిటికి సిఫార్సు చేసింది. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ అనుమతుల్లేకుండా డీశాలినేషన్ ఆపరేషన్ ప్రారంభించినట్లు అప్పట్లో కమిటీ గుర్తించింది. కొత్తగా వేసిన పైప్‌లైన్‌కు అనుమతిలేదని తెలిపింది. ఎన్‌జిటి తుది తీర్పు కోసం మత్స్యకారులు ఎదురు చూస్తుండగా, ఈ నెల 11న రెండో పైపులైన్ ఏర్పాటుకు సిఆర్‌జెడ్ అనుమతులు హెటిరోకు లభించడంతో వారిని తీవ్ర ఆందోళనకు గురిజేసినట్లయింది. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఎపిపిసిబి) ఇచ్చిన ఎన్‌ఒసి, ఎపి తీరప్రాంత నిర్వహణ సాధికారి సంస్థ (ఎపిసిజెడ్ఎంఎ) రికమండేషన్‌ను పరిగణనలోకి తీసుకున్న నిపుణుల కమిటీ గతేడాది నవంబరు 29న సమావేశమై అనుమతులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రెండో పైపులైన్ అనుమతులకు దరఖాస్తు చేసుకున్న హెటిరో నుంచి కంపెనీ ఉత్పత్తి ప్రారంభించిన 2007కు ముందు ఏ రకమైన చేపలు, ఏ స్థాయిలో లభ్యమయ్యేవి, ఉత్పత్తి అనంతరం ఆ చేపల లభ్యత ఎలా ఉందన్న సమాచారాన్ని ఇవ్వాలని నిపుణుల కమిటీ సూచించింది. దీనిపై గతేడాది నవంబరు 30న చేపల లభ్యతపై సమాచారం పంపించింది. పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించిన హెటిరో కంపెనీ... చేపల లభ్యతపై అందజేసిన సమాచార విశ్వసనీయతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సముద్రంలో చేపల లభ్యతపై హెటిరో సమర్పించిన నివేదికను బహిర్గతం చేస్తే దాని అసలు రూపం బయటపడుతుందని నిపుణులు అంటున్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎయిమ్స్ డైరెక్టర్ త్రిపాఠి

ఘనంగా ఎయిమ్స్ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి -మంగళగిరి (గుంటూరు జిల్లా)

ఎయిమ్స్ వైద్యశాల ప్రజలకు ఓ వరమని ఫ్యామిలీ అండ్ హెల్త్ కమిషనర్ జె నివాస్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎయిమ్స్ వైద్యశాల 5వ వ్యవస్థాపక దినోత్సవ వేడుక సభను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా జె నివాస్ హాజరై మాట్లాడుతూ ఎయిమ్స్ వైద్యశాల అభివృద్ధికి తాము అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. అతి తక్కువ ఖర్చులతో నాణ్యమైన వైద్యం ఎయిమ్స్ వైద్యశాలలో లభిస్తోందన్నారు. వైద్యశాల డైరెక్టర్ ముకేష్ త్రిపాటి మాట్లాడుతూ.. ఎయిమ్స్‌కు తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, మరో సంవత్సరంలో పనులు పూర్తవుతాయని తెలిపారు. వైద్యశాల ప్రధాన ధ్వారం వద్ద రోడ్డు నిర్మించాల్సి ఉందని, ప్రస్తుతం టెండర్ల దశలో ఉందన్నారు. ప్రతిరోజు సగటున రెండు వేల మంది రోగులు ఎయిమ్స్ వైద్యశాలకు వస్తున్నారని తెలిపారు. అన్ని విభాగాలకు చెందిన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పూర్తిస్థాయి ఐపిడి సేవలు కూడా త్వరలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ టిఎస్ రవికుమార్ మాట్లాడుతూ ఆగస్టు 2018లో ఎయిమ్స్ మెడికల్ కళాశాలలో తరగతులు ప్రారంభమయ్యాయని, అప్పటి నుంచి విజయవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ ఫ్యాకల్టీ వేమూరి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి, యువజన సంఘాల పర్యటనలో మార్పులు

- ఒకరోజు ముందే ప్రారంభం
- ఫిబ్రవరి 4న ముగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపికి ప్రత్యేక హోదా విభజన హామీల సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన బస్సుయాత్రలో స్వల్పమార్పులు జరిగాయి. బుధవారం అనంతపురం నుండి ప్రారంభమై నాలుగో తేదీన ఇచ్ఛాపురంలో ఈ యాత్ర ముగియనుంది. 25వ తేదీన ఉదయం 10 గంటలకు అనంతపురంలోని పివికెకె కళాశాల నుండి ప్రారంభమయ్యే యాత్ర అదే రోజు కర్నూలు మీదుగా నంధ్యాల చేరుకుంటుంది. 26వ తేదీన నంధ్యాల నుండి బయలుదేరి కడప మీదుగా తిరుపతి చేరుకుంటుంది. 27వ తేదీన తిరుపతి, నెల్లూరు మీదుగా ఒంగోలు వస్తుంది. 28వ తేదీన బయలుదేరి గుంటూరులో ముగుస్తుంది. 29వ తేదీన బాపట్ల నుండి బయలుదేరి రేపల్లే మీదుగా మచిలీపట్నం చేరుకుంటుంది. 30వ తేదీన మచిలీపట్నం నుండి ఉయ్యూరు మీదుగా విజయవాడ ఎస్ఆర్ఆర్ కళాశాలలో సమావేశం అనంతరం ఏలూరు వెళ్లిపోతుంది. 31వ తేదీన సిఆర్ రెడ్డి కళాశాలలో సభ అనంతరం రాజమండ్రి మీదుగా కాకినాడ చేరుకుంటుంది. ఫిబ్రవరి ఒకటోతేదీన కాకినాలో బయలుదేరి తుని మీదుగా అనకాపల్లి వెళుతుంది. రెండోతేదీన అనకాపల్లి నుండి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది. మూడోతేదీన విశాఖపట్నం రాజా కళాశాలలో సభ అనంతరం విజయనగరం చేరుకుంటుంది. నాలుగోతేదీన శ్రీకాకుళం అంబేద్కర్ యూనివర్శిటీల్లో సెమినార్ అనంతరం పలాస మీదుగా ఇచ్ఛాపురంలో ముగుస్తుంది.

నేడు 165 పశు అంబులెన్స్‌ల ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

165 పశు అంబులెన్స్ వాహనాలను బుధవారం ఉదయం సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. మొదటి దశలో రూ.129.07కోట్ల వ్యయంతో 175 పశు అంబులెన్స్‌లు ప్రారంభించగా తాజాగా నేడు రెండో దశ కింద రూ.112.62కోట్లతో మరో 165 వాహనాలకు జెండా ఊపి ప్రారంభించనున్నారు. దీంతో మొత్తం మీద డాక్టర్ వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్యసేవ కింద రూ.240.69 కోట్ల వ్యయంతో 340 పశువుల అంబులెన్స్‌లు ఏర్పాటు చేసినట్లవుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఒక్కో అంబులెన్స్‌లో ఒక పశు వైద్యుడు, వెటర్నరీ డిప్లమో సహాయకుడు, డ్రైవర్ కమ్ అటెండర్, 20 రకాల పేడ సంబంధిత పరీక్షలు, 15 రకాల రక్తపరీక్షలు చేసేందుకు వీలుగా మైక్రోస్కోప్‌తో కూడిన చిన్న ప్రయోగశాల, అన్ని రకాల వ్యాక్సిన్లు, మందులతో పాటు పశువును వాహనంలోకి ఎక్కించేందుకు హైడ్రాలిక్ సౌకర్యం ఉండేలా సౌకర్యాలు కల్పించారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో

హైడ్రో పవర్ ప్రాజెక్టులు సరికాదు

సిఎంకు మాజీ ఎంపి మధు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలో పెదకోట, చుట్టేరుపాడు, గుజ్జెరి ప్రాంతాలతోపాటు చింతపల్లి మండలం ఎర్రవరంలో చేపడుతున్న హైడల్ ప్రాజెక్టులు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని మాజీ ఎంపి పి మధు కోరారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. నాలుగు ప్రాజెక్టుల్లో 8 డ్యాములు నిర్మిస్తున్నట్లు 5500 మెగావాట్ల హైడ్రోపవర్ ప్రాజెక్టులు నిర్మాణం చేపడుతున్నట్లు తెలుస్తోందని, 27 గ్రామాలు 8500 ఎకరాలు ముంపునకు గురవుతాయని నాలుగు వేల మంది నివాసం ఉంటున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల వల్ల సాగునీరు, తాగునీరు, అందుబాటులో ఉన్న వనరులు పూర్తిగా దెబ్బతింటాయని, మరో 67 గ్రామాల్లో 10 వేల ఎకరాలు సాగు నష్ట పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రత్యక్షం గాను, పరోక్షంగాను సుమారు 100 గ్రామాలు, 20000 ఎకరాలు, 15 వేల మంది జనాభా ఈ ప్రాజెక్టులతో నిర్వాసితు లవుతున్నారని వివరించారు. ఇది ఆర్థికంగా ఈ ప్రాంతంలో ప్రజల మనుగడకు తీవ్ర ప్రమాదం తెస్తుందని, ఇప్పటికే అలజడి ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వం పునరాలోచించి ప్రతిపాదన ఉపసంహరించు కోవాలని గిరిజనులు, స్థానిక ప్రజలు కోరుతున్నారని వెంటనే వారితో ప్రభుత్వం సంప్రదింపులు జరపాలని కోరారు. 5వ షెడ్యూల్ ఏరియాలో చట్ట ప్రకారం గ్రామ సభలు జరగాల్సి ఉన్నా జరగలేదని, అటవీ హక్కుల కమిటీ తీర్మానం చేయలేదని వివరించారు. ముఖ్యంగా గిరిజన సలహా మండలి (టిఏసి) (ఎమ్మెల్యేల) తీర్మానం ఉండాలని ఉన్నా అది కూడా జరగలేదని పేర్కొన్నారు. ఇవి జరగకుండా చేయడమంటే రాజ్యాంగ ఉల్లంఘనేనని, ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను ఉపసంహరించు కోవాలని కోరారు.

సిఎంను కలిసిన సిఐడి చీఫ్ సంజయ్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ సిఐడి చీఫ్‌గా నియమితులైన సీనియర్ ఐపిఎస్ అధికారి నడిగట్టు సంజయ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సిఐడి చీఫ్‌గా అవకాశం కల్పించి నందుకు ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వివేకానంద హత్య దోషులను శిక్షించాలి

- వైఎస్ఆర్‌టిపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి, తన చిన్నాన్న వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణ త్వరగా పూర్తి చేసి దోషులను శిక్షించాలని వైఎస్ఆర్‌టిపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సిబిఐను కోరారు. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం షర్మిల మీడియాతో మాట్లాడారు. కేసు విచారణను త్వరగా పూర్తి చేయాలని వైఎస్ కుటుంబం తరుపున దర్యాప్తు సంస్థను కోరుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా 28న పాదయాత్ర మొదలవుతుందని తెలిపారు. వైఎస్ఆర్‌టిపికి భయపడే కెసిఆర్ ఖమ్మంలో సభ పెట్టారని అన్నారు. బిజెపితో ఎన్నికల పొత్తు ఉండదని స్పష్టం చేశారు. వివేకా హత్య కేసు తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయిన నేపథ్యంలో కేసుకు సంబంధించిన దస్త్రాలు, సాక్షుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను కడప జిల్లా సెషన్స్ కోర్టు నుంచి హైదరాబాద్‌లోని ప్రిన్సిపల్ సిబిఐ న్యాయస్థానానికి తరలించారు.

పోరాటాలతోనే 'ఉక్కు'ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

పోరాటాలతో మోడీ ప్రభుత్వం మెడలు వంచి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 712వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు వరసాల శ్రీనివాసరావు, విల్లా రామ్మోహన్ కుమార్, యు.రామస్వామి, ఎన్.రామారావు సిహెచ్.సన్యాసిరావు మాట్లాడారు. దుందుడుకుగా ముందుకు వెళ్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

విజయవాడ విమానాశ్రయ ప్రైవేటీకరణ సరికాదు : సిఐటియు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాబోయే కేంద్ర బడ్జెట్‌లో 12 విమానాశ్రయాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.వి.నాగేశ్వరరావు, సిహెచ్.నర్సింగరావు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. దేశంలో విజయవాడ, కలకత్తా, రాయ్‌పూర్, జబల్‌పూర్, ఇండోర్‌తో సహా 12 విమానాశ్రయాలను మోడీ ప్రభుత్వం అమ్మకానికి పెట్టనుందని, ప్రజల డబ్బుతో నిర్మించిన వీటిని అమ్మాలనే నిర్ణయాన్ని వారు తీవ్రంగా ఖండించారు.

దీనివల్ల రన్‌వేలు, భూములు, భవనాలు, మౌలిక వసతులన్నీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళతాయని తెలిపారు. విమానాశ్రయాలు, పోర్టులు ఆదానీకి రాసి పెట్టిందని తెలిపారు. విజయవాడ విమానాశ్రయాన్ని రూ.1000 కోట్లతో ప్రభుత్వం అభివృద్ధి చేసిందని, అంతకుముందున్న భూములకు 700 ఎకరాలు అదనంగా రైతుల నుండి సేకరించిందని వివరించారు. ప్రైవేటీ కరిస్తే ఈ భూముల విలువ లెక్కలోకి రాదని, అవన్నీ అదానీ చేతుల్లోకి వెళతాయని, ఉద్యోగులు, రైతులు, ప్రజలు దీన్ని వ్యతిరేకిం చాలని వారు కోరారు. ప్రజల మద్దతు సమీకరించుకుని ప్రైవేటీకరణను వ్యతిరేకిం చాలని విమానాశ్రయ ఉద్యోగులను సిఐటియు కోరింది.

7 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు 'సెకీ'తో ఒప్పందం : పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వేసవిలో పెరిగే విద్యుత్తు డిమాండ్‌ను తీర్చేందుకు ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్తు కేంద్రం'(ఎన్‌టిటిపిఎస్)లో మరో 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి యూనిట్‌ను ప్రారంభించినున్నట్లు రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం తెలిపారు. రాబోయో 25 ఏళ్ల పాటు వ్యవసాయరంగానికి ఉచిత విద్యుత్తును సరఫరా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకోసం యూనిట్ రూ.2.49 ధరతో 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్తు కొనుగోలుకు "సెకీ"తో ఒప్పందం కుదుర్చుకున్నామని మంత్రి పెద్దిరెడ్డి చెప్పారు. పునరుత్పాధక ఇంధన ఉత్పత్తి పెంపునకు తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. సోలార్, పంప్డ్ స్టోరేజీ యూనిట్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. విద్యుత్తు సంస్థలు అత్యుత్తమ పనితీరుతో వరుసగా ప్రతిష్టాత్మక అవార్డులు సాధించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ట్రాన్స్‌మిషన్ రంగంలో ఎపి ట్రాన్స్‌కో దేశంలోనే నెంబర్ వన్‌గా ఉందని, ఉత్తమ పనితీరు కనబర్చినందుకు ఎపి ట్రాన్స్‌కోకు 'స్కోచ్' బంగారు, వెండి పథకాలు ప్రకటించిన నేపథ్యంలో ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, ట్రాన్స్‌కో ఛైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్ బి శ్రీధర్‌ను మంత్రి పెద్దిరెడ్డి అభినందించారు. 2022లో ప్రతిష్టాత్మక ఎనర్షియా సంస్థ మూడు అవార్డులు మంత్రి గుర్తు చేశారు.

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మురళీధరన్
- కన్నా లక్ష్మీనారాయణ గైర్హాజరు

ప్రజాశక్తి- భీమవరం రూరల్

వైసిపి పాలనలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధీ జరగడంలేదని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర ఇన్‌ఛార్జి మురళీధరన్ విమర్శించారు. గత టిడిపి పాలనలోనూ ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని ఆనంద ఫంక్షన్ హాలులో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మురళీధరన్ మురళీధరన్ మాట్లాడుతూ వైసిపి, టిడిపిలు రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్‌పవర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఇచ్చిన నిధులను వైసిపి దారిమళ్లిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. బిజెపి జాతీయ కార్యదర్శి సునీల్ దియోధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణు కుమార్‌రాజు, కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ పాకా సత్యనారాయణ పాల్గొన్నారు. కాగా, ఈ సమావేశానికి బిజెపి నాయకులు కన్నా లక్ష్మీనారాయణ గైర్హాజరయ్యారు. బిజెపి పట్ల ఆయన కొంతకాలంగా అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల జరిగిన బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశాలకూ ఆయన హాజరు కాలేదు.

ఎంఆర్‌పిఎస్ ఆందోళన

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశం వద్ద ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఎస్‌సి వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. అధికారం చేపట్టిన వంద రోజుల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లును తీసుకొస్తామని చెప్పిన బిజెపి... ఎనిమిదేళ్లలో మాదిగలకు ఏం చేసిందో చెప్పాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజును ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు నిలదీశారు. అనంతరం ఎంఆర్‌పిఎస్ నేతలు కేంద్ర మంత్రి మురళీధర్‌ను కలిసేందుకు యత్నించగా అందుకు సోము వీర్రాజు నిరాకరించారు. దీంతో బిజెపికి వ్యతిరేకంగా ఎంఆర్‌పిఎస్ నేతలు నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో ఎంఆర్‌పిఎస్ నాయకులను కేంద్ర మంత్రి మురళీధరన్ వద్దకు బిజెపి నాయకులు తీసుకువెళ్లారు. మంత్రికి ఎంఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు.

నేటి నుండి ఎడ్‌సెట్ కౌన్సిలింగ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి ఎడ్‌సెట్‌లో క్వాలిఫై అయిన వారికి నేటి నుండి కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ కె రామమోహనరావు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. 25వ తేదీ నుండి 27వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవాల్సి ఉంది. 28వ తేదీన మార్పులు చేర్పులకు అవకాశం కల్పించారు. 30వ తేదీన సీట్లను కేటాయించనున్నారు. 31 నుండి మూడోతేదీ వరకూ సీట్లు పొందిన వారు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఫిబ్రవరి ఒకటోతేదీ నుండి క్లాసులు ప్రారంభం అవనున్నాయి.

ఐఐఎఫ్‌టికి నిధుల లేమి

మొదటి పేజీ తరువాయి

ఇవ్వాల్సి ఉంది. అయితే, నిధుల విడుదలలో తీవ్ర జాప్యం కారణంగా పనులింకా మొదలు కాలేదు. ఇటీవల కేంద్రం రూ.50 కోట్లు మంజూరు చేస్తుందనే ప్రచారం జరిగింది. కానీ, దీనిపై ఎలాంటి ఉత్తర్వులూ తమకు అందలేదని క్యాంపస్ అధికారులు చెబుతున్నారు. దీంతో, పనులు ఎప్పుడు మొదలవుతాయనే దానిపై ఇంకా స్పష్టత లేదు. శాశ్వత క్యాంపస్ ప్రారంభమైతే 360 మంది వరకు విద్యార్థులు ఆయా కోర్సులను నేర్చుకునే అవకాశం ఉంది.

శాశ్వత వనరులు సమకూరాలి



తాత్కాలిక క్యాంపస్‌లో ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు సరిపోతున్నాయి. విద్యార్థుల సంఖ్య పెరిగితే మాత్రం ఇబ్బందులు వస్తాయి. సెజ్ భూముల్లో శాశ్వత వనరులు సమకూరితే సమస్యలు తొలగుతాయి.

- రవీంద్ర సారథి, సెంటల్ హెడ్, ఐఐఎఫ్‌టి, కాకినాడ



ప్రాజెక్టు వర్క్‌ల కోసం ఇబ్బందులు

తాత్కాలిక క్యాంపస్‌లో కొన్ని అసౌకర్యాలు ఉన్నాయి. తరగతి గదులు సరిపోతున్నా లైబ్రరీ చిన్నదిగా ఉంది. ప్రాజెక్టు వర్క్‌ల కోసం ఇబ్బందులు పడుతున్నాం. త్వరితగతిన శాశ్వత భవనాలు పూర్తి చేయాలి.

- అక్షత్ నారాయణ్, విద్యార్థి, ఢిల్లీ

రాజకీయాల్లో మార్పులు అవసరం

తెలంగాణలో బిజెపితో పొత్తు ఉండదు : పవన్‌కల్యాణ్



ప్రచార రథం 'వారాహి'కి పూజలు చేస్తున్న పవన్ కల్యాణ్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

రాజకీయాల్లో మార్పులు అవసరమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. జాతీయ రాజకీయాల్లోకి బిఆర్ఎస్ పార్టీ రాకను స్వాగితిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బిజెపితో జనసేన పొత్తు ఉండదని తెలిపారు. తెలంగాణలో తమ పార్టీ భవిష్యత్తును కాలమే నిర్ణయిస్తుందని, ఇప్పటికైతే పరిమితమైన లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయాలనుకుంటున్నామని చెప్పారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామిని మంగళవారం దర్శించుకున్న ఆయన తన ప్రచార రథం 'వారాహి'కి పూజలు చేశారు. అనంతరం, కొండగట్టు సమీపంలోని బృందావన్ గార్డెన్‌లో మీడియాతో మాట్లాడారు. తాను ఒక ఆశయం కోసం పోరాడుతున్నానని, అందుకు తెలంగాణ గడ్డపై జరిగిన ఉద్యమాలే స్ఫూర్తినిచ్చాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణలో పాలన బాగుందన్నారు. ఆంధ్రా, తెలంగాణ సమస్యలు వేర్వేరని, రెండింటినీ పోల్చలేమని చెప్పారు. ఎపిలో పొత్తులపై ఎన్నికలప్పుడే స్పష్టత వస్తుందన్నారు. కొత్తగా పొత్తులు కోరి వచ్చే వారితో కలిసి వెళ్తామని, పొత్తులు కుదరకపోతే ఒంటరిగానే పోటీ చేస్తామని చెప్పారు. బిజెపి ఎపి మాజీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ జనసేనలో చేరుతారా? అన్న ప్రశ్నకు.. తమ మిత్రపక్షమైన బిజెపిలో ఉన్న ఆయన గురించి తాను ఎక్కువగా వ్యాఖ్యానించబోనని దాటవేశారు.

పవన్ కారుకు పంక్చర్

కొండగట్టు పర్యటన ముగించుకుని పవన్ హైదరాబాద్‌కు వస్తుండగా.. పవన్ వాహనం నాచుపల్లి క్రాస్ రోడ్డు వద్ద పంక్చర్ అయింది. సుమారు పది నిమిషాలపాటు ఆయన తన కారులోనే వేచి ఉన్నారు. భద్రత, పోలీసు బలగాలు అప్రమత్తమై కారుకి రక్షణ కల్పించాయి. దీంతో, కాసేపు ట్రాఫిక్ జామ్ అయింది. వెంటనే సిబ్బంది టైర్ మార్చడంతో బయల్దేరారు.

పవన్ అభిమాని మృతి

కొండగట్టు నుంచి హైదరాబాద్ తిరిగి వెళ్తున్న పవన్ కల్యాణ్‌ని ఆయన అభిమానులు కొందరు అనుసరించారు. వెల్లటూర్ మండలం కిషన్‌రావుపేట వద్ద రోడ్డు ప్రమాదానికి గురై వారిలో ఒకరు మృతి చెందారు ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.

'ఎగ్జామ్ వారియర్స్' స్ఫూర్తిదాయక పుస్తకం : గవర్నర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధానమంత్రి నరేంద్రమోడీ రచించిన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. ఈ పుస్తక తెలుగు అనువాదాన్ని మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆవిష్కరించారు.

వేమగిరిలో 20.59 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- కడియం

వేమగిరి జాతీయ రహదారి నుంచి విద్యుత్ కేంద్రానికి వెళ్లే రహదారి శివారున గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను కడియం పోలీసులు మంగళ వారం అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఆఫ్‌షోర్ పూర్తయ్యేదెన్నడో..?

- నీళ్లు ఇస్తామంటూ 15 ఏళ్లుగా ఊరింపు
- 38 శాతమే పనులు పూర్తి
- మూడున్నరేళ్లుగా నిలిచిపోయిన వైనం
- టెండర్ల దశలోనే మిగిలిన పనులు



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఆఫ్‌షోర్ పూర్తి చేసే నీళ్లు ఇస్తామంటూ 15 ఏళ్లుగా రైతులను ఊరించడమే తప్ప వాటిని పూర్తి చేయడంలో పాలకులు చిత్తశుద్ధి కనబరచడం లేదు. 2007లో వైఎస్ హయాంలో ప్రారంభమైన పనులు నేటికీ కొలిక్కి రాలేదు. టిడిపి ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలోనూ పనులను పూర్తి చేయలేకపోయింది. 2014-19 మధ్య కాలంలో 38 శాతం మాత్రమే పనులు జరిగాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన మూడేళ్ల కాలంలో ఒక్క శాతం పని కూడా కాలేదు. పనుల ఒప్పందాన్ని రద్దు చేసిన ప్రభుత్వం, మిగిలిన పనుల కోసం సవరించిన అంచనాలతో పంపిన ప్రతిపాదనలను గతేడాది సెప్టెంబరులో ఆమోదించినా నేటికీ టెండర్లు ఖరారు కాలేదు. దీంతో రిజర్వాయర్ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

టెక్కలి, నందిగాం, పలాస, మెళియాపుట్టి మండలాల్లోని 24,600 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టును ప్రారంభించింది. హైదరాబాద్‌కు చెందిన ఎస్‌విఇసి-ఇందు సంస్థతో రూ.123.25 కోట్లతో ఫిబ్రవరి 18, 2007లో ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం 2008 జనవరి నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. భూసేకరణ పనులు సకాలంలో కాకపోవడం, ప్రభుత్వం పెద్దగా దృష్టిసారించకపోవడంతో 2014 వరకు పనులు ప్రారంభం కాలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం, రిజర్వాయరు పనులను మళ్లీ అదే సంస్థకు అప్పగించింది. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని సవరించి రూ.466.28 కోట్లకు పెంచింది. ప్రాజెక్టు పనుల పూర్తికి జులై 7, 2019 వరకు గడువు ఇచ్చింది. టిడిపి ప్రభుత్వం అధికారం కోల్పోయిన నాటికి 38 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పాత నిర్మాణ సంస్థతో ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. మిగిలిన పనులకు సంబంధించి కొత్త రేట్లతో రూ.850 కోట్లు అంచనా వ్యయంతో గతేడాది సెప్టెంబరులో అధికారులు ప్రతిపాదనలు పంపారు.

నిర్మాణ పనులు జరిగింది 38శాతమే

రిజర్వాయర్ పనులు ప్రస్తుతం 38 శాతం మేర జరిగాయి. మట్టి పనులు 83,31,000 క్యూబిక్ మీటర్ల పని చేపట్టాల్సి ఉండగా 42,36,527 క్యూబిక్ మీటర్ల పని పూర్తయింది. ఇంకా 40,94,473 క్యూబిక్ మీటర్ల పని మిగిలి ఉంది. కాంక్రీట్ పనులు 1,31,544 క్యూబిక్ మీటర్ల పని చేపట్టాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,457 క్యూబిక్ మీటర్ల పని పూర్తయింది. మరో 1,29,087 క్యూబిక్ మీటర్ల పని పెండింగ్‌లో ఉంది. మరోవైపు భూసేకరణ కూడా పెండింగ్‌లో ఉంది. రిజర్వాయరు కోసం 2,435.72 ఎకరాలు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,338.74 ఎకరాలను సేకరించారు. ఇంకా 96.98 ఎకరాలు సేకరించాల్సి ఉంది.

పనులు 38 శాతం... ఖర్చు 71.73 శాతం

రిజర్వాయర్ పనులు ఇప్పటివరకు 38 శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఖర్చుల విషయంలో మాత్రం గత టిడిపి ప్రభుత్వం ఎక్కడా తగ్గలేదు. రిజర్వాయర్ నిర్మాణ అంచనా వ్యయాన్ని రూ.123.25 కోట్ల నుంచి రూ.466.28 కోట్లకు పెంచిన విషయం తెలిసిందే. అందులో రూ.314.16 కోట్లను వెచ్చించింది. అంటే 71.73 శాతం మేర ఖర్చు చేసింది.

ఖరారు కాని టెండర్లు

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పనుల పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంబంధిత నిర్మాణ సంస్థ కాంట్రాక్టును రద్దు చేసింది. పనులను వేరే నిర్మాణ సంస్థకు అప్పగించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. దీంతో ప్రారంభంలో ప్రాజెక్టు నిర్ణయించిన అంచనా వ్యయాన్ని సవరించిన రూ.852.45 కోట్లతో కొత్త స్టాండర్డ్ షెడ్యూల్ రేట్స్ (ఎస్ఎస్ఆర్)తో పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం గతేడాది సెప్టెంబరులోనే పరిపాలనా అనుమతులు జారీ చేసింది. ఇప్పటికీ టెండర్లు పిలవకపోవడంతో ఎప్పుడు పనులు మొదలవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

పెరిగిన ఆర్ అండ్ ఆర్ ఖర్చు

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.123.25 కోట్లతో ప్రారంభమయ్యాయి. 2014 అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం అంచనా వ్యయాన్ని అమాంతం రూ.466.28 కోట్లకు పెంచింది. అందులో రూ.314.16 కోట్లను ఖర్చు చేసింది. ఇప్పుడు నిర్మాణ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.123.25 కోట్ల నుంచి రూ.855 కోట్లకు పెంచింది. ఇప్పటివరకు రూ.314.57 కోట్లు ఖర్చు చేయడంతో మరో రూ.508.57 కోట్లను కేటాయించాల్సి ఉంది.

ఆఫ్‌షోర్ పూర్తికి ప్రాధాన్యం

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఆఫ్‌షోర్‌ను ప్రాధాన్యత ప్రాజెక్టుల జాబితాలో చేర్చి నిధుల కేటాయింపులపై ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. కొత్తగా టెండర్లను పిలిచి మిగిలిన పనులను పూర్తి చేస్తాం.

- డోల తిరుమలరావు, ఎస్ఇ, జలవనరులశాఖ

హామీని విస్మరించారు

సంప్రదించకుండానే కమిటీ ఏర్పాటుపై ట్విటర్ వేదికగా రెజ్లర్ల ఆవేదన



(ఫైల్ ఫొటో)

న్యూఢిల్లీ: పర్యవేక్షక కమిటీ ఏర్పాటు చేసే ముందు తమను సంప్రదిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర క్రీడాశాఖ ఆ మాటను తుంగలో తొక్కి ఏకపక్షంగా కమిటీని ఏర్పాటు చేసిందని అగ్రశ్రేణి రెజర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని వినేశ్ పోగాట్, సాక్షి మాలిక్‌తోపాటు బజరంగ్ పునియా వంటి అగ్రశ్రేణి రెజ్లర్లు మంగళవారం ట్వీట్టర్ వేదికగా వెల్లడించారు. మహిళా రెజ్లర్లపై డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు తామంతా ఆందోళన చేస్తున్న సమయంలో విచారణ కమిటీని ఏర్పాటు చేస్తామని, ఆ కమిటీ ఏర్పాటు చేసే ముందు తమతో సంప్రదిస్తామని, కమిటీలో ఎవరెవరు సభ్యులుగా ఉండాలో కూడా సంప్రదిస్తామని హామీ ఇచ్చినా, అలా కాకుండా ఏకపక్షంగా ఐదుగురు సభ్యులతో పర్యవేక్షక కమిటీని ఏర్పాటు చేసిందని ట్వీట్ చేశారు. ఇది బాధాకరమని విషయమని పేర్కొన్నారు. లైంగిక వేధింపులపై విచారణకు పర్యవేక్షక కమిటీ ఏర్పాటు చేశామని, ఐదుగురి సభ్యులతో కూడిన ఆ బృందానికి ప్రముఖ బాక్సర్ మేరీకోమ్ సారథ్యం వహిస్తారని కేంద్ర క్రీడామంత్రి అనురాగ్ ఠాకూర్ సోమవారం ప్రకటించిన మరుసటి రోజే అగ్రశ్రేణి రెజ్లర్లు పై విధంగా స్పందించడం చర్చనీయాంశమైంది. ఆ కమిటీ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులు, బెదిరింపులు, ఆర్థిక అవకతవకలతోపాటు పరిపాలనా లోపం వంటి అంశాలపై క్షుణ్ణంగా దర్యాప్తు చేయనుందని తెలిపారు. ఆ కమిటీలో మేరీకోమ్‌తోపాటు యోగేశ్వర్ దత్(రెజ్లింగ్), తృప్తి ముర్గండే(బ్యాడ్మింటన్), కమాండర్ రాజేశ్ రాజగోపాలన్(ద్రోణాచార్య అవార్డు గ్రహీత), రాధిక శ్రీమన్(సాయ్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్) ఉన్నట్లు అనురాగ్ ఠాకూర్ ప్రకటించిన సంగతి తెలిసిందే.



సెమీస్‌కు బెల్జియం, ఆస్ట్రేలియా

హాకీ ప్రపంచకప్

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచకప్ సెమీఫైనల్లోకి బెల్జియం, ఆస్ట్రేలియా జట్లు దూసుకెళ్లాయి. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ బెల్జియం జట్టు 2-0గోల్స్ తేడాతో న్యూజిలాండ్‌ను, ఆస్ట్రేలియా జట్టు 4-3గోల్స్ తేడాతో స్పెయిన్ ను ఓడించాయి. ఆస్ట్రేలియా-స్పెయిన్ జట్ల మధ్య జరిగిన క్వార్టర్స్ మ్యాచ్ ఉత్కంఠభరితం గా సాగింది. తొలి రెండు క్వార్టర్స్ ముగిసే సరికి ఆస్ట్రేలియా జట్టు 1-2గోల్స్‌తో వెనుక బడింది. ఆ తర్వాత మూడో క్వార్టర్స్ ప్రారంభం లోనే ఆస్ట్రేలియా జట్టు వరుసగా మూడు గోల్స్ కొట్టి 4-2 ఆధిక్యతలోకి దూసుకొచ్చింది. బెల్జియంజట్టులో బూన్(11వ ని.), వాన్ అల్‌బెల్(16వ ని.) ఒక్కో గోల్ కొట్టారు. నేడు ఇంగ్లండ్-జర్మనీ, నెదర్లాండ్స్-కొరియా జట్ల మధ్య క్వార్టర్‌ఫైనల్ పోటీలు జరగనున్నాయి.

పురాతన నాణేల ప్రదర్శన



ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

సంస్కారభారతి ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక మధురానగర్‌లోని ప్రజా విద్యాలయంలో మంగళవారం పురాతన నాణేలు, కరెన్సీ నోట్ల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన నాణేల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ సుమారు 300 సంవత్సరాల నుంచి 1947 వరకు చలామణిలో ఉన్న దేశవిదేశాల నాణేలు, నోట్లు ప్రదర్శనలో ఉంచారు. పాఠశాల విద్యార్థులకు దేశభక్తి గీతాలాపన, దేశభక్తుల చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఆకొండి పవన్ కుమార్, ఆకొండి ఉష, ఆకొండి సూర్య, మహమ్మద్ హుస్సేన్, కరస్పాండెంట్ వి. రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఐటి సంక్షోభం

ఉద్యోగులను తొలగిస్తూ ఐటి సంస్థలు ఎడాపెడా తీసుకుంటున్న నిర్ణయాలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. ఉద్యోగాలు కోల్పోతున్న వారిలో అధిక సంఖ్యాకులు భారతీయులేనన్న విషయం మరింత కలవరాన్ని కలిగిస్తోంది. అయినా ఏలినవారికి చీమ కుట్టినట్టు కూడా లేకపోవడం బాధాకరం. గ్లోబల్ అవుట్ ప్లేస్‌మెంట్ అండ్ కెరీర్ ట్రాన్సిషనింగ్ ఫర్మ్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2022వ సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా 965 కంపెనీలు 1.50 లక్షల మందిని ఇళ్లకు పంపాయి. 'లే ఆఫ్స్.ఎఫ్‌వైఐ' డేటా బేస్ ప్రకారం గత నవంబర్ నుండి ఇప్పటి వరకు రెండు లక్షల మందికి పైగా ఉద్యోగాలను పోయాయి. 2023లో కూడా ఈ తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. జనవరి నెలలో రోజుకు సగటున 3 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారని అంచనా! 23వ తేది వరకు 166 ఐటి కంపెనీలు 65 వేల మందిని ఉద్యోగాల నుండి తొలగించాయి. అనేక చిన్నాచితక కంపెనీలతో పాటు అమెజాన్, గూగుల్, ఫేస్‌బుక్, ట్విట్టర్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ ఐటి సంస్థలు కూడా ఉద్యోగులను సాగనంపే ప్రక్రియలో పోటీ పడుతుండటం విచారకరం. వీటిలో కొన్ని సంస్థలు ముందస్తు నోటీస్‌తో పాటు, కొంత మేరకు పరిహారం ఇస్తుండగా మరికొన్ని సంస్థలు అటువంటివేమి లేకుండానే లే ఆఫ్ కాగితాన్ని చేతుల్లో పెడుతున్నాయి. వర్క్ ఫ్రం హోమ్‌లో భాగంగా ఇళ్ల దగ్గర పనిచేస్తున్న సిబ్బందిని అత్యవసర సమావేశం పేరుతో ఆఫీసుకు పిలిచి మరీ చావుకబురు చెప్పిన అమానవీయ ఘనతను అమెజాన్ దక్కించుకుంది.

గత ఏడాది కాలంలో భారతదేశంలో ఉద్యోగాలు పోగొట్టుకున్న టెకీల సంఖ్య 22 వేల దాకా ఉంటుందని అంచనా. ప్రపంచ వ్యాప్తంగా వివిధ కంపెనీలు తొలగించిన వారిలో 40 శాతం మంది భారతీయులే అని వివిధ సంస్థలు తేల్చి చెబుతున్నాయి. రానున్న రోజుల్లో కోల్పోయే ఉద్యోగాల్లోనూ భారతీయులే అధికంగా ఉంటారని కూడా ఆ సంస్థలు పేర్కొంటున్నాయి. అదే జరిగితే పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగాలు పోగొట్టుకున్న భారతీయ యువత పరిస్థితి గందరగోళంగా మారింది. దీనికితోడు హెచ్1బి వీసాల నిబంధనలు వారి పరిస్థితిని మరింత అయోమయానికి గురిచేస్తున్నాయి. 60 రోజుల్లో వేరే ఉద్యోగం చూసుకోవాలని లేని పక్షంలో స్వదేశానికి వెళ్లిపోవాలని ఈ నిబంధన పేర్కొంటోంది. దీంతో వేలాదిమంది భారతీయ యువతీయువకులు దేశం కానీ దేశంలో ఉద్యోగాల వేటలో మునిగిపోయారు. మహా ఆర్థిక సంక్షోభంగా చరిత్ర కెక్కిన 2008-09 సంవత్సరాలనాటి కష్టకాలంలో ప్రపంచవ్యాప్తంగా 60 వేల మందిని టెక్ కంపెనీలు తొలగించాయి. తాజాగా తొలగింపుల జాబితా అంతకు రెండింతల కన్నా ఎక్కువకు చేరింది. మరోవైపు ప్రపంచాన్ని కుదిపేస్తున్న ఆర్థికమాంద్యం ఇప్పుడప్పుడే అదుపులోకి వచ్చే అవకాశం లేదని నిపుణుల అంచనా! ఈ నేపథ్యంలో కొత్త ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడం ఎంత కష్టమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ఈ పరిస్థితులు దేశంలో ఉన్న వారి తల్లిదండ్రులను, కుటుంబసభ్యులను కూడా తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. స్పందించి, అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఇంత పెద్ద సంఖ్యలో భారతీయ యువత విదేశాలలో రోడ్డున పడుతున్నా ఇంతవరకు ఒక్క సమీక్షా సమావేశం కూడా నిర్వహించకపోవడం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం. శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో డిసెంబర్ 23వ తేదిన టెక్ కంపెనీల్లో లే ఆఫ్‌ల గురించి అడిగిన ఒక ప్రశ్నకు పారిశ్రామిక వివాదాల చట్టం (1947)ను కేంద్ర ప్రభుత్వం ప్రస్తావించింది. దేశంలో ఉద్యోగాలను కోల్పోయిన 22 వేల మందిలో ఏ ఒక్కరికి కూడా ఈ చట్టం వర్తింపచేయలేదు. సంస్కరణల పేరుతో ఉన్న చట్టాలను నీరుగారుస్తూ మరోవైపు వాటినే జపించినందువల్ల ప్రయోజనం ఏమిటి? కేంద్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా విదేశాల్లో ముఖ్యంగా అమెరికాలో ఉన్న భారతీయ యువతకు భరోసా కలిగించే చర్యలు చేపట్టాలి. అక్కడి ప్రభుత్వాలతో సంప్రదించి, నిబంధనల్లో మార్పులు చేసేలా ఒత్తిడి తీసుకురావాలి. దేశీయంగానూ కార్మిక చట్టాలను టెక్ కంపెనీలు అమలు చేసేలా కఠిన చర్యలు చేపట్టాలి.

మహనీయుల మాట



పాఠకుని నుంచి తక్కువ సమయం తీసుకుని ఎక్కువ విజ్ఞానం అందించే రచయిత ప్రతిభావంతుడు.

- సి.సి. కోల్టన్, బ్రిటిష్ రచయిత.

మరో పోరాటానికి నాంది ...

జనవరి 26 ట్రాక్టర్ ర్యాలీ

విశ్లేషణ



రైతాంగ రక్షణ కోసం, వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం, కిసాన్ సంయుక్త మోర్చా కోరుతున్న విధంగా స్వామినాథన్ సూచించిన సి2+50 ఫార్ములా ప్రకారం మద్దతు ధరల చట్టం కోసం, రుణ విముక్తి చట్టం కోసం, సమగ్ర పంటల బీమా చట్టం కోసం, రైతులకు, కూలీలకు పెన్షన్ కోసం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం మరొక పోరాటం సాగించాల్సి ఉంది. అందుకు నాందిగా ఈ నెల 26న తలపెట్టిన ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొని, మరొక దీర్ఘకాల ఉద్యమానికి సిద్ధం కావాల్సి ఉంది.

కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పటానికి తెచ్చిన 3 వ్యవసాయ చట్టాల రద్దు కోసం రైతాంగం ఏడాది పైగా ఉద్యమం చేసింది. దాంతో కేంద్రం దిగివచ్చి వ్యవసాయ చట్టాలను రద్దు చేసింది. అంతేగాక రైతు సంక్షేమశాఖ కార్యదర్శి ద్వారా మిగిలిన కోర్కెల పరిష్కారానికి రాత పూర్వకంగా హామీ ఇస్తూ ఉద్యమాన్ని విరమించాలని కోరింది. సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వం 2021 డిసెంబరు 11న ఉద్యమాన్ని విరమించింది. ఇది జరిగి ఏడాది దాటినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుపరచలేదు. పైగా ప్రధానమైన పంటల మద్దతు ధరల ప్రస్తావన లేకుండానే మూడు చట్టాలను బలపరిచిన వారితో కమిటీని ఏర్పరిచింది. 2020 విద్యుత్ చట్ట సవరణ బిల్లును కూడా యథాతథంగా పార్లమెంటులో ప్రవేశపెట్టింది. ఈ రెండు అంశాలకు సంబంధించి సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంతో చర్చించనేలేదు. ఉద్యమం సందర్భంగా 70 వేల మంది రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయడం గాని, ఉద్యమం సందర్భంగా మృతి చెందిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇస్తామన్న హామీల గురించి గాని మాట్లాడడంలేదు. పరిస్థితిని సమీక్షించిన సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వం... రైతాంగం యొక్క న్యాయమైన కోర్కెల సాధనకై మరో ఉద్యమానికి సన్నద్ధం కావాలని పిలుపు ఇచ్చింది. అందుకు తొలి చర్యగా జనవరి 26 రిపబ్లిక్‌డే రోజున అన్ని జిల్లా కేంద్రాలలో ట్రాక్టర్ ర్యాలీలు జరపాలని నిర్ణయించింది.

పంటలకు మద్దతు ధర గ్యారంటీ చట్టం

సరళీకరణ విధానం ప్రారంభం అయినప్పటి నుండి వ్యవసాయ రంగం సంక్షోభానికి గురైంది. రైతాంగం ఆత్మహత్యలు నిత్యకృత్యాలయ్యాయి. వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారం చూపడం కోసం యు.పి.ఎ ప్రభుత్వం ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త డా॥స్వామినాథన్ నాయకత్వాన కమిషన్‌ను నియమించింది. వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తూ సమగ్రమైన నివేదిక ఇచ్చింది. ఆ నివేదికలో కీలకమైన అంశం రైతు పండించిన అన్ని పంటలకు సమగ్రంగా అయిన ఖర్చులపై అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరగా ఇవ్వాలని సూచించింది. దానినే సి2+50 ఫార్ములా అన్నారు. ఈ ఫార్ములాను అన్ని రైతు సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు ఆమోదించాయి. కాని అమలుకు నోచుకోలేదు.



వై. కేశవరావు

డా॥ స్వామినాథన్ సూచన ప్రకారం అన్ని పంటలకు సి2+50 ఫార్ములా ప్రకారం మద్దతు ధరలు అమలు పరుస్తామని 2014 ఎన్నికలలో బిజెపి హామీ ఇచ్చింది. అనతి కాలంలోనే స్వామినాథన్ కమిషన్ సూచనల అమలు జరపలేమని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. 2016లో పప్పుధాన్యాల ధరల సమస్యపై ప్రధానమంత్రి మోడీ స్వయంగా నియమించిన అరవింద సుబ్రమణ్యం కమిటీ ఇచ్చిన రిపోర్టును సైతం తుంగలో తొక్కింది.

రైతుసంఘాలన్నీ ఐక్యమై పోరాటం సాగించగా ఎ2+ఎఫ్ఎల్ అనే బూజు పట్టిన పథకాన్ని అమలు పరుస్తున్నానని చెప్పింది. ఎ2+ఎఫ్ఎల్ ఫార్ములా నాలుగు దశాబ్దాలకు పూర్వం తెచ్చింది. దాని ప్రకారం రైతుకు ఉత్పత్తి ఖర్చులు కూడా రావడం లేదని బి2 ఫార్ములా రూపొందించారు. పెరుగుతున్న పెట్టుబడులకు అది కూడా సరిగా లేదని సి2 ఫార్ములా రూపొందించారు. ఈ ఫార్ములా ప్రకారం ఉత్పత్తి ఖర్చులు సమగ్రంగా గుణిస్తారు. రైతుకు మిగులు ఏమి ఉండదు. అన్ని పారిశ్రామిక వస్తువులకు ధరలు నిర్ణయిస్తున్న పద్ధతిలోనే రైతు పండించిన పంటలకు కూడా ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి ఇవ్వాలని డా॥స్వామినాథన్ సూచించారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలంటే స్వామినాథన్ సూచించిన సి2+50 ఫార్ములా అమలు పరచడమే మార్గమని పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు నొక్కి చెప్తున్నారు.

రైతుకు రుణ మాఫీ ఎందుకు చేయాలి?

కేంద్రంలో మోడీ అధికారంలోకి రాగానే చేసిన మరొక చర్య మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమును నీరుగార్చటం. పైగా శాంతకుమార్ కమిటీ సూచన పేరుతో మార్కెట్‌లో జోక్యం చేసుకోవడం మానివేసింది. ప్రధానమంత్రి అన్నదాతా ఆయ్ సంరక్షణ్ యోజన పథకం పేరుతో ప్రభుత్వం కొనుగోలు చేయకుండా...తక్కువకు అమ్ముకున్న రైతులకు నగదు బదిలీ పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో మార్కెట్‌కు వచ్చిన సరుకులో 25 శాతం పంటకు మాత్రమే సరిపెట్టటంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయ ఆర్థికవేత్తల అంచనా ప్రకారం ఈ కాలంలో రైతాంగం ఏటా రూ.2 లక్షల కోట్లకు పైగా కోల్పోయారు. ఆ మేరకు రైతులు అప్పులతో ఉన్నట్లు అనేక నివేదికలు తెలియజేస్తున్నాయి. రైతులకు ఉత్పత్తి ఖర్చులు తగ్గించుకోమని చెప్తుంది. జీరో పెట్టుబడి వ్యవసాయం పేరుతో రైతులకు కథలు వినిపించింది. స్వామినాథన్ ఫార్ములా ప్రకారం కాదు గదా సి.ఎ.సి.పి నిర్ణయించిన ధరలు సైతం రైతుకు దక్కలేదు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, డీజిల్, క్రిమిసంహారకాలు, పరికరాలు తదితరాలపై కంట్రోల్ తొలగించడం, ధరలు పెంచటం, సబ్సిడీలు తగ్గించడం, పాల ఉత్పత్తులతో సహా జిఎస్టి విధించడం ద్వారా పెట్టుబడులు పెరిగాయి. రుణగ్రస్తమవుతున్న రైతాంగం ఆత్మహత్యలు చేసుకోవడం పెరిగింది. రైతులు ఒకసారి రుణాలు మాఫీ చేయాలని కోరుతుండగా...రైతుల రుణాలు మాఫీ చేస్తే ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని సన్నాయి నొక్కులు నొక్కింది. మరొకవైపు కార్పొరేట్ కంపెనీలకు ఈ కాలంలో రూ.10 లక్షల కోట్లు మాఫీ చేసింది. దేశానికి అన్నం పెట్టే రైతుకు రుణమాఫీ చేస్తే ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. దోపిడీదారులైన కార్పొరేట్లకు దోచిపెట్టడాన్ని ఏమనాలి? అందుకే ఒకసారి రైతుల మొత్తం రుణాలు రద్దు చేయాలి. కేరళ రాష్ట్రంలో అమలులో ఉన్న రుణ ఉపశమన చట్టం చేయడం అవసరం.

పి.ఎం ఫసల్ బీమా యోజన ఎవరి కోసం?

వ్యవసాయం ప్రకృతిలో ఆరుబయలులో చేయాల్సినది. మిగతా రంగాల లాగా రక్షణ గొడుగు కింది చేసేది కాదు. భూగోళంపై వచ్చే తుఫానులు, అతివృష్టి, అనావృష్టి, కరువులు, వరదలు, చీడలు, పీడలు పంటలను నిరంతరం నష్టపరుస్తుంటాయి. వీటికి తోడు ప్రభుత్వ విధానాల పుణ్యమా అని నాణ్యత లేని విత్తనాలు, కల్తీ క్రిమిసంహారకాలు రైతులను దెబ్బ తీస్తుంటాయి. వాటి నుండి రక్షణ కల్పించడం కోసం పంటల బీమా పథకం ప్రవేశపెట్టింది. పంటల బీమా పథకం రెండు దశాబ్దాల నుండి ప్రయోగాలకే పరిమితంగా ఉంది. మోడీ ప్రభుత్వం 2017లో మూడు పంటల బీమా పథకాలను ఏకం చేసి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ప్రవేశపెట్టారు. పంట దెబ్బతిన్న రైతులు చేలో నిలబడి స్మార్ట్‌ఫోనులో ఫోటో తీసి పెడితే చాలు 15 రోజులలో బీమా సొమ్ము వస్తుందని కబుర్లు చెప్పారు. ఈ పథకం అమలును 10 ప్రైవేటు బీమా కంపెనీలకు అప్పగించారు. 2019లో పార్లమెంట్ చర్చలలో తేలిందేమంటే 10 ప్రైవేటు బీమా కంపెనీలు ఒక్కొక్కటి వెయ్యి కోట్లకు పైగా లాభం ఆర్జించాయి.

పంట పోయిన రైతులకు బీమా పరిహారం అందలేదు. దీనితో 9 రాష్ట్రాలు ఏకంగా ఈ పథకం నుండి తప్పుకున్నాయి. మోడీ ప్రభుత్వం తెచ్చిన బీమా పథకం రైతుల ప్రయోజనాలకా? ప్రైవేటు కంపెనీల ప్రయోజనాలకా? కావున రైతులు కోరుతున్నట్లు సమగ్ర పంటల బీమా పథకం తీసుకురావల్సి ఉంది.

విద్యుత్ చట్ట సవరణ బిల్లు ఎవరి మేలు కోసం?

కేంద్రం లోని మోడీ ప్రభుత్వం 2 సంవత్సరాల నుండి 2020 విద్యుత్ చట్ట సవరణ బిల్లు తయారు చేసుకుని కూర్చున్నది. ఆ బిల్లు చట్టమైతే విద్యుత్ ఉత్పతి సంస్థలు, పంపిణీ సంస్థలు ప్రైవేటు కార్పొరేట్ కంపెనీల వశమవుతాయి. లక్షల కోట్ల విలువైన విద్యుత్ సంస్థల ఆస్థులన్నీ ప్రైవేటు కంపెనీల ఆస్థులుగా మారిపోతాయి. రాష్ట్ర ప్రభుత్వాల అజమాయిషీగాని, రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ అజమాయిషీ గాని ఉండవు. కేంద్ర ప్రభుత్వం నియమించే కేంద్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ అజమాయిషీలోకి వెళతాయి. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాలు రద్దవుతాయి. రాష్ట్రాలు నగదు బదిలీ పథకాలు పెట్టుకోవచ్చు. 20 శాతం సబ్సిడీలు మించి ఇవ్వడానికి వీలు లేదు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తారు. ప్రతి నెలా రీడింగ్ తీసి రైతుకు బిల్లు ఇస్తారు. రైతు బిల్లు చెల్లించాలి. రైతు ఉద్యమ విరమణ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంతో చర్చిస్తామని ప్రభుత్వం రాతపూర్వకంగా తెలియజేసింది. రైతుసంఘాలతో చర్చించకుండానే పార్లమెంటులో ప్రవేశపెట్టింది.

ఈ పథకాన్ని 11 రాష్ట్రాలు వ్యతిరేకించాయి. అయినా మన రాష్ట్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టం అవకుండానే 2020 లోనే మీటర్ల ఏర్పాటుకు జీవో 22 విడుదల చేసింది. పైలెట్ ప్రాజెక్టుగా శ్రీకాకుళం జిల్లాలో ప్రవేశపెట్టింది. స్మార్ట్ మీటర్లు బిగించడం వలన నష్టాలు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రయాస్ ఎనర్జీ గ్రూపుతో సర్వే నిర్వహించింది. ఆ నివేదికను బయట పెట్టడం లేదు. రైతాంగంలో ఆందోళన రావడంతో బిల్లులు ప్రభుత్వమే చెల్లిస్తుంది. 25 సంవత్సరాలు ఉచిత విద్యుత్ ఉంటుందని నమ్మబలుకుతున్నది. ఒక్కో మీటరుకు రూ.14000 ఖర్చు చేస్తుంది. ఇది అంబానీకి లాభాల పంట-రైతుకు గుదిబండలాగా మారుతుంది. దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకం ఎగిరిపోతుంది. స్వంతంగా బోరు వేసుకుని మోటారు పెట్టుకున్న రైతుకు మాత్రం బిల్లు చేతికి వస్తుంది.

రైతులకు, కౌలురైతులకు, వ్యవసాయ కార్మికులకు పెన్షన్ అక్కర్లేదా?

దేశంలో వ్యవసాయ రంగానికి తప్ప అన్ని రంగాలకు పెన్షన్‌లు ఉన్నాయి. స్వంత వ్యాపారాలు, సంపాదనలు సాగించుకుంటూ కేవలం 5 సంవత్సరాలు ఎమ్మెల్యేగా, ఎంపీగా పని చేసిన పాలకులు జీవితాంతం పెన్షన్ పొందుతున్నారు. ఎండనక, వాననక కరోనాలో సైతం పంటలు పండించి దేశానికి అన్నం పెట్టే రైతుకు, కూలీకి పెన్షన్ ఇవ్వాలనే తలంపు ఎందుకు లేదు? 60 ఏళ్ల దాటినా జీవనం సాగించడం కోసం పేదరైతులు, కౌలురైతులు వ్యవసాయ కార్మికులు పని చేయాల్సిందేనా? సంయుక్త కిసాన్ మోర్చా రైతులకు, కౌలురైతులకు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.5000 పెన్షన్ ఇవ్వాలని కోరుతున్నది.

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎ2+ఎఫ్ఎల్ పంటల ధరల విధానం, ప్రధానమంత్రి అన్నదాతా ఆయ్ సంరక్షణ్ యోజన పథకం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం, విద్యుత్ సవరణ చట్టం తదితర పథకాలన్నీ కార్పొరేట్ సంస్థల ప్రయోజనం కోసమేనని, రైతుల ప్రయోజనం కోసం కాదని తేటతెల్లం అయ్యింది. రైతాంగ రక్షణ కోసం, వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం, కిసాన్ సంయుక్త మోర్చా కోరుతున్న విధంగా స్వామినాథన్ సూచించిన సి2+50 ఫార్ములా ప్రకారం మద్దతు ధరల చట్టం కోసం, రుణ విముక్తి చట్టం కోసం, సమగ్ర పంటల బీమా చట్టం కోసం, రైతులకు, కూలీలకు పెన్షన్ కోసం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం మరొక పోరాటం సాగించాల్సి ఉంది. అందుకు నాందిగా ఈ నెల 26న తలపెట్టిన ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొని, మరొక దీర్ఘకాల ఉద్యమానికి సిద్ధం కావాల్సి ఉంది.

(వ్యాసకర్త : రైతుసంఘం సీనియర్ నాయకులు)

★

ఆర్థిక అసమానతల గుట్టు విప్పిన ఆక్స్‌ఫామ్

సమీక్ష



దేశ సంపదను స్వాహా చేస్తూ అపర కుబేరులుగా తయారవుతున్న సంపన్నులపై కొద్దిపాటి పన్ను వేసినా దేశంలోని దారిద్ర్యాన్ని కొంతమేరకైనా తగ్గించవచ్చని ఆక్స్‌ఫాం నివేదిక అభిప్రాయపడింది. శతకోటీశ్వరులపై ఒకే ఒక్క మారు మూడు శాతం పన్ను వేస్తే ఐదు సంవత్సరాలపాటు హెల్త్ మిషన్‌ను నిరాఘాటంగా నిర్వహించవచ్చు. రెండు శాతం పన్ను వేస్తే రానున్న మూడు సంవత్సరాల వరకు పౌష్టికాహారం అందించడానికి నిధుల కొరత వుండదు.

'అసమానతల అంతం కోసం ఉద్యమం' పేరుతో పనిచేస్తున్న 'ఆక్స్‌ఫామ్' సంస్థ ఇటీవల ఒక నివేదికను విడుదల చేసింది. 37 పేజీల ఈ రిపోర్టు అభివృద్ధి, దేశభక్తి చాటున పెరుగుతున్న సంపద రాశులు, పేదలపై పడుతున్న భారాల మోతలను మరోసారి బట్టబయలు చేసింది. ఒక్క మాటలో చెప్పాలంటే పెట్టుబడి పొట్ట విప్పి అందులోని పురుగులను బయటపెట్టింది. 'అంతా బాగుంది', 'దేశం ప్రపంచ అగ్రగామి స్థానానికి చేరుతుంది', 'విశ్వగురువులయ్యే కాలం వచ్చిందోచ్' అని పాలకులు, వారి వందిమాగధులు బాజాలు ఊదుకుంటున్న సమయంలోనే దేశ ప్రజల దుర్భర జీవితాలను అనేక అంతర్జాతీయ నివేదికలు బయటపెడుతున్నాయి. ఆకలి, మానవ స్వేచ్ఛ, ఆరోగ్య మరియు జీవనం, మానవాభివృద్ధి, పత్రికాస్వేచ్ఛ, పింఛన్ ఇలా అన్ని ప్రపంచ సూచికల్లో 2014 కంటే 2022 నాటికి అత్యంత వెనుకబడ్డామన్నది వీటన్నింటి సారాంశం. మరోవైపు శత కోటీశ్వరులు ప్రతి యేడు భారీగా పెరిగిపోతున్నారు. లెక్కలు చూపించని చీకటి బాబుల సంగతి కాక, లెక్కలు చెప్పిన వారి ప్రకారమే 2020లో 102 మంది శతకోటీశ్వరులు వుంటే 2022 నాటికి 166 మందికి పెరిగారు. 'ఇది మంత్రం కాదు, మహిమా కాదు, మ్యాజిక్ అంతకన్నా కాదు. తాయత్తు మహిమ' అన్నట్లు ఇది పెట్టుబడి, దానికి ఊడిగం చేసే ప్రభుత్వ విధానాల మహిమ.



వి.రాంభూపాల్

ఆక్స్‌ఫామ్ నివేదిక ఏం చెప్పింది?

దేశంలో అత్యంత ధనవంతులైన 30 శాతం మంది వద్ద దేశ సంపదలో 90 శాతం, అందులో 10 శాతం కుబేరుల వద్ద 80 శాతం, అందులో 5 శాతం అపర కుబేరుల వద్ద 62 శాతం, అందులో ఒక్క శాతం వున్న మహాకుబేరుల వద్ద 40.6 శాతం సంపద పోగుబడితే, సమాజంలో దిగువున ఉన్న యాభై శాతం జనం వద్ద కేవలం మూడు శాతం సంపద మాత్రమే వుందని ఈ నివేదిక ప్రకటించింది. 2012-2021 మధ్య దేశంలో సృష్టించబడిన సంపదలో 40 శాతం ఈ కుబేరుల వద్దకే చేరింది. ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా మహమ్మారి కాలంలో కూడా ఈ కుబేరుల లాభాలు తగ్గకపోగా 121 శాతం పెరిగాయని, నిమిషానికి రూ.2.5 కోట్లు, రోజుకు రూ.3,068 కోట్లు వీరి ఖాతాల్లోకి చేరాయనే కళ్ళు బైర్లుకమ్మే నిజాన్ని బయటపెట్టింది. మరోవైపు ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ సంఖ్యలో పేదలు 228.9 మిలియన్ మంది భారతదేశంలోనే వున్నారని, గత నాలుగు సంవత్సరాల్లో దేశంలో నిరుపేదల సంఖ్య 19 కోట్ల నుంచి 35 కోట్లకు చేరిందని చెప్పింది. 2020-21లో పొందిన పన్నుల మినహాయింపుల ద్వారా రూ.1,03,285.44 కోట్లు కార్పొరేట్ కంపెనీలు లాభపడ్డాయని వివరించింది.

దేశంలోని వంద మంది సంపన్నుల దగ్గర 54.12 లక్షల కోట్లు, అందులో ఎగువున వున్న పది మంది శతకోటీశ్వరుల దగ్గర 27.52 లక్షల కోట్లు పోగుబడ్డాయి. బిజెపి కి అత్యంత ప్రీతిపాత్రుడైన గౌతమ్ అదానీకి కరోనా సమయంలో కూడా ఎనిమిది రెట్లు ఆదాయం పెరిగి 10.96 లక్షల కోట్లకు అధిపతి అయ్యి దేశంలో అత్యంత ధనవంతుడుగా అవతరించాడు. సైరస్ పూనావాలా, శివనాడార్, రాధాకిషన్ దామని, కుమార బిర్లాలు ముందటి సంవత్సరం కంటే 2022లో 20 శాతం ఎక్కువ సంపద పోగేసుకున్నారని తెలిపింది. అంబానీలు సరేసరి. పెట్టుబడి ఆర్థికవేత్తలు లాభానికి మూలం డిమాండ్, సప్లయిలో చూపిస్తారు. అంటే ఉత్పత్తి చేసి, వాటిని మార్కెట్‌లో అమ్మకం చేసే క్రమంలో లాభాలు వస్తాయంటారు. కాని దేశంలో నూతన సంపన్నులుగా మారుతున్న ధనవంతులు పరిశ్రమలు పెట్టి ఉత్పత్తి చేసి లాభపడడంలేదు. ఉదా: దేశంలోని శతకోటీశ్వరుల్లో 32 మంది ఆరోగ్య రంగంలో వైద్య వ్యాపారం చేస్తూ కార్పొరేట్ ఆసుపత్రులు, మందుల తయారీ పరిశ్రమను తమ కంబంధ హస్తాల్లోకి తీసుకొని భారీగా లాభపడుతున్నారు. వీరిలో సైరస్ పూనావాలా, దిలీప్ సంఘ్వీ, మురళి దివి వంటివారు అగ్రస్థానంలో వున్నారు. సరళీకరణ విధానాల పేరుతో ప్రభుత్వ వైద్యాన్ని బలహీనం చేసి, కార్పొరేట్ వైద్యాన్ని మందగజమంత బలోపేతం చేశారు. అలాగే విద్యారంగం మరో అతి పెద్ద వ్యాపార పరిశ్రమగా మారింది. భవన నిర్మాణం, ఇతర సర్వీసు రంగాల్లో ఈ కుబేరులు జొరబడి ఒకవైపు కార్మికుల శ్రమను, మరోవైపు ప్రజల జేబులను లూటీ చేస్తున్నారు. ఇంతేకాదు దశాబ్దాల నుండి కార్మికుల శారీరక, మానసిక శ్రమల వల్ల అభివృద్ధి చెందిన ప్రభుత్వ రంగ సంస్థలను చౌకగా కొల్లగొట్టి లాభపడుతున్నారు. సహకార వ్యవస్థను ధ్వంసం చేసి సర్వం ప్రైవేట్ మయం చేసేశారు.

ఇది కార్పొరేట్ల ప్రభుత్వం

అనంతపురం జిల్లా కరువు గురించి ప్రముఖ జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్ చాలా సంవత్సరాల క్రితం ఒక చిన్న పుస్తకం (ఎవ్రీబడీ లవ్స్ ఎ గుడ్ డ్రాట్) రాశారు. కరువు అంటే కష్టాలు, ఆకలి, బాధలు కదా... ఎవరు ప్రేమిస్తారు? అంటే కరువును కూడా వాడుకొని కొందరు రాజకీయ నాయకులు, అధికారులు ప్రభుత్వ సొమ్మును ఎలా కాజేసి పేదల నోళ్లు కొట్టి... కార్లు, బిల్డింగ్‌లు ఎలా సమకూర్చుకుంటారో అందులో వివరించారు. అదే పద్ధతిలో కరోనా కాలంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు లాభాలు కూడబెట్టింది. 2020-21లో కార్పొరేట్ కంపెనీలు 70 శాతం లాభాలు సంపాదించగా, దేశంలోని 84 శాతం మంది ప్రజల ఆదాయం భారీగా తగ్గిపోయింది. గౌతమ్ అదానీ రోజుకు రూ.1,612 కోట్లు లాభపడ్డారు. కరోనాకు ముందే అంటే 2019లో కార్పొరేట్ పన్ను స్లాబ్‌ను 30 శాతం నుండి 22 శాతానికి తగ్గించారు. అలాగే కొత్తగా ప్రారంభించే కార్పొరేట్ కంపెనీలకు 15 శాతం మాత్రమే పన్ను విధించారు. దీనివల్ల గతంలో ఎన్నడూ లేనివిధంగా కార్పొరేట్ పన్ను వసూళ్ల 16 శాతం తగ్గాయి. వీటి మొత్తం విలువ లక్ష 84 వేల కోట్లు. ఇంతేకాదు కార్పొరేట్ కంపెనీలు వివిధ బ్యాంకులలో తీసుకున్న రుణాలను కేంద్రప్రభుత్వం పెద్ద ఎత్తున మాఫీ చేసింది. 201-7-18లో రూ.1,61,328 కోట్లు, 2018-19 రూ.2,36,265 కోట్లు, 2019-20 రూ.2,34,170 కోట్లు, 2020-21 రూ.2,02,781 కోట్లు, 2021-22లో రూ.1,57,096 కోట్ల రుణాలను అంటే గత ఐదు సంవత్సరాల్లో రూ.9,91,640 కోట్ల ప్రజల సొమ్మును ఈ కంపెనీలకు 'దేశభక్త' ప్రభుత్వం దోచి పెట్టింది.

సంపన్నులపై కొద్దిపాటి పన్ను వేసినా...

దేశ సంపదను స్వాహా చేస్తూ అపర కుబేరులుగా తయారవుతున్న సంపన్నులపై కొద్దిపాటి పన్ను వేసినా దేశంలోని దారిద్ర్యాన్ని కొంతమేరకైనా తగ్గించవచ్చని ఆక్స్‌ఫాం నివేదిక అభిప్రాయపడింది. శతకోటీశ్వరులపై ఒకే ఒక్క మారు మూడు శాతం పన్ను వేస్తే ఐదు సంవత్సరాలపాటు హెల్త్ మిషన్‌ను నిరాఘాటంగా నిర్వహించవచ్చు. రెండు శాతం పన్ను వేస్తే రానున్న మూడు సంవత్సరాల వరకు పౌష్టికాహారం అందించడానికి నిధుల కొరత వుండదు. 2017-2021 మధ్య గాలివాటంగా, అప్పనంగా లాభాలు సంపాదించిన కంపెనీలపై 20 శాతం పన్ను వేస్తే రూ.1.79 లక్షల కోట్లు వస్తుంది. దీంతో దేశంలోని ప్రాథమిక పాఠశాల టీచర్లలో 50 లక్షల మందికి సంవత్సరానికి సరిపడే వేతనాలు ఇవ్వవచ్చని అదానీ, అంబానీలపై ఒకటి, రెండు శాతం పన్ను వేసినా దేశంలో చాలా సమస్యలను పరిష్కరించవచ్చునని రకారకాల మార్గాలను నివేదిక సూచించింది. పెట్టుబడిదారీ వ్యవస్థలోనే తక్షణ పరిష్కార మార్గాలను సూచించిన ఈ నివేదికను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, కనీసం ఆ మార్గాలనైనా ఆచరించమని డిమాండ్ చేయడం దేశభక్తుల, ప్రజల ప్రేమికుల కర్తవ్యం.

(వ్యాసకర్త : సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు)

★

కవిత్వం

రాయాలనిపిస్తే రాసేయ్ ...

రాయాలనిపిస్తే రాసేయ్ ...
మదమెక్కిన మృగాళ్ళరాక్షసత్వంపై
నానా గడ్డితినే రాజకీయనాయకులపై

రాయాలనిపిస్తే రాసేయ్ ...
గృహ హింస పెట్టే ఖూనీకోరులపై
అవినీతికి పాల్పడే అధికారులపై

రాయాలనిపిస్తే రాసేయ్ ....
భ్రూణహత్యలకు పాల్పడే భ్రష్టులపై
వృద్ధ తల్లిదండ్రులను చూడని త్రాష్టులపై

రాయాలనిపిస్తే రాసేయ్ ....
నమ్మకాన్ని సొమ్ము చేసే చిట్‌ఫండ్లవాళ్ళపై
రైతుల కష్టాన్ని దోచుకునే దగా దళారులపై

రాయాలనిపిస్తే రాసేయ్ ....
కల్తీ సరుకులమ్మి దోచుకునే వ్యాపారులపై
నోట్లకు కక్కుర్తిపడి ఓట్లమ్ముకునే ఓటర్ల పై

రాయాలనిపిస్తే రాసేయ్ ...
ధనాన్ని దోచుకునే కార్పోరేట్ ఆసుపత్రుల పై
తీసుకున్న జీతానికి న్యాయంచేయని ఉద్యోగులపై

రాయాలనిపిస్తే రాసేయ్ ...
కరెన్సీ కోసం న్యాయాన్ని చంపేసే లాయర్లపై
అమ్యామ్యాలకోసం చట్టాన్ని చుట్టేసే పోలీసులపై

రాయాలనిపిస్తే రాసేయ్ ....
దేశసమగ్రతను దెబ్బతీసే ఉగ్రవాద ముష్కరులపై
సుపరిపాలన అందించని ప్రజాపాలకులపై

రాయాలనిపిస్తే రాసేయ్ ....
విద్యను వ్యాపారంచేసే కార్పోరేట్ కళాశాలలపై
ఓర్వలేక బురదచల్లే కుహనాకవులపై

రాయాలనిపిస్తే రాసేయ్ ....
రాసేస్తే పోయేదేమీలేదు
ప్రగతి నిరోధక సంకెళ్ళు తప్ప.

- కయ్యూరు బాలసుబ్రమణ్యం
సెల్ : 9441791239

ఆధునీకరణ జరిగేనా..!

- డెల్టా ఆధునీకరణపై కొనసాగుతున్న నిర్లక్ష్యం
- ఇప్పటికీ వేసవిలో చేపట్టబోయే పనులపై స్పష్టత కరువు
- వైసిపి ప్రభుత్వం వచ్చాక పూర్తిగా అటకెక్కిన పనులు
- ఎక్కడకక్కడ పంట కాలువల్లో పూడిక
- ప్రతియేటా వేలాది ఎకరాలు ముంపుబారిన



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పంట కాలువల ఆధునీకరణపై ఈ ఏడాదీ సందిగ్ధ పరిస్థితి కన్పిస్తోంది. రాబోయే వేసవిలో డెల్టా ఆధునీకరణకు సంబంధించి చేపట్టబోయే పనులకు సంబంధించి, టెండర్ల ప్రక్రియకు సంబంధించిన స్పష్టత లేదు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే ఈ ఏడాదీ డెల్టా ఆధునీకరణ పనులపై ప్రభుత్వం చేతులెత్తేసినట్లేనా అనే చర్చ రైతుల్లో నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా డెల్టా పరిధిలో 5.29 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. ఈ సాగు మొత్తానికి గోదావరి నుంచి పంట కాలువల ద్వారా వచ్చే సాగునీరే ఆధారం. 11 ప్రధాన కాలువలు, 300కుపైగా పిల్ల కాలువల ద్వారా సాగునీటి సరఫరా జరుగుతోంది. ఏడాదికి దాదాపు 20 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరుగుతోంది. ఇంత పెద్దఎత్తున పంట పండించేందుకు ఆధారమైన కాలువల ఆధునీకరణను వైసిపి ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టేసింది. తూడు, గుర్రపుడెక్క వంటివి తీయడం తప్ప ముఖ్యమైన కాలువల్లో మెరకతీసే పనులు మాత్రం నామమాత్రంగా మారాయి. 2007లో అప్పటి ప్రభుత్వం డెల్టా ఆధునికీకరణ పనుల నిమిత్తం రూ.1464.44 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకూ దాదాపు రూ.800 కోట్లు విలువ చేసే పనులు జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇంకా రూ.600 కోట్ల విలువ చేసే ఆధునీకరణ పనులు జరగాల్సి ఉంది. 2019లో అప్పుడే వైసిపి ప్రభుత్వం ఏర్పడటంతో ఆధునీకరణ పనుల ఊసే ప్రస్తావన లేకుండాపోయింది. 2020లో రూ.250 కోట్ల విలువైన పనులకు సంబంధించి జిల్లా ఇరిగేషన్ అధికారులు నివేదికలు తయారు చేసి ప్రభుత్వ అనుమతి కోసం పంపగా స్పందన లేదు. దీంతో పనులు జరగని పరిస్థితి ఏర్పడింది. 2021లో రూ.300 కోట్ల పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపగా అనుమతి రాలేదు. దీంతో మూడేళ్లు ఆధునీకరణ పనులు అనేవి ముందుకు సాగిన దాఖలాల్లేవు. జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాల్లో మంత్రులు మాట్లాడుతూ జనవరి నెలఖారులకల్లా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి కాలువలు మూసివేసిన వెంటనే పనులు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చేస్తుంటారు. అయితే క్షేత్రస్థాయిలో పనులు మాత్రం జరిగిన పరిస్థితి లేదు. ఈ ఏడాదిసైతం ఆధునీకరణ పనులు జరుగుతాయా.. లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనుండటంతో ఆ సంవత్సరంలో ఆధునీకరణ పనులు జరగడం కష్టమే.

ప్రతియేటా వేలాది ఎకరాలు మునక

డెల్టా ఆధునీకరణ జరగకపోవడంతో ప్రతియేటా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. చిన్నపాటి వర్షం వస్తే చాలు నారుమడులు, నాట్లు ముంపుబారిన పడుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. రబీలో ప్రతియేటా నీటిఎద్దడి సమస్యతో సతమతమవుతున్నారు. ఖరీఫ్‌లో భారీ వర్షాలు కురిసినప్పుడు పొలాల్లో నీరు కిందకు పారక పంటలు దెబ్బతింటున్నాయి. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా ఆధునీకరణ గురించి మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ ఏడాదైనా ప్రభుత్వం ఆధునీకరణ పనులపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - నూజివీడు (ఏలూరు జిల్లా)

ప్రస్తుత పరిస్థితుల్లో నిరుద్యోగ సమస్యకు పరిష్కారానికి యువత పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని, ఇందుకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు పి.ఏసుదాసు చెప్పారు. జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించేందుకు, పరిశ్రమల ద్వారా అమలవుతున్న పథకాల గురించి వివరించేందుకు మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంటర్ ప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఇడిపి) నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ పరిశ్రమలు నెలకొల్పేవారు ముందుగా ఆ పరిశ్రమపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. తమకు అనుభవమున్న, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఉత్పత్తులనే ఎంచుకోవాలన్నారు. ఉత్పత్తులు నాణ్యతగా ఉండేలా చూసుకోవాలన్నారు. పరిశ్రమల స్థాపనతో తాము ఉపాధి పొందడమేకాక మరికొంతమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు కావాల్సిన అనుమతుల కోసం 'సింగిల్ డెస్క్' పోర్టల్‌లో దరఖాస్తు చేస్తే 21 రోజుల్లోపు అనుమతులు లభిస్తాయన్నారు. కొత్తగా పరిశ్రమలు నెలకొల్పిన వారికి ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఐడిపి 2020-23 పారిశ్రామిక విధానం వచ్చే మార్చి 31తో ముగుస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ఎంఎస్ఎంఇ యూనిట్లు స్థాపించే జనరల్ కేటగిరీ వారికి 15 శాతం, బిసి, మైనార్టీ మహిళలకు 35 శాతం, ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రాజెక్టు వ్యయంలో 45 శాతం సబ్సిడీగా లభిస్తుందన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తీసుకున్న ఋణాలను సక్రమంగా బ్యాంకులకు తిరిగి చెల్లించాలన్నారు. ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన పథకం ద్వారా తయారీ రంగానికి రూ.50 లక్షల వరకూ, సేవా రంగానికి రూ.20 లక్షల వరకూ రుణం పొందొచ్చన్నారు. అభ్యర్థి వయసు 18 సంవత్సరాలు నిండి ఉండాలని, ఆదాయ పరిమితి లేదన్నారు. ఎపి ఫైనాన్షియల్ కార్పొరేషన్ ఏలూరు డిప్యూటీ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంటర్ ప్రెన్యూర్ ఎంచుకున్న యాక్టివిటీకి సంబంధించిన సంపూర్ణ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసుకుని తమను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ సుమధురవాణి, ఎంపిడిఒ సుందరి, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ నాగేంద్ర భూపాల్ పాల్గొన్నారు.

కలెక్టర్ ప్రశాంతికి బెస్ట్ ఎలక్టోలర్ ప్రాక్టీస్ అవార్డు

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి)

పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతికి రాష్ట్రస్థాయి బెస్ట్ ఎలక్టోలర్ ప్రాక్టీస్ అవార్డు లభించింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రస్థాయి బెస్ట్ ఎలక్టోలర్ ప్రాక్టీస్ అవార్డుకు ఎంపిక చేసినట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డును 13వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 25న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అందజేయనున్నారు. ఓటరు చైతన్య కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసినందుకు, అత్యధిక ఓటర్ల నమోదు చేసినందుకు గాను రాష్ట్రంలో ఎంపిక చేసిన ముగ్గురు కలెక్టర్లలో జిల్లా కలెక్టర్ ప్రశాంతికి ఈ అవార్డు లభించింది. జిల్లా కలెక్టర్‌కు అవార్డు లభించడం పట్ల అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శకంగా భూముల రీసర్వే

- సిఎం ప్రధాన సలహాదారు అజయ్ కల్లాం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

పారదర్శకంగా భూముల రీ సర్వేను నిర్వహించాలని సిఎం ప్రధాన సలహాదారు అజయ్ కల్లాం అన్నారు. భూముల రీ సర్వే పురోగతి భవిష్యత్తు కార్యాచరణపై మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన ప్రాంతీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లా కలెక్టర్లు, జెసిలు, సర్వే, రెవెన్యూ, సచివాలయ అధికారులు, స్పెషల్ సిఎస్ పి.సాయిప్రసాద్, సిసిఎల్ఎ కమిషనర్ సిద్ధార్థ జైన్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజయ్ కల్లాం మాట్లాడుతూ భూముల సమగ్ర రీసర్వే ప్రక్రియలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం అన్నారు. భూముల రీ సర్వే ప్రక్రియలో నిర్దిష్ట కాలపరిమితిలో ఫేజ్ విధానంలో 2 వేల గ్రామాలు చొప్పున రీ సర్వే పనులను చేపట్టి పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 2 వేల గ్రామాల్లో సర్వే పూర్తి అయ్యిందన్నారు. వీటికి సంబంధించి జగనన్న భూహక్కు పత్రాలను ఫిబ్రవరి నెలాఖరు నాటికి పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఫేజ్ -2 విధానంలో మరో 2 వేల గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియను నిర్వహించాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి వచ్చే అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కారం చేయాలన్నారు. జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిష్కారం సమయంలో రికార్డులు పరిశీలన కాకుండా వాస్తవ భూ యజమానులతో వాస్తవ స్థితిని నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఇందుకోసం తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలని ఆదేశించారు. 2023 డిసెంబరు నాటికి రీసర్వే పనులను పూర్తి చేసి భూయజమానులకు భరోసా కల్పించేలా భూహక్కు పత్రాలను అందించాలన్నారు. ఈ సర్వే ద్వారా భవిష్యత్తులో సివిల్ తగాదాలు కూడా ఉత్పన్నమయ్యే అవకాశం లేదని ఆయన తెలిపారు. సిసిఎల్ఎ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మాట్లాడుతూ రీసర్వే సమయంలో సమగ్రంగా రికార్డులను తనిఖీ చేయాలన్నారు. క్షేత్రస్థాయి తనిఖీల సందర్భంలో పర్యవేక్షణా భాధ్యతలను నిబద్ధతతో పాటించాలన్నారు. పర్యవేక్షణ సమయంలో ఎటువంటి అలసత్వం చూపరాదన్నారు. సిసిఎల్ఎ కమిషనర్ సిద్ధార్థ జైన్ మాట్లాడుతూ మరింత త్వరితగతిన రీ సర్వే పూర్తి చేసేందుకు అధికారులకు వచ్చే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నామన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొనే దిశలో టెలికాన్ఫరెన్స్ పరికరాలను సర్వే శాఖ ద్వారా అందించామన్నారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టరు డాక్టర్ కె.మాధవీలత, జెసి ఎన్.తేజ్ భరత్‌లు జిల్లాలో జరుగుతున్న రీసర్వే వివరాలను వెల్లడించారు. జిల్లాలో 272 గ్రామ పంచాయతీల పరిధిలో 6,05,332 ఎకరాల విస్తీర్ణం ఉందని, పేజ్ -1 లో 44 గ్రామాల్లో రీ సర్వే పనులు పూర్తి చేసామన్నారు. ఇందులో భాగంగా 1,9865 జెబిహెచ్ పట్టాలకు 18,690 పంపిణీ చేశామన్నారు. మ్యూటేషన్‌కు సంబందించి 2,768 అర్జీలకు, 2,300 పరిష్కరించామన్నారు. తప్పుగా నమోదైన ఖాతాకు సంబందించి 1,967 వచ్చాయని వాటిని నూరు శాతం పరిష్కరించామన్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, జెసి ఇలాక్కియా మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో 413 గ్రామ పంచాయితీల పరిధిలో పేజ్ -1 లో 207 గ్రామాలకు గాను 128 గ్రామాల్లో రీ సర్వే పనులు పూర్తి చేశామన్నారు. 49,658 జెబిహెచ్ పట్టాలకు 46,223 పంపిణీ చేశామన్నారు. మ్యుటేషన్‌కు సంబంధించి 110 అర్జీలు పరిష్కరించామన్నారు. రీ సర్వే తదుపరి క్లరికల్ తప్పిదాలకు సంబంధించి 120 పాత సర్వే నెంబర్లలో తప్పులను పూర్తిగా పరిష్కరించామన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా, జెసి ధ్యాన్ చంద్ మాట్లాడుతూ జిల్లాలో 121 హాబిటేషన్స్‌కు చెందిన గ్రౌండ్ ట్రూతింగ్ పనులు పూర్తి చేశామన్నారు. మ్యుటేషన్‌కు సంబంధించి 62 అర్జీలు పరిష్కరించామన్నారు. రీ సర్వే తదుపరి క్లరికల్ తప్పిదాలకు సంబందించి 65, పాత సర్వే నెంబర్లలో తప్పులను సరిదిద్దే ప్రక్రియలో వచ్చిన 66, భూమి కొలతలలో అసమతుల్యత (మిస్ మ్యాచ్) సంబంధించి వచ్చిన 66 అర్జీలను పరిష్కరించామన్నారు. ఏలూరు కలెక్టరు వి.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో 689 గ్రామ పంచాయితీల పరిధిలో పేజ్ -1 లో 80 గ్రామాలలో రీ సర్వే పనులు పూర్తి చేసామన్నారు. ఇందులో భాగంగా 24,506 జెబిహెచ్ పట్టాలకు 20,385 పంపిణీ చేశామన్నారు.

మ్యుటేషన్ కు సంబంధించి 2836 అర్జీలు పరిష్కరించామన్నారు. రీ సర్వే తదుపరి క్లరికల్ తప్పిదాలకు సంబందించి 526, పాత సర్వే నెంబర్లలో తప్పులను సరిదిద్దే ప్రక్రియలో వచ్చిన 161 వచ్చాయని వాటిని పరిష్కరించామన్నారు. భూమి కొలతలలో అసమతుల్యత(మిస్ మ్యాచ్) సంబంధించి వచ్చిన 323 అర్జీలను పరిష్కరించామన్నారు. సమావేశంలో నాలుగు జిల్లాల రెవెన్యూ సర్వే శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మోడీకి గుణపాఠం తప్పదు

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం (ఏలూరు)

కేంద్రంలో మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వనజ మాట్లాడుతూ విశాఖ హక్కు ఆంధ్రుల హక్కు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను, పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా ధారాదత్తం చేయడానికి బిజెపి ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఎంతోమంది ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం సహకారం లేకున్నా, సొంత గనులు కేటాయించకపోయినా అభివృద్ధి నడుస్తున్న ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటుపరం చేస్తామనడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని దీన్ని ధీటుగా ఎదుర్కోవాలని కోరారు. ప్రజల జీవన ప్రమాణాలకు మూలాధారమైన ప్రభుత్వరంగ పరిశ్రమ విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్ర వైఖరికి వ్యతిరేకంగా రాజకీయ ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ నన్నేపల్లి సాయిబాబు పాల్గొన్నారు.

26న ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయండి

ఎపి రైతుసంఘం

ప్రజాశకి-ఉంగుటూరు (ఏలూరు జిల్లా)

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం, రైతు రుణమాఫీ చట్టం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఈ నెల 26 న ఏలూరులో జరుగుతున్న రైతు ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక కైకరంలోని తూర్పు వీధి ఎల్ఐసి కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో రైతుల సమావేశం మంగళవారం నిర్వహించారు. సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడగా ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, జిల్లా కోకన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన బడ్జెట్

మత్స్యకార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు

చేతివృత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన రూ.52వేల కోట్లు కేటాయించాలని మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లేటి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వృత్తిదారుల జిల్లా సదస్సు స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో కమిటీ కో కన్వీనర్ పత్తిపాటి రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సదస్సులో ముఖ్యవక్తగా పాల్గొన్న కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీవృత్తిదారుని కుటుంబ సంక్షేమం కోసం రూ.25 వేలు ఆర్థిక సాయం (నగదు బదిలీ) అందించాలన్నారు. వారి కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇవ్వాలని కోరారు. వృత్తినిర్వహిస్తూ ఏదైనా మరణించిన వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. వృత్తిదారుల ఫెడరేషన్లు, కార్పొరేషన్లకు విధులు నిర్ణయించి, నిధులు కేటాయించి ఖర్చు చేయాలన్నారు. జనాభా ప్రాతిపదికన వృత్తిదారుల రక్షణ, సంక్షేమం, అభివృద్ధికి నిధులు కేటాయించాలని, మత్స్యకారుల జీవితాలను నాశనం చేసే 217 జిఒను రద్దు చేయాలని కోరారు. 343 జిఒ ప్రకారం పంచాయతీ చెరువులు స్థానిక మత్స్యకారుల సొసైటీలకు నామమాత్రపు లీజుకు ఇవ్వాన్నారు. హబ్ (ఫిష్ఆంధ్రా) పథకాన్ని నిలుపుదల చేయాలని కోరారు. చేపల వేట నిషేధ భృతిని రూ.20 వేలకు పెంచి సంప్రదాయ వేటగాళ్లు, చేపలు అమ్మే వారికి కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సబ్సిడీపై డీజిల్ రూ.20కు సరఫరా చేయాలని, గిట్టుబాటు ధర నిర్ణయించి బోర్డు పెట్టాలని కోరారు. చేనేతపై జిఎస్‌టి పూర్తిగా రద్దు చేయాలని, ప్రతీ చేనేత కార్మికునికి నేతన్న హస్తం ఇవ్వాలని, ప్రతీ చేనేత కార్మికునికి మగ్గం షెడ్డుతో కూడిన చెరువులు, దోభీ ఘాట్ స్థలాలు పిఒపిలో చేర్చి రజకులకు పూర్తి హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. జగనన్న చేదోడు పథకం వృత్తిదారులందరికీ ఇవ్వాలన్నారు. రజకులకు సామాజిక రక్షణ చట్టం (ఎస్‌సి, ఎస్‌టి) తరహాలో ఏర్పాటు చేయాలని, జిఒ 27 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అన్ని డిపార్ట్‌మెంట్లలో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను భర్తీ చేయాని కోరారు. కల్లుగీత వృత్తి అభివృద్ధి, ఆధునికీకరణకు నిపుణులతో కమిటీ వేయాలని, కల్లుగీత కార్పొరేషన్ పునరుద్ధరించి, ఆధునికీకరణ పరికరాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ హామీ ప్రకారం దశలవారీ మధ్యపాన నిషేధాన్ని అమలు చేయాలని, ఇఎంఐ లేకుండా వడ్డెర వృత్తిదారులకు రూ.5 లక్షల వరకూ కాంట్రాక్టర్లు ఇవ్వాలని, కంకర క్వారీలపై పూర్తి హక్కు వడ్డెర వృత్తిదారులకే కేటాయిస్తూ జిఒ విడుదల చేయాలని కోరారు. గొర్రెలకు డీవార్మింగ్ ఏడాదికి నాలుగుసార్లు ఇవ్వాలని, వ్యాధులకూ, వ్యాక్సిన్ సరిపడినంత సరఫరా చేయాలని, ప్రతి పంచాయతీ పరిధిలో వెటర్నరీ డాక్టర్లను ప్రమోట్ చేయాలని, గొర్రెలు, మేకల పెంపకందారులకు రూ.2 లక్షల యూనిట్‌గా 50శాతం సబ్సిడీతో ఇవ్వాలని కోరారు. క్షౌరవృత్తి చేసే ప్రతి వృత్తిదారునికి జగనన్న చేదోడు రూ.10 వేలు ఇవ్వాలని, ప్రతిక్షౌర వృత్తిదారునికి రాష్ట్ర ప్రభుత్వం స్టాల్స్ కేటాయించి కామన్ షెడ్ నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30వ తేదీన విజయవాడలోని మాకినేని బసవన్నయ్య విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో జరిగే చేతివృత్తిదారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని, తద్వారా భవిష్యత్ కార్యాచరణ రూపొందించి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా సదస్సులో ఎపి చేతి వృత్తిదారుల జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, నాయుడు బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చందనాడ నందేశ్వరరావు, గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం ఏలూరు నగర కార్యదర్శి కొత్తల శివకుమార్, ఎపి కల్లుగీత కార్మిక సంఘం ఏలూరు నగర కార్యదర్శి శొంఠి శంకర్‌రావు, పి.నాంచారయ్య, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు
- వ్యకాస, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమి స్వాధీనం


భూమిలో ముళ్ల చెట్లను తొలగిస్తున్న పేదలు, నేతలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు (బాపట్ల జిల్లా)

బాపట్ల జిల్లా కొల్లూరు మండలం చింతలంక, పెదలంక గ్రామాల పరిధిలోగల ప్రభుత్వ భూములను తమకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో పేదలు, దళితులు భూ స్వాధీన కార్యక్రమం మంగళవారం చేపట్టారు. సుమారు వంద ఎకరాల్లో ఉన్న ఖాళీ భూముల్లో ముళ్ల కంపలను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చింతలంక, పెదలంక పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయాలని, భూమిపై హక్కులు కల్పించాలని కోరుతూ నెలల తరబడి కలెక్టర్, తహశీల్దార్, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో భూమిలోని పొదలు, ముళ్లకంపను తొలగించి పేదలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ భూముల పక్కనే ఉన్న కృష్ణా నదిలో లక్షలాది రూపాయల ఇసుకను అక్రమార్కులు కొల్లగొడుతున్నా పట్టించుకోని అధికారులు గుడిసెలు వేసుకోడానికి, భూములను సాగుచేసుకోడానికి ప్రభుత్వ స్థలాన్ని శుభ్రం చేస్తుంటే రెవెన్యూ అధికారులు అడ్డుచెప్పడం సరికాదన్నారు. ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.సురేష్ పాల్గొన్నారు.

కర్ణాటక రెవెన్యూ మంత్రితో ధర్మాన బృందం భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కర్ణాటక రెవెన్యూశాఖ మంత్రి ఆర్ అశోకతో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలోని హైలెవల్ కమిటీ బృందం మంగళవారం బెంగుళూరులో భేటీ అయ్యింది. అసైన్‌మెంట్ భూములకు హక్కులు కల్పించే విషయంలో కర్ణాటక ప్రభుత్వం ఎటువంటి చట్టాలు తీసుకొచ్చింది? ఆయా భూములు పొందిన రైతుల సామాజిక, ఆర్థిక స్థితి గతుల్లో సంభవించిన మార్పుల గురించి అడిగి తెలుసుకున్నారు. అసైన్డ్ భూముల విషయంలో కర్ణాటకలో అమలులో ఉన్న విధానాలను, మార్గదర్శకాలను ఈ బృందం అధ్యయనం చేస్తోంది. ఈ కమిటీలో మున్సిపల్ శాఖమంత్రి ఆదిమూలపు సురేష్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రులు మేరుగ నాగార్జున, ఎమ్మెల్యేలు జొన్నలగడ్డ పద్మావతి ఉన్నారు.

అసలు కథ మొదలైంది

- వివేక హత్య కేసులో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అసలు కథ మొదలైందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి అన్నారు. సిబిఐ అధికారులు కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డికి నోటీసులు ఇవ్వడంపై కడపలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం పైవిధంగా స్పందించారు. నాలుగు సంవత్సరాలుగా కేసు ముందుకు పోకుండా అడ్డుకున్నారన్నారు. ఇప్పుడు సిబిఐ అధికారులు అవినాష్‌రెడ్డికి నోటీసు పంపించారని చెప్పారు. తప్పు చేసిన వారిని చట్టం శిక్షిస్తుందన్నారు.

ముఖచిత్ర హాజరుకోసం డ్యాష్‌బోర్డు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులకు కొత్తగా అమలు చేస్తున్న ముఖచిత్ర ఆధారిత హాజరుపై రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త నిర్ణయాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ఉద్యోగుల హాజరును అనునిత్యం పర్యవేక్షించేందుకుగాను ఎపి ఎఫ్ఆర్ఎస్ పేరిట డ్యాష్‌బోర్డును రూపొందించింది. ఎపిసిఎఫ్ఎస్ఎస్ ద్వారా దీనిని పర్యవేక్షించనున్నారు. ఆయా ఉద్యోగులకు సంబంధించిన శాఖాధిపతులు, కార్యదర్శులకు ప్రత్యేక లాగిన్ సౌకర్యాన్ని కూడా కల్పించారు. వారు ఉద్యోగుల హాజరును ఎప్పటికప్పుడు డ్యాష్‌బోర్డు ద్వారా పర్యవేక్షించాల్సి ఉంటుంది.

విచారణకు హాజరు కాని అవినాష్‌రెడ్డి

- ఐదు రోజులు సమయం కావాలని లేఖ
- పులివెందుల్లోనే సిబిఐ బృందం
- ఎంపిని అరెస్టు చేస్తారంటూ వదంతులు
- వైసిపిలో ఉత్కంఠ!

ప్రజాశక్తి- కడప ప్రతినిధి, వేంపల్లె

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మంగళవారం విచారణకు హాజరు కావాలని సిబిఐ అధికారులు సోమవారం నోటీసులు ఇచ్చినా కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరు కాలేదు. బిజీ షెడ్యూల్ కారణంగా విచారణకు హాజరు కాలేకపోతున్నానని, ఐదు రోజుల తర్వాత విచారణకు వస్తానని సిబిఐకి ఆయన లేఖ రాశారు. దీనిపై సిబిఐ అధికారులు ఏ విధంగా స్పందిస్తారనే ఉత్కంఠ నెలకొంది. సిబిఐ బృందం పులివెందుల్లోనే మకాం వేసి దర్యాప్తు కొనసాగిస్తోంది. హైదరాబాద్ నుంచి సిబిఐ ప్రత్యేక బృందం ఒకటి పులివెందులకు రానుందనే ప్రచారంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

ఐదు రోజులపాటు సమయం ఇవ్వకుండా విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలనే పేరుతో పిలిచి అరెస్టు చేస్తారనే ప్రచారనే ప్రచారంతో అధికార వైసిపిలో ఉత్కంఠ రాజ్యమేలుతోంది. అవినాష్‌రెడ్డికి సిబిఐ నోటీసులు ఇవ్వడం, ఆయన తండ్రి వైఎస్ భాస్కరరెడ్డి కోసం ఆరా తీయడం, భాస్కరరెడ్డి అందుబాటులో లేకపోవడంతో చర్చనీయాంశంగా మారింది. కేసు హైదరాబాద్‌కు మారాక వివేకా కేసు దర్యాప్తును సిబిఐ వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో సిబిఐ బృందం కిందిస్థాయి నిందితులను కొందరిని విచారించడం, మరికొందరిని అరెస్టు చేయడం, అప్రూవర్‌గా మార్చడం, పలువురు నిందితులను కోర్టుకు హాజరు పర్చడం తెలిసిందే. తాజా విచారణ నేపథ్యంలో అవినాష్‌రెడ్డిని, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డిని విచారణకు పిలవడంతో దర్యాప్తు కీలక దశకు చేరుకున్నట్లు భావిస్తున్నారు.

నిజం తేలాలి... న్యాయం గెలవాలి : అవినాష్‌రెడ్డి

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో నిజం తేలాలని, న్యాయం గెలవాలని తాను కూడా కోరుకుంటున్నానని వైఎస్.అవినాష్‌రెడ్డి చెప్పారు. కడప జిల్లా చక్రాయపేట మండలంలోని గండి క్షేత్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలుగా తనపై, తన కుటుంబంపై కొన్ని మీడియా సంస్థలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. 'నేనేమిటో... నా వ్యవహార శైలి ఏమిటో కడప జిల్లా ప్రజలకు బాగా తెలుసు' అని వ్యాఖ్యానించారు. ఇలాంటి ఆరోపణ చేస్తే మీ కుటుంబాలు కూడా ఎలా ఫీల్ అవుతారో ఒకసారి ఆలోచించాలని అన్నారు. సిబిఐ మళ్లీ నోటీసులు ఇస్తే కచ్చితంగా విచారణకు హాజరై అధికారులు అడిగే ప్రశ్నలకు తప్పకుండా సమాధానం ఇస్తానని చెప్పారు.

'వందేభారత్'లో రైల్వే జిఎం తనిఖీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు అరుణ్‌కుమార్ జైన్ మంగళవారం విజయవాడలో తనిఖీ చేశారు. స్టేషన్‌లోని వెయిటింగ్ హాళ్లు, ఫుడ్‌కోర్టులు, సబ్‌స్టేషన్లను కూడా ఆయన పరిశీలించారు. అనంతరం 'వందేభారత్' ప్రయాణీకులతోనూ, ఆన్‌బోర్డు సిబ్బందితోనూ మాట్లాడారు. భద్రతా సౌకర్యాలను, ఆహార నాణ్యతను ఆయన పరిశీలించారు. ఖమ్మం- వరంగల్ స్టేషన్ల మధ్య రైలు ఇంజన్‌లో ప్రయాణిస్తూ ట్రాక్‌ను పరిశీలించారు. సెమీ హైస్పీడ్ రైళ్లలో లోకో పైలెట్లు ఇతర సిబ్బంది అనుసరిస్తున్న భద్రతా విధానాలను కూడా పరిశీలించారు. వీటితో పాటు సెక్షన్ సిగ్నల్ వ్యవస్థను ట్రాక్ సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ తనిఖీల కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజరు ఎకె గుప్తా, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

విజయవాడ - దువ్వాడ మధ్య 130 కిలో మీటర్ల వేగంతో రైళ్లు

స్వర్ణ చతుర్భుజి, స్వర్ణ వికర్ణి విభాగాలన్నింటిలో రైళ్ల గరిష్ట వేగాన్ని గంటకు 130 కిలో మీటర్లకు పెంచినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. అందులో భాగంగా విజయవాడ - దువ్వాడ మధ్య గంటకు 130 కిలో మీటర్ల వేగంతో రైళ్లు నడిచేందుకు అనుమతినిచ్చింది.

హయ్యర్ ఇపిఎఫ్ కల్పించాలి

ఎన్ఎంయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులకు సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం హయ్యర్ ఇపిఎఫ్ ఆప్షన్ అవకాశం కల్పించాలని ఎపిపిటిడి ఎన్ఎంయు డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు పివి రమణారెడ్డి, వై శ్రీనివాసరావులు ఎపిఎస్ ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు వినతి పత్రం అందజేశారు. రిటైర్డ్ అయ్యాక మెరుగైన ఇపిఎఫ్ పెన్షన్ వచ్చేలా ఆర్‌టిసి ఉద్యోగులు హయ్యర్ ఇపిఎఫ్ కోసం ఆప్షన్‌ను తీసుకుంటే అధికారులు తిరస్కరిస్తున్నారని వివరించారు. ఇపిఎఫ్ హైయ్యర్ ఆప్షన్‌కు విల్లింగ్ ఇచ్చిన వారందరికీ అనుమతించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలవరం ఎమ్మెల్యే బాలరాజుకు గుండెపోటు

- స్టంట్ ఏర్పాటు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం, టి.నర్సాపురం


ఎమ్మెల్యే బాలరాజును పరామర్శిస్తున్న ఎంపి భరత్‌రామ్

పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు మంగళవారం గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులోని స్వగృహంలో ఉదయం లేచిన కొద్దిసేపటికే ఆయన శ్వాసతీసుకోడానికి ఇబ్బంది పడటంతో కుటుంబ సభ్యులు రాజమండ్రిలోని సాయి ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు బాలరాజుకు పరీక్షలు నిర్వహించి స్టంట్ అమర్చారు. ప్రస్తుతం ఆయన తమ పర్యవేక్షణలో ఉన్నారని, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఎమ్మెల్యే బాలరాజును రాజమండ్రి ఎంపి మార్గాని భరత్‌రామ్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.


సమావేశంలో మాట్లాడుతున్న అయోధ్య రామిరెడ్డి

'తాడికొండ' వైసిపి భేటికి ఎమ్మెల్యే శ్రీదేవి డుమ్మా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం వైసిపి విస్తృతస్థాయి సమీక్ష సమావేశం మంగళవారం తాడికొండలోని ఓ కళ్యాణ మండపంలో జరిగింది. నియోజకవర్గం అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గుంటూరు, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్లు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్, నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి గైర్హాజరయ్యారు. గత నెలలో జరిగిన నియోజకవర్గ సమావేశంలో అసమ్మతివర్గం నాయకులు ఆమెను మాట్లాడనీయకుండా అడ్డుకున్న నేపథ్యంలో ఆమె సమావేశానికి ముఖం చాటేశారని తెలిసింది. అంతేకాకుండా బ్యానర్‌లో సమన్వయకర్త ఫొటో ఎగువ భాగంలో వేసి ఎమ్మెల్యే శ్రీదేవి ఫొటో దిగువ భాగంలో వేయడం కూడా కార్యకర్తల్లో చర్చనీయాంశమైంది. ఈ సమావేశానికి వైసిపి జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ కూడా హాజరు కాలేదు. సమావేశంలో ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ పార్టీలో ఉన్న స్వల్ప మనస్పర్ధలు తొలగించుకొని కలసికట్టుగా పనిచేసి చేయాలని సూచించారు. రాష్ట్రంలో తాడికొండ నియోజకవర్గం నుండే మొదటి విజయం ప్రారంభం కావాలని అన్నారు

ఘనంగా శంబర జాతర


శంబరలో జరుగుతున్న పోలమాంబ సిరిమానోత్సవం

ప్రజాశక్తి-మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం శంబరలో పోలమాంబ అమ్మవారి జాతర అంబరాన్ని తాకింది. లక్షలాది మంది భక్తుల కోలాహలం మధ్య సిరిమాను సంబరం వైభవంగా జరిగింది. మంగళవారం మధ్యాహ్నం స్థానిక చదురుగుడి నుండి అమ్మవారి ఘటాలను మేళతాళాల నడుమ సిరిమాను వద్దకు తీసుకువచ్చారు. అనంతరం 3.45 గంటలకు పూజారి జన్నిపేకాపు రామారావు సిరిమానును అధిరోహించారు. గరుడ వారి ఇంటి వద్ద నుంచి మొదలైన సిరిమాను తరువాత సావిడి వీధిలోని మునసబు ఇంటి ముందునుంచి సాగింది. పటిష్ట పోలీసు బందోబస్తు, రోప్ పార్టీల మధ్య ఊరేగింపు చేపట్టారు. ప్రధాన రహదారి నుండి పలు వీధులు తిరుగుతూ చావిడివీధి వరకు సాగింది. అనంతరం అమ్మవారి ఘటాలను గద్దెవద్ద ఉంచారు. సిరిమాను 5.30 గంటలకు ముగిసింది. ఈ సంబరాన్ని పార్వతీపురం మన్యం జిల్లా అడిషనల్ ఎస్‌పి దిలీప్ కిరణ్ దగ్గరుండి పర్యవేక్షించారు. డిఎస్‌పిలు సుభాష్, హర్షిత చంద్రకు ఎప్పటికప్పుడు సూచనలు చేశారు. సిరిమానుకు రోప్ పార్టీ, పోలీస్ సిబ్బందితో రక్షణ వలయంగా ఏర్పడి ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకున్నారు.

జాతరను సందర్శించిన విజయనగరం ఎస్‌పి

సంబర పోలమాంబ అమ్మవారి సిరిమానోత్సవాన్ని జిల్లా ఎస్‌పి దీపికా పాటిల్ సందర్శించారు. జాతర విజయవంతంగా సాగేందుకు తీసుకున్న చర్యలను ఆమెకు అడిషనల్ ఎస్‌పి దిలీప్ కిరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు

అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ సిఎం

పోలమాంబ అమ్మవారిని డిప్యూటీ సిఎం రాజన్న దొర, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, సాలూరు మాజీఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ దర్శించుకున్నారు. దేవాదాయశాఖ అధికారులు డిప్యూటీ సిఎంకు ఘన స్వాగతం పలికారు అనంతరం జాతర ఏర్పాట్లపై అధికారులతో డిప్యూటీ సీఎం మాట్లాడారు.

గూగుల్‌లో బోనస్‌ల తగ్గింపు



- గడ్డు పరిస్థితులను ఎదుర్కోవడానికే కోతలు
- గూగుల్ సిఇఒ పిచాయ్ వెల్లడి

వాషింగ్టన్ : గూగుల్ ఇప్పటికే వేలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపించే పనిలో పడగా.. మరోవైపు ఉన్న సిబ్బంది బోనస్‌ల్లోనూ కోతలకు నిర్ణయం చేసింది. గూగుల్ వృద్ధి మందగించిన నేపథ్యంలోనే ఉద్యోగుల తొలగింపు ప్రక్రియను చేపట్టాల్సి వచ్చిందని ఆ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ (సిఇఒ) సుందర్ పిచాయ్ తెలిపారు. ఇటీవల గూగుల్ మాతృసంస్థ అల్ఫాబెట్‌లో 12వేల మందికి ఉద్వాసన పలికిన విషయం తెలిసిందే. ఇది కఠిన నిర్ణయమే అయినప్పటికీ.. గడ్డు పరిస్థితులను ఎదుర్కోవడానికి అలా చేయాల్సి వచ్చిందన్నారు. ఈ విషయంలో ముందస్తుగా స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోయి ఉంటే పరిస్థితులు మరింత దారుణంగా మారే అవకాశం ఉందన్నారు. సోమవారం కంపెనీ ఉద్యోగులతో అంతర్గతంగా ఏర్పాటు చేసిన మీటింగ్‌లో ఈ వ్యాఖ్యలు చేశారని రిపోర్టులు వస్తున్నాయి. వ్యయాల నియంత్రణ కేవలం ఉద్యోగుల తొలగింపులతోనే ఆగిపోదని పిచాయ్ పేర్కొన్నారు. బాధ్యతాయుత నాయకత్వ హోదాల్లో పని చేస్తున్న ఉద్యోగుల బోనస్‌ల్లోనూ కోతలు పెట్టనున్నామన్నారు. ఉద్యోగులందరికీ ఈ ఏడాది బోనస్‌లు తగ్గుతాయని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు సుదీర్ఘకాలం కంపెనీలో పనిచేసి తాజాగా ఉద్యోగం కోల్పోయిన వారికి పరిహార ప్యాకేజీని సిద్ధం చేస్తున్నామన్నారు. ఆర్థిక మాంద్యం భయాలు వెంటాడుతుండటంతో ఇప్పటికే ట్విట్టర్, మెటా, అమెజాన్ లాంటి దిగ్గజ కంపెనీలు వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. రిక్రూటింగ్, కార్పొరేట్ కార్యకలాపాలు, ఇంజినీరింగ్, ప్రొడక్ట్స్ బృందానికి చెందిన విభాగాలతో పాటు ఇతర విభాగాల్లోనూ గూగుల్ తొలగింపులకు పాల్పడింది.

సిఎస్‌తో పిఎన్‌జిఆర్‌బి బృందం భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పెట్రోలియం అండ్ నాచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు (పిఎన్‌జిఆర్‌బి) సభ్యులు ఎకె తివారి, ఎకె పాండాలతో కూడిన ప్రతినిధుల బృందం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డితో క్యాంపు కార్యాలయంలో మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సిజిడి) పైపు లైను విస్తరణకు సంబంధించిన వివిధ కీలక అంశాలపైన మౌలిక సదుపాయాల కల్పనకు సంబందించిన ఇతర అంశాలపై చర్చించారు. సిఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ సిజిడి పైపు లైను విస్తరణకు సంబంధించి అన్ని విధాల పూర్తి సహాయసహకారాలు అందిస్తామని హామీనిచ్చారు. పెట్రోలియం అండ్ నాచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు ప్రతినిధులు సిజిడి, నాచురల్ గ్యాస్ పైప్ లైను ప్రాజెక్టు ప్రగతినిసమీక్షించారు. ఈ సమావేశంలో ఎపిమారిటైం బోర్డు సిఇఓ షన్మోహన్, పిఎన్ జిఆర్‌బి సంయుక్త అడ్వైజరు పవన్‌యూనియాల్, డిప్యూటీ అడ్వైజరు ఆర్కెసాహి, ఎండి ఎపిజిడిసి, జిజిపిఎల్ పంకజ్‌భగత్, జిజిపిఎల్ జిఎం జి అంకయ్య పాల్గొన్నారు.

దళితులపై టిడిపిది కపటప్రేమ

- ఎంపి నందిగం సురేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికారంలో వున్నపుడు దళితులను, గిరిజనులను పూర్తిగా విస్మరించిన టిడిపి ఇప్పుడు కపట ప్రేమను చూపుతోందని వైసిపి ఎంపి నందిగం సురేష్ విమర్శించారు. చిత్తశుద్ధి వుంటే గత తెలుగుదేశం ప్రభుత్వంలో దళితులకు ఎంత ఖర్చు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్‌సిఎస్‌టి సబ్‌ప్లాన్‌ను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో పదేళ్ల పాటు పొడిగిస్తే స్వాగతించాల్సిందిపోయి విమర్శలకు దిగడం తగదన్నారు. టిడిపి హయాంలో సబ్‌ప్లాన్ నిధులను పొలం బడి, చంద్రన్న రైతు క్షేత్రాలు, మహిళలకు శానిటరి ప్యాడ్స్, సామాజిక పించన్లకు దారి మళ్లించిందన్నారు. ఎన్‌టిఆర్ సుజల స్రవంతి, చంద్రన్న పెళ్లి కానుకలకు కూడా సబ్‌ప్లాన్ నిధులను వాడారని విమర్శించారు. దళితుల నిధులను దారి మళ్లించిన టిడిపికి తమ ప్రభుత్వంపై మాట్లాడే అర్హత లేదన్నారు.

పెరిగిన రద్దీ... తగ్గిన ధరలు

- పుంజుకున్న మిర్చి క్రయవిక్రయాలు
- వర్షాలతో తగ్గిన నాణ్యత


గుంటూరు మిర్చియార్డులో మిర్చి బస్తాలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డులో రద్దీ కొనసాగుతోంది. మంగళవారం లక్షా 5 వేల 607 టిక్కిలు యార్డుకు వచ్చాయి. పల్నాడు, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, బళ్లారి జిల్లాల నుంచి ఎక్కువగా మిర్చి గుంటూరు యార్డుకు వస్తోంది. గత రెండు రోజులుగా రోజుకు లక్షకుపైగా టిక్కిలు రావడంతో యార్డు ప్రాంగణం నిండిపోయింది. లారీలు, ట్రాక్టర్లు, మినీ లారీలతో యార్డు పరిసరాలన్నీ కిటకిటలాడాయి. తెల్లవారుజామున భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సంక్రాంతి సెలవుల అనంతరం యార్డులో విక్రయాలు పుంజుకున్నాయి. కనిష్ట ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.25 వేలు లభించిందని అధికారులు తెలిపారు. సంక్రాంతికి ముందు కనిష్ట ధర రూ.10 వేల వరకు పలకగా ప్రస్తుతం రెండు వేల వరకు తగ్గింది. అయితే, గత నెలలో నాణ్యమైన సరుకు వచ్చినప్పుడు సగటు ధర రూ.20 వేల నుంచి రూ.22 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.17 వేల నుంచి రూ.20 వేల మధ్య వస్తోందని చెబుతున్నారు. సగటున గరిష్టంగా రూ.15 వేలకు మించి ధర వస్తోంది. మొత్తంగా గత కొన్ని రోజులుగా కనిష్ట ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.17 వేలు సగటున ఉంటోంది.

గత వారం కన్నా ఈ వారంలో క్వింటాలుకు రూ.3 వేల వరకు తగ్గింది. ఈ ఏడాది ఆశించిన దిగుబడి రావడం లేదని రైతులు చెబుతున్నారు. మొత్తం నాలుగు కోతల్లో 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని ఆశిస్తుండగా, ఈ ఏడాది పది క్వింటాళ్లకు మించి రాదనే ఆందోళన వారిలో నెలకొంది. పెట్టుబడి ఎకరాకు రూ.లక్షకుపైగా పెట్టినట్టు రైతులు తెలిపారు. కనీసం 15 క్వింటాళ్ల దిగుబడి రావాలని, ధర క్వింటాలుకు రూ.20 వేలకు తగ్గకుండా ఉంటేనే కొంత వరకు నష్టాల నుంచి బయటపడతామని చెప్తున్నారు. గత అక్టోబరులో కురిసిన అధిక వర్షాలు, మాండూస్ తుపాను వల్ల పైరు తడిసిన ప్రాంతాల్లో కొంత మేరకు నాణ్యత తక్కువగా ఉందని చెప్తూ, వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో నాణ్యత తగ్గలేదని, మార్పు సల్పమేనని అంటున్నారు. గత ఖరీఫ్‌లో సాగు చేసిన సరుకు ప్రస్తుతం యార్డుకు వస్తోంది. ధరలు నిలకడగా ఉన్నాయని, డిమాండ్ సప్లయ్ ప్రాతిపదికన స్వల్ప మార్పులతో యార్డులో సగటు ధర కొంత హెచ్చు తగ్గుదలతో ఉందని మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం తెలిపారు. సహజంగా యార్డుకు ఏటా ఫిబ్రవరి 15 తరువాత లక్ష టిక్కిలు వస్తాయని, కానీ ఈ ఏడాది జనవరి 17 నుంచి విక్రయాలు పుంజుకున్నాయని ఆయన చెప్పారు. గత వారం రోజుల్లో 60 వేల నుంచి 70 టిక్కిలు వస్తుండగా గత రెండు రోజులుగా లక్షకు పైగా టిక్కిలు వస్తున్నాయని ఆయన 'ప్రజాశక్తి' ప్రతినిధికి వివరించారు.

విస్తరణపై స్టెల్లా మోటో దృష్టి



బెంగళూరు : మైక్రో మొబిలిటీ రంగ స్టార్టప్ స్టెల్లా మోటో విద్యుత్ స్కూటర్ రంగ వద్ధిని ఒడిసిపట్టుకునేందుకు దేశ వ్యాప్తంగా తమ విస్తరణ ప్రణాళికలను వెల్లడించింది. జైడ్కా గ్రూపునకు చెందిన తమ సంస్థ తెలుగు రాష్ట్రాలు సహా కర్నాటక, మహారాష్ట్ర, ఢిల్లీలో విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. డీలర్లను ఆకర్షించేందుకు దరఖాస్తు ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా సరళీకృతం చేసినట్లు పేర్కొంది. దీంతో తమ వ్యాపార భాగస్వాములకు శిక్షణ, సర్టిఫికేషన్స్, మార్కెటింగ్‌ను అందించనున్నట్లు స్టెల్లా మోటో సిఇఒ, ఫౌండర్ నకుల్ జైడ్కా తెలిపారు.

సైబర్ సెక్యూరిటీలో 10వేల మందికి ఒప్పో శిక్షణ

న్యూఢిల్లీ : ఎంఇఐటివై కామన్ సర్వీసెస్ సెంటర్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఒప్పో ఇండియా తెలిపింది. దీని ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన మహిళలకు సాధికారత కల్పించడానికి ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రిత్వ శాఖ మద్దతుతో ఒప్పో ఇండియా, సిఎస్‌సి అకాడమీ సంయుక్తగా సైబర్ సాంగిని ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు పేర్కొంది. సైబర్ సెక్యూరిటీ, సైబర్ వెల్‌నెస్‌లో 10,000 మంది మహిళలకు ఇందులో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొంది.

గ్రామ సచివాలయాల వ్యవస్థ భేష్

- యుపి సిఎం ప్రత్యేక సలహాదారు సాకేత్ ప్రశంసలు
- ముఖ్యమంత్రి జగన్‌తో భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ పనితీరు, రైతు భరోసా కేంద్రాలు, సంచార పశు వైద్య శాలల ఏర్పాటు చేయడం బావుందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రత్యేక సలహాదారు సాకేత్ మిశ్రా కొనియాడారు. ప్రత్యేకించి గ్రామ సచివాలయాల వ్యవస్థ అద్భుతంగా ఉందనీ, మరో ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి వ్యవస్థ లేదని ఆయన తెలిపారు. ఇక్కడి అభివృద్ధి కార్యాక్రమాలపై అధ్యయనం చేసేందుకు సాంకేత్ మిశ్రా బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా మొదట కృష్ణా జిల్లా పెనుమలూరు మండలం మణుకూరు గ్రామాన్ని ఆయన సందర్శించారు. అనంతరం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సాకేత్ మీడియాతో మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ చాలా బావుందని, రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు ఎరువులను అందించడంతో పాటు మద్దతు ధర లభించేలా చూడటం బాగుందని ఆయన కొనియాడారు. సాకేత్‌మిశ్రాతో పాటు సిఎం స్పెషల్ సిఎస్ పూనం మాలకొండయ్య పాల్గొన్నారు.

సంక్షోభంలో ట్విట్టర్

అద్దె చెల్లించని దుస్థితి

శాన్‌ఫ్రాన్సిస్కో : ట్విటర్‌ను ఎలన్ మస్క్ స్వాధీనం చేసుకోకముందు సాఫీగా సాగిన సంస్థ కార్యకలాపాలు ఇప్పుడు రోజుకో సమస్యను ఎదుర్కొంటుంది. తాజాగా అద్దె చెల్లించలేని దుస్థితికి చేరడంతో తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందని స్పష్టమవుతోంది. శాన్‌ఫ్రాన్సిస్కోలోని 1355 మార్కెట్ స్ట్రీట్‌లోని ట్విట్టర్ ప్రధాన కార్యాలయ అద్దెను చెల్లించలేకపోతోంది. 4,60,000 చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని అద్దెకు తీసుకుంది. దీనికి డిసెంబరు నెలకుగానూ 3.36 మిలియన్ డాలర్లు, జనవరి నెలకు 3.42 మిలియన్ డాలర్ల చొప్పున అద్దె చెల్లించాల్సి ఉంది. కాగా.. అద్దె చెల్లింపుల్లో ఈ సంస్థ విఫలమైంది. దీంతో ఆ భవన యాజమాని శ్రీ నైన్ మార్కెట్ స్క్వేర్ ఎల్ఎల్‌సి సోమవారం కోర్టులో కేసు వేశారు. ఇతర దేశాల్లోనూ అద్దెలు చెల్లించడానికి ఎలన్ మస్క్ నిరాకరిస్తున్నారని రిపోర్టులు వస్తున్నాయి.

15 రోజులకు ఓ కొత్త విమానం

ఆకాశ ఎయిర్ వెల్లడి



ప్రతీ 15 రోజులకు ఒక కొత్త విమానాన్ని జోడించుకోవడం ద్వారా మెట్రో, చిన్న నగరాలకు కనెక్టివిటీని పెంచుకోనున్నామని ఆకాశ ఎయిర్ సహ వ్యవస్థాపకులు, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ ప్రవీణ్ అయ్యర్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ సహ వ్యవస్థాపకుడు బెల్సన్ కౌటినోతో కలిసి ఆయన మాట్లాడుతూ.. కొత్తగా తమ నెట్‌వర్క్‌లో 13వ గమ్యస్థానం హైదరాబాద్ నుంచి రోజువారీ విమాన సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. జనవరి 25 నుంచి హైదరాబాద్ - బెంగళూరు, హైదరాబాద్ - గోవా మధ్యన కొత్త సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో 21 రూట్లలో వారానికి 575 విమానాలకు చేరినట్లయ్యిందన్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణీ నగరాలపై దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు. ప్రస్తుతం తమ వద్ద 14 విమానాలు ఉన్నాయని.. 2023 మార్చి ముగింపు నాటికి 18కి చేరనున్నాయన్నారు.

కావేరీ సీడ్స్‌కు రూ.38 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రముఖ విత్తనాల కంపెనీ కావేరీ సీడ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 313.24 శాతం వృద్ధితో రూ.37.54 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.9.08 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.102 కోట్లుగా ఉన్న కంపెనీ రెవెన్యూ.. క్రితం క్యూ3లో 20.97 శాతం పెరిగి రూ.123.49 కోట్లకు చేరాయి. కాటన్ రెవెన్యూలో 6.20 శాతం, హైబ్రిడ్ రైత్ రెవెన్యూలో 117 శాతం చొప్పున వృద్ధి చోటు చేసుకుందని ఆ కంపెనీ తెలిపింది. గడిచిన క్యూ3లో, తొమ్మిది మాసాల కాలంలోనూ మెరుగైన ఆర్థిక ఫలితాలు సాధించామని కావేరీ సీడ్స్ సిఎండి జివి భాస్కర్ రావు తెలిపారు.

లక్నోలో కుప్పకూలిన భవనం

- ముగ్గురి మృతి, శిథిలాలల్లో ఎమినిది మంది?

లక్నో: ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నో మంగళవారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఇజ్రత్ గంజ్ ప్రాంతంలో ఐదు అంతస్తుల భవనం కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. శిథిలాల్లో ఇంకా ఎనిమిది మంది చికుకున్నట్లు సమాచారం. మంగళవారం సంభవించిన భూకంప కారణంగా ఈ భవానికి ముందుగా పగుళ్లు ఏర్పాడ్డాయని, తరువాత ఈ భవనం కూలిపోయిందని స్థానికులు చెబుతున్నారు. సమాచారం తెలిసిన వెంటనే ఎన్‌డిఆర్‌ఎఫ్, ఇతర సహాయక బృందాలు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపడుతున్నాయి. అగ్నిమాపక సిబ్బంది కూడా సంఘటన స్థలికి చేరుకున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నేపాల్ సంభవించిన భూకంపం ప్రభావ కారణంగా ఉత్తర భారతంలోనూ భూ ప్రకంపనలు చోటు చేసున్నట్లు వార్తలు వచ్చాయి. భవనం కుప్పకూలిన సంఘటను ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పతక్ ధ్రువీకరించారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు మూడు మృతదేహాలను వెలికి తీసినట్లు చెప్పారు. మరికొందరు శిథిలాల్లో చిక్కుకున్నట్లు ఆయన వెల్లడించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



దిగ్విజయ్ వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదు : రాహుల్

శ్రీనగర్ : కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ చేసిన సర్జికల్ స్ట్రైక్స్ వ్యాఖ్యలపై మంగళవారం రాహుల్ గాంధీ స్పందించారు. దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. జమ్ములో నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ.. దిగ్విజయ్ వ్యాఖ్యలతో తాను, పార్టీ ఏకీభవించడం లేదని అన్నారు. సాయుధ బలగాలు ఎలాంటి రుజువులు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అవి ఆయన వ్యక్తిగతమైన వ్యాఖ్యలని, వాటితో పార్టీకి సంబంధం లేదని అన్నారు. పార్టీ అభిప్రాయాలు చర్చల నుండే వెలువడుతాయని, మన భద్రతాదళాల సామర్థ్యం తనకు తెలుసునని అన్నారు. వారు ఎలాంటి రుజువులు చూపించాల్సిన అవసరం లేదని రాహుల్‌గాంధీ వెల్లడించారు. జమ్ముకాశ్మీర్‌లో కొనసాగుతున్న భారత్ జోడోయాత్రలో సోమవారం దిగ్విజయ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్జికల్ స్ట్రైక్స్ గురించి బిజెపి పదేపదే ప్రస్తావిస్తోందని, కానీ రుజువులు మాత్రం ఇప్పటివరకు చూపించలేకపోయిందని అన్నారు.

జోడోయాత్రలో ఊర్మిళా మటోండ్కర్

జమ్ము : కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ నేతత్వంలో భారత్ జోడో యాత్ర జమ్ములో కొనసాగుతోంది. మంగళవారం ఉదయం జమ్ములోని గారిసన్ పట్టణం నగ్రోటా నుండి ప్రారంభమైన జోడోయాత్రలో బాలీవుడ్ నటి, రాజకీయ నేత ఊర్మిళా మటోండ్కర్ పాల్గొన్నారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య ఊర్మిళా, రాహుల్‌పాటు ప్రముఖ రచయిత పెరుమాళ్ మురుగన్, జమ్ముకాశ్మీర్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వికార్ రసూల్ వానీ, మాజీమంత్రి అబ్దుల్ హమీద్‌తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు, మద్దతుదారులు యాత్రలో పాల్గొన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ఆరు నెలలకే ఊర్మిళ 2019 సెప్టెంబర్‌లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. అనంతరం 2020లో శివసేనలో చేరారు. కన్యాకుమారిలో ప్రారంభమైన జోడో యాత్ర జనవరి 30న శ్రీనగర్‌లోని షేర్ ఎ కశ్మీర్ క్రికెట్ స్టేడియంలో నిర్వహించనున్న భారీ ర్యాలీతో ముగియనుంది.

విప్లవాన్ని క్యూబా ఎప్పటికీ విడిచిపెట్టదు : కానెల్

బ్యూనస్ ఎయిర్స్ : తమ దేశం ఎప్పటికీ విప్లవాన్ని విడిచిపెట్టదని, బెదిరింపులకు భయపడదని క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ డియాజ్- కానెల్ పేర్కొన్నారు. అర్జెంటీనా శాసనసభ్యులు, రాజకీయ, సామాజిక, కార్మిక, మరియు సంఘీభావ సంస్థల ప్రతినిధులతో రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో నిర్వహించిన సమావేశంలో డియాజ్ కానెల్ వ్యాఖ్యానించారు. సామ్రాజ్యవాద దురాక్రమణలను ఎదుర్కొంటూనే తమకు సహకరిస్తున్న తమ సోదరులకు కృతజ్ఞతలని అన్నారు. పరాజయాన్ని అంగీకరించదని ఎప్పటికీ తల వంచదని చెప్పారు. సామ్రాజ్య వాద దురాక్రమనణలను ఎదుర్కోవడంలో తమ దేశానికి సహకరిస్తున్న తమ సోదరులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. తాము గెలవడానికి, మెరుగైన ప్రపంచాన్ని స్థాపించడానికి పోరాడుతూనే ఉంటామని, ఇందుకు మీ సహకారం కావాలని అన్నారు. మంగళవారం జరిగిన కమ్యూనిటీ ఆఫ్ లాటిన్ అమెరికన్ అండ్ కరేబియన్ స్టేట్స్ (సిఇఎల్‌ఎసి) దేశాల 7వ సదస్సులో... ప్రాంతీయ సమైక్యత, భిన్నత్వంలో ఏకత్వం, అలాగే ఈ ప్రాంతాన్ని 'పీస్ జోన్'గా ప్రకటించడాన్ని సమర్థించారు. తమ దేశంపై అమెరికా విధించిన నిర్బంధాన్ని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశాల జాబితాలో చేర్చడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ సదస్సులో సామ్రాజ్యవాద ఆంక్షలను అధిగమించేందుకు చర్యలను ప్రతిపాదించాలని సూచించారు. మనల్ని మనం విముక్తి చేసుకోవాలని, సామాజిక ఉద్యమాల్లో ప్రజల క్రియాశీల భాగస్వామ్యాన్ని సాధించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

మానవత్వం కోసం నిలిచిన చే

- క్యూబా ప్రజల ఐక్యతను నాశనం చేయడానికి అమెరికా ప్రయత్నం
- చేగువేరా కుమార్తె అలైదా గువేరా
- క్యూబాకి ఎల్లప్పుడూ సంఘీభావం: సీతారాం ఏచూరి
- అలైదా గువేరా, ఎస్తెఫానియాకు ఢిల్లీలో ఘనస్వాగతం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

చే గువేరా మానవత్వం కోసం నిలిచారని చేగువేరా కుమార్తె అలైదా గువేరా తెలిపారు. వర్ణం, భాష, సంస్కృతి... మొదలైన భేదాలు ఉన్నా మనం ఒక్కటే అనే మానవతా భావం ఉండాలని అన్నారు. ప్రపంచంలో ఎలాంటి వ్యవస్థలోనైనా సమానత్వం కోసం నిలబడాలని క్యూబా విశ్వసిస్తుందని నొక్కి చెప్పారు. చేగువేరా కుమార్తె అలైదా గువేరా, మనవరాలు ఎస్తెఫానియాకు ఢిల్లీలో ఘనస్వాగతం లభించింది. మంగళవారం నాడిక్కడ హరి కిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో జాతీయ క్యూబా సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సభ జరిగింది. వందలాది మంది 'చే' అభిమానులు విప్లవ గీతాలు ఆలపిస్తూ, నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. జెఎన్‌యు, ఢిల్లీ యూనివర్శిటీకి చెందిన మలయాళీలతో సహా చాలా మంది విద్యార్థులు సూర్జీత్ భవన్‌కు తరలివచ్చారు. జెఎన్‌యు స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షురాలు ఐషీఘోష్ పుష్పగుచ్ఛాన్ని అలైదా గువేరాను అందజేశారు. ఈ సందర్భంగా అలైదా ఆదరణకు కృతజ్ఞతలు తెలుపుతూ అమెరికా నిషేధం కారణంగా క్యూబా అనుభవిస్తున్న సవాళ్లను వివరించారు. క్యూబా అమెరికాతో పోరాడగలుగుతోందని, దానికి కారణం ఒక్కటేనని, క్యూబా ప్రజల ఐక్యత వల్లనే అని ఆమె నొక్కి చెప్పారు. అందుకే క్యూబా ప్రజల ఐక్యతను నాశనం చేసేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని విమర్శించారు. అమెరికా ఆంక్షలను ఎదుర్కోవడానికి, అవసరమైన వస్తువులను దిగుమతి చేసుకోవడానికి క్యూబా భారీగా వ్యయం చేయాల్సి వస్తుందని అన్నారు. క్యూబాకు సహకరించే అన్ని దేశాలు, వాణిజ్య సంస్థల పట్ల అమెరికా శత్రు వైఖరి అవలంబిస్తోందని పేర్కొన్నారు. అయితే అమెరికా బెదిరింపులను పట్టించుకోకుండా క్యూబాకు సహకరించే దేశాలు ఉన్నాయని, క్యూబా ఆ దేశాలు, సంస్థల పట్ల విధేయతగా ఉంటుందన్నారు. క్యూబా వైద్యులు ఏ దేశానికైనా, ఏ సమయంలోనైనా సేవ చేస్తారని అన్నారు. అమెరికా భయంతో ఐదేళ్ల చిన్నారికి సులువుగా దొరికే మందు ఇవ్వడానికి ఏ దేశం సిద్ధంగా లేదని ఆమె తెలిపారు.

క్యూబాకి ఎల్లప్పుడూ సంఘీభావం: సీతారాం ఏచూరి

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ క్యూబా, భారతదేశం మధ్య సంఘీభావాన్ని గుర్తుచేసుకున్నారు. అలీన ఉద్యమంలో నాయకత్వం గురించి పంచుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అలీన దేశాల సదస్సులో పాల్గొనకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. క్యూబాకి ఎల్లప్పుడూ సంఘీభావంగా ఉంటామన్నారు. 'ది వైర్' ఎడిటర్, ప్రముఖ పాత్రికేయుడు సిద్ధార్థ్ వరదరాజన్ మాట్లాడుతూ జి-20కి అధ్యక్షత వహించే అవకాశాన్ని భారత్ సద్వినియోగం చేసుకోవాలని, క్యూబాపై అప్రజాస్వామిక, అమానవీయ ఆర్థిక ఆంక్షలను ముగించే ప్రతిపాదనను తీసుకురావాలని అన్నారు. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా మాట్లాడుతూ క్యూబా పట్ల సంఘీభావంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ క్యూబాకి భారతదేశం అండగా ఉండాలన్నారు. ఆర్జేడి ఎంపి మనోజ్ ఝా, క్యూబా రాయబారి అలెజాండ్రో సిమాన్కాస్, నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా కన్వీనర్ ఎంఎ బేబి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డియుటిఎ మాజీ అధ్యక్షురాలు నందితా నారాయణ్, సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి కెఎం తివారీ, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఆర్. అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ రూల్స్‌లో సవరణలపై మీడియా సంస్థలు ఆందోళన

- సంబంధిత వర్గాలతో చర్చించకుండా ముందుకు వెళ్లొద్దు : ఐఎన్‌ఎస్

న్యూఢిల్లీ : ఐటీ నిబంధనావళికి సవరిస్తూ మోడీ ప్రభుత్వం విడుదల చేసిన ముసాయిదా ప్రతి మీడియా వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రభుత్వ చర్యను 'ద ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ' (ఐఎన్‌ఎస్) తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రతిపాదిత సవరణలను వెంటనే నిలుపుదల చేయాలని కేంద్రాన్ని కోరింది. ఏకపక్షంగా నిబంధనల్లో మార్పులు చేయరాదని, సంబంధిత వర్గాలతో చర్చించాకే ముందుకు వెళ్లాలని కేంద్ర ఐటీ మంత్రిత్వశాఖకు తెలిపింది. ఐటీ చట్టాన్ని సవరిస్తూ మోడీ సర్కార్ కొద్ది రోజుల క్రితం ముసాయిదా ప్రతిని సిద్ధం చేయగా, దీనిపై మీడియా సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) ఆధ్వర్యంలో నడిచే ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్ ఏదైనా వార్తను 'ఫేక్' అని నిర్ధారిస్తే..సామాజిక మాధ్యమాలు, వార్తా వెబ్‌సైట్స్ ఆ వార్తను ప్రచురించడానికి వీల్లేదని ముసాయిదా చట్టంలో నిబంధనల్ని చేర్చారు. దీనిపై కలకలం రేగుతోంది. ప్రభుత్వ వ్యవహారాలు, ఇతర సమాచారం గురించిన నివేదికల వాస్తవ కచ్చితత్వాన్ని, అత్యున్నత ప్రమాణాలు, సరైన ప్రక్రియకు అనుగుణంగా ఉండేలా ఒక యంత్రాంగాన్ని తీసుకొచ్చేందుకు సంప్రదింపులు ప్రారంభించాలని ఐఎన్‌ఎస్ అభిప్రాయపడింది. ఐటీ నిబంధనావళికి సవరణలు చేయటాన్ని 'ఎడిటర్స్ గిల్డ్', ప్రెస్ అసోసియేషన్, డిజిపబ్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్, డిజిటల్ అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకించాయి. వివాదాస్పద అంశాల్ని ముసాయదా చట్టం నుంచి తొలగించాలని డిమాండ్ చేశాయి. ఏజెన్సీ. ప్రభుత్వ కార్యక్రమాలు, విజయాల గురించి సమాచారాన్ని వ్యాప్తి చేయటం పిఐబి ప్రధాన విధని ఇలాంటి సంస్థకు నకిలీ వార్తలను తొలగించే పని అప్పగించడాన్ని ఏకపక్ష నిర్ణయంగా ఐఎన్‌ఎస్ భావిస్తోంది. గతవారం కేంద్ర ఐటీ మంత్రిత్వశాఖ ఐటీ (మధ్యవర్తి మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) రూల్స్, 2021కి సవరణలు చేసి ముసాయిదా ప్రతిని జారీచేసింది. పీఐబీలోని ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్‌కు 'నకిలీ వార్తల'ను గుర్తించే పని అప్పగించింది. ఇలా గుర్తించిన వార్తల్ని సోషల్‌మీడియా, న్యూస్ వెబ్‌పోర్టల్స్ ప్రచురించరాదు. ఒకవేళ ప్రచురిస్తే.. వాటిని తొలగించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఏజెన్సీ అయిన పీఐబీకి న్యాయ అధికారం కల్పించటాన్ని ఐఎన్‌ఎస్ తప్పుబట్టింది. ఇది అత్యంత ఆందోళన కలిగించే ప్రభుత్వ చర్యగా అభివర్ణించింది. ముసాయిదా చట్టంలో పేర్కొన్న నిబంధనలు, ఇతర విషయాలు పత్రికల స్వేచ్ఛకు విఘాతమని తెలిపింది.

కొలీజియంపై మరోసారి కిరణ్ రిజిజు విమర్శలు

- సున్నితమైన నివేదికలను బయటపెట్టడం అత్యంత ఆందోళనకరమని వ్యాఖ్య

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీంకోర్టు కొలీజియంపై కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు మరోసారి విమర్శలు చేశారు. సున్నితమైన నివేదికలను కొలీజియం బయటపెట్టడం అత్యంత ఆందోళనకరమని కిరణ్ రిజిజు విమర్శించారు. ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి), రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా) సమర్పించిన సున్నితమైన నివేదికలను కొలీజియం బయటపెట్టడం అత్యంత ఆందోళనకరమని తెలిపారు. నిఘా వ్యవస్థ అధికారులు దేశం కోసం గోప్యంగా ఉంటూ పని చేస్తారని, వారు ఇచ్చే నివేదికలను బయటకు వెల్లడించే విషయంలో కొలీజియం భవిష్యత్తులో ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. దీనిపై తాను సరైన విధానంలో స్పందిస్తానని చెప్పారు. న్యాయమూర్తుల నియామకాల విషయంలో ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు కొలీజియం మధ్య ఘర్షణ వాతావరణం కొనసాగుతోంది. సుప్రీంకోర్టు కొలీజియం తీర్మానాలు కొన్ని ఇటీవల బహిర్గతమయ్యాయి. హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల కోసం సుప్రీంకోర్టు సిఫారసు చేసిన కొందరికి సంబంధించిన రా, ఐబి నివేదికలు వీటిలో ఉన్నాయి.

ఈ నేపథ్యంలో ఓ వార్తా సంస్థ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం, కిరణ్ రిజిజు మాట్లాడుతూ, హైకోర్టు న్యాయమూర్తుల నియామకంపై రా, ఐబి ఇచ్చిన రహస్య నివేదికలను బయటపెట్టడం తీవ్ర ఆందోళనకరమని తెలిపారు. దీనిపై తాను సకాలంలో సరైన విధంగా స్పందిస్తానని చెప్పారు. న్యాయమూర్తులు ఎన్నికలను ఎదుర్కొనవలసిన అవసరం ఉండదని, వారిపై బహిరంగ తనిఖీ ఉండదని, అయినప్పటికీ ప్రజలు వారిని గమనిస్తూనే ఉంటారని, వారు ఇచ్చే తీర్పులనుబట్టి వారిని మదింపు చేస్తారని అన్నారు. "ప్రజలు మిమ్మల్ని మార్చలేరు. కానీ మీ తీర్పులను గమనించి, అభిప్రాయాలను ఏర్పరచుకుంటారు" అన్నారు సామాజిక మాధ్యమాల శకంలో దేనినీ దాచలేమని చెప్పారు. కొందరు ఆరోపిస్తున్నట్లుగా ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ మధ్య మహాభారత యుద్ధం జరగడం లేదన్నారు. చర్చలు, సంభాషణలు లేకపోతే ప్రజాస్వామ్యం ఎలా అవుతుందని ప్రశ్నించారు.

కాలిఫోర్నియాలో తుపాకీ కలకలం !

మూడు చోట్ల కాల్పులు : 9మంది మృతి

కాలిఫోర్నియా : అమెరికాలో కాల్పుల కలకలం కొనసాగుతోంది. తాజాగా సోమవారం వేర్వేరుగా మూడు చోట్ల జరిగిన కాల్పుల ఘటనల్లో 9మంది మరణించారు. గత శనివారం పొద్దు పోయిన తర్వాత దక్షిణ కాలిఫోర్నియాలో బాల్‌రూమ్ డ్యాన్స్ హాల్‌లో 11మందిని కాల్చి చంపిన ఘటన మరువక ముందే తాజాగా ఈ దారుణం చోటు చేసుకుంది. శాన్‌ఫ్రాన్సిస్కోకు దక్షిణంగా కోస్తా ప్రాంతంలో పుట్టగొడుగుల షెడ్‌లో, ట్రక్కుల సంస్థ వద్ద జరిగిన రెండు కాల్పుల సంఘటనల్లో ఏడుగురు మరణించారు. మూడో సంఘటనలో అయోవాలోని డెస్ మోయిన్స్‌లో ఇద్దరు టీనేజర్లు కాల్పులకు గురై చనిపోయారని పోలీసులు తెలిపారు. పుట్టగొడుగుల షెడ్ వద్ద జరిగిన కాల్పుల్లో నలుగురు చనిపోగా, ట్రక్కుల బిజినెస్ దగ్గర ముగ్గురు చనిపోయారని శాన్ మాటెవో కౌంటీ బోర్డు అధ్యక్షుడు డేవ్ తెలిపారు. ఈ ఘటనలకు సంబంధించి 67ఏళ్ళ స్థానిక నివాసి చునాలి ఝావో అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు చెప్పారు. ఝావో వాహనంలో సెమీ ఆటోమేటిక్ చేతి తుపాకిని కనుగొన్నారు. మొత్తంగా ఈ కాల్పుల ఘటనల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. 'విషాదం మీద విషాదం' అంటూ కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు. యువత చిక్కుల్లో పడకుండా వుండేలా వారిని చైతన్యవంతులను చేయడానికి ఉద్దేశించిన కార్యక్రమంలో కాల్పులు చోటు చేసుకోగా, ఆ ఘటనలో ఇద్దరు విద్యార్థులు చనిపోగా, ముగ్గురు గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది.

ఆస్కార్ బరిలో ఉన్న చిత్రాల జాబితా

న్యూఢిల్లీ : ఆస్కార్ నామినేషన్స్ జాబితాను మంగళవారం ప్రకటించారు. 95వ ఆస్కార్ అవార్డుల బరిలో నిలిచిన చిత్రాలను ది అకాడమీ ప్రకటించింది. రిజ్ అహ్మద్, అల్లిసన్ విలియమ్స్ వ్యాఖ్యాతలుగా కాలిఫోర్నియా వేదికగా ఈ కార్యక్రమం జరిగింది. వివిధ భాషల నుంచి దాదాపు 300 చిత్రాలు షార్ట్‌లిస్ట్ కాగా, అత్యుత్తమ ప్రమాణాలను కలిగిన చిత్రాలను ఓటింగ్ ద్వారా ఆస్కార్ మెంబర్స్ తుది జాబితాకు ఎంపిక చేశారు. ఈ జాబితా ప్రకారం బరిలో ఉన్న చిత్రాలు

ఉత్తమ చిత్రం..

అవతార్: ది వే ఆఫ్ వాటర్
టాప్‌గన్: మావెరిక్
ఆల్ క్వైట్ ఆన్ ది వెస్ట్రన్ ఫ్రంట్
ది బన్షీస్ ఆఫ్ ఇనిషెరిన్
ఎల్విస్
ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్
ది ఫేబుల్‌మ్యాన్స్
టార్
ట్రయాంగిల్ ఆఫ్ సాడ్‌నెస్
ఉమెన్ టాకింగ్

ఉత్తమ దర్శకుడు

మార్టిన్ మెక్‌డొనాగ్ (ది బన్షీస్ ఆఫ్ ఇనిషెరిన్)
డానియెల్ క్వాన్, డానియెల్ స్కీనెర్ట్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్)
స్టీవెన్ స్పీల్‌బర్గ్ (ది ఫేబుల్‌మ్యాన్స్)
టడ్ ఫీల్డ్ (టార్)
రూబెన్ ఆస్ట్లండ్ (ట్రైయాంగిల్ ఆఫ్ సాడ్‌నెస్)

ఉత్తమ నటుడు

ఆస్టిన్ బట్లర్ (ఎల్విస్)
కొలిన్ ఫారెల్ (ది బాన్షీస్ ఆఫ్ ఇనిషైరెన్)
బ్రెండన్ ఫ్రాసెర్ (ది వేల్)
పాల్ మెస్కల్ (ఆఫ్టర్‌సన్)
బిల్ నిగీ (లివింగ్)

ఉత్తమ నటి

కేట్ బ్లాంషెట్ (టార్)
అన్నా డె అర్మాస్ (బ్లాండ్)
ఆండ్రియా రైజ్‌బరో (టు లెస్లీ)
మిషెల్ విలియమ్స్ (ది ఫేబుల్‌మ్యాన్స్)
మిషెల్ యో (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్)

ఒరిజినల్ సాంగ్

నాటు నాటు (ఆర్ఆర్ఆర్)
అప్లాజ్ (టెల్ ఇట్ లైక్ ఎ ఉమెన్)
హోల్డ్ మై హ్యాండ్ (టాప్‌గన్: మావ్రెరిక్)
లిఫ్ట్ మీ అప్ (బ్లాక్ పాంథర్)
ది ఈజ్ ఏ లైఫ్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్)

ఉత్తమ సహాయ నటుడు

బ్రెన్డాన్ గ్లెసన్ (ది బన్షీస్ ఆఫ్ ఇనిషెరిన్)
బ్రైయిన్ టైరీ హెన్రీ (కాజ్‌వే)
జడ్ హిర్ష్ (ది ఫేబుల్‌మ్యాన్స్)
బేరీ కియోఘాన్ (ది బన్షీస్ ఆఫ్ ఇనిషెరిన్)
కి హుయ్ క్వాన్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్)

ఉత్తమ సహాయ నటి

ఆంజెలా బాస్సెట్ (బ్లాక్ పాంథర్: వకండ ఫరెవర్)
హాంగ్ చ్యూ (ది వేల్)
కెర్రీ కాండన్ (ది బన్షీస్ ఆఫ్ ఇనిషెరిన్)
జామీ లీ కర్టిస్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్)
స్టెఫానీ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్)

బెస్ట్ కాస్ట్యూమ్ డిజైన్

బెబీలాన్ (మ్యారీ జోఫేర్స్)
బ్లాక్‌పాంథర్: వకండా ఫరెవర్ (రూథ్‌కార్టర్)
ఎల్విస్(కేథరిన్ మార్టిన్)
ఎవ్రీథింగ్, ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్ (షెర్లీ కురాట)
మిసెస్ హారిస్ గోస్ టు పారిస్ (జెన్నీ బియావాన్)

బెస్ట్ సౌండ్

ఆల్ క్వైట్ ఆన్ ది వెస్ట్రన్ ఫ్రంట్
అవతార్:ది వే ఆఫ్ వాటర్
ది బ్యాట్‌మెన్
ఎల్విస్
టాప్ గన్: మావరిక్

స్క్రీన్‌ప్లే

మార్టిన్ మెక్‌డొనాగ్ (ది బన్షీస్ ఆఫ్ ఇనిషెరిన్)
డానియెల్ క్వాన్, డానియెల్ స్కీనెర్ట్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్)
స్టీవెన్ స్పీల్‌బర్గ్, టోనీ కుష్నర్ (ది ఫేబుల్‌మ్యాన్స్)
టడ్ ఫీల్డ్ (టార్)
రూబెన్ ఆస్ట్లండ్ (ట్రైయాంగిల్ ఆఫ్ సాడ్‌నెస్)

ఉత్తమ సినిమాటోగ్రఫీ

ఆల్ క్వైట్ ఆన్‌ది వెస్ట్రన్ ఫ్రంట్ (జేమ్స్‌ఫ్రెండ్)
బార్డో, ఫాల్స్ క్రానికల్ ఆఫ్ ఏ హ్యాండ్‌ఫుల్ ఆఫ్ ట్రూత్స్ (డారియస్ కోహోంన్‌డ్జీ)
ఎల్విస్ (మ్యాండీ వాకర్)
ఎంపైర్ ఆఫ్ లైట్ (రోగర్ డీకిన్స్)
టార్ (ఫ్లోరైన్ హాఫ్‌మెస్టర్)

ఉత్తమ ఎడిటర్..

మ్యాట్‌విల్లా, జోనాథన్ రెడ్మండ్ (ఎల్విస్)
పాల్ రోజర్స్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్)
మోనికా విల్లీ (టార్)
ఎడీ హామిల్టన్ (టాప్‌గన్: మావరిక్)
మికెల్ ఇ. జి. నీల్సన్ (ది బన్షీస్ ఆఫ్ ఇనిషెరిన్)

ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్..

ఆల్ క్వైట్ ఆన్ ది వెస్ట్రన్ ఫ్రంట్ (జర్మనీ)
అర్జెంటీనా, 1985 (అర్జెంటీనా)
క్లోజ్ (బెల్జియం)
ఇయో (పోలండ్)
ది క్వైట్ గాళ్ (ఐర్లాండ్)

డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్

ఆల్ దట్ బ్రెత్స్
ఆల్ ది బ్యూటీ అండ్ ది బ్లడ్‌షెడ్
ఫైర్ ఆఫ్ లవ్
ఏ హౌస్ మేడ్ ఆఫ్ స్ప్లింటర్స్
నావల్నీ

యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్..

ది సీ బీస్ట్
టర్నింగ్ రెడ్
పస్ ఇన్ బూట్స్: ది లాస్ట్ విష్
గీలెర్మో డెల్ టోరోస్ పినాకియో
మార్సెల్ ది షెల్ విత్ షుఉస్ ఆన్



17న తెలంగాణ సచివాలయం ప్రారంభోత్సవం

- తమిళనాడు, ఝార్ఖండ్ సిఎంలు, బిహార్ ఉప ముఖ్యమంత్రి హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ నూతన సచివాలయం భవనాన్ని ఫిబ్రవరి 17న ఉదయం 11.30 నుంచి 12.30 గంటల మధ్య సిఎం కెసిఆర్ ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవానికి తమిళనాడు సిఎం స్టాలిన్, ఝార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్, బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, బిహార్ సిఎం నీతీశ్‌కుమార్ తరపున ఆయన ప్రతినిధిగా జెడియు జాతీయ అధ్యక్షుడు లలన్‌సింగ్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ తదితరులు హాజరుకానున్నారు. సచివాలయ భవనం ప్రారంభం తర్వాత అదే రోజు సాయంత్రం సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. సచివాలయ తుదిదశ పనులను మంగళవారం సిఎం కెసిఆర్ పరిశీలించారు. గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించారు.

దగ్గు సిరప్ సంస్థలపై డబ్ల్యుహెచ్ఒ దర్యాప్తు

ఐరాస : చిన్నారుల మృతికి కారణమైన దగ్గు సిరప్‌ల తయారీ సంస్థల మధ్య ఏదైనా సంబంధం ఉందా అనే విషయం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) దర్యాప్తు చేపడుతోంది. ఈమేరకు చర్యలు చేపట్టాల్సిందిగా ఆయా దేశాలను ఆదేశించినట్లు మంగళవారం సంబంధిత అధికారులు తెలిపారు. చిన్నారుల మరణాలు జరగకుండా నిరోధించాల్సిన బాధ్యత ఉందని డబ్ల్యుహెచ్ఒ అధికారులు తెలిపారు. భారత్, ఇండోనేషియాల్లో తయారైన దగ్గు సిరప్‌ల కారణంగా మూడు దేశాల్లో 300 మందికి పైగా చిన్నారులు మరణించిన సంగతి తెలిసిందే. గాంబియా, ఉజ్బెకిస్థాన్, ఇండోనేషియా దేశాల్లో ఈ మరణాలు నమోదయ్యాయి. భారత్, ఇండోనేషియాలో తయారైన ఆరు ఔషధ కంపెనీలతో ఈ మరణాలు ముడిపడి ఉన్నాయని, దీంతో ఈ కంపెనీల మధ్య ఏదైనా సంబంధం ఉందా అని దర్యాప్తు నిర్వహిస్తున్నారు. జులై 2022లో గాంబియాలో మొదటగా మరణాలు నమోదయ్యాయి. కంబోడియా, ఫిలిప్పీన్స్, తూర్పు తైమూర్, సెనెగల్ నాలుగు దేశాలకు ఈ విచారణను విస్తరించినట్లు ఆరోగ్య సంస్థ తెలిపింది. నాసిరకం మందులు నిర్మూలించేందుకు, నియంత్రించేందుకు తనిఖీలు ప్రారంభించాలని ఆయా దేశాల ప్రభుత్వాలకు ప్రపంచ ఔషధ పరిశ్రమ పిలుపునిచ్చింది.

ఎయిర్ ఇండియాకు రూ. 10 లక్షల జరిమానా

న్యూఢిల్లీ : ఎయిర్ ఇండియాకు తాజాగా మరో జరిమానా పడింది. గత ఏడాది పారిస్- ఢిల్లీ విమానంలో ప్రయాణికుల అనుచిత ప్రవర్తన ఘటనలను రిపోర్ట్ చేయనందుకుగానూ ఎయిర్ ఇండియాకు డిజిసిఎ రూ.10 లక్షల జరిమానా విధించింది. డిసెంబరు 6న విమానంలో ఓ ప్రయాణికురాలు వాష్‌రూమ్‌కు వెళ్లినప్పుడు.. మరో వ్యక్తి ఆమె సీట్‌పై ఉన్న దుప్పటిపై మూత్రవిసర్జన చేశాడు. అదే రోజు చోటుచేసుకున్న మరో ఘటనలో.. మద్యం మత్తులో మరుగుదొడ్ల గదిలో పొగతాగుతూ ఓ వ్యక్తి విమాన సిబ్బందికి పట్టుబడ్డాడు. తాము నివేదిక కోరేంత వరకు ఈ ఘటనలపై ఎయిర్ ఇండియా రిపోర్ట్ చేయకపోవడాన్ని డిజిసిఎ ఇదివరకే తప్పుబట్టింది. ఇలాంటి ప్రయాణీకుల వికృత చేష్టలకు సంబంధించిన నిబంధనలు పాటించడంలో ఎయిర్ ఇందడియా ప్రతిస్పందన లోపభూయిష్ఠంగా, ఆలస్యంగా ఉందని పేర్కొంది. ఈ క్రమంలోనే ఇటీవల షోకాజ్ నోటీసు జారీ చేసింది. తాజాగా రూ.10 లక్షల జరిమానా విధించింది. ఈ అనుచిత ప్రవర్తన ఘటనలను అంతర్గత కమిటీ దృష్టికి తీసుకెళ్లడంలో సంస్థ ఆలస్యం చేసినట్లు పేర్కొంది. కాగా, నవంబర్‌లో . న్యూయార్క్- ఢిల్లీ విమానంలో ఓ మహిళపై ప్రయాణికుడు మూత్ర విసర్జన చేసిన ఘటనలోనూ ఎయిర్ ఇండియాకు ఇటీవలే రూ.30 లక్షల జరిమానా విధించిన విషయం తెలిసిందే. ఇలా వారం వ్యవధిలోనే ఎయిర్ ఇండియాకు రెండుసార్లు జరిమానా పడటం గమనార్హం.

బిబిసి డాక్యుమెంటరీపై స్పందించిన అమెరికా

వాషింగ్టన్ : ప్రధాని మోడీపై బిబిసి తీసిన డాక్యుమెంటరీ గురించి తెలియదని, కానీ అమెరికా, భారత్‌లను కలిపిన ప్రజాస్వామిక విలువల గురించి బాగా తెలుసని అమెరికా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి వ్యాఖ్యానించారు. "ఇండియా : ది మోడీ క్వశ్చన్" శీర్షికతో బిబిసి తీసుకువచ్చిన డాక్యుమెంటరీ వివాదాస్పదమైంది. డాక్యుమెంటరీ సిరీస్ గురించి ప్రశ్నించగా, అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి నెడ్ ప్రైజ్ స్పందిస్తూ, "తెలియదు" అని చెప్పారు. "మీరు దేని గురించి అడుగుతున్నారో ఆ డాక్యుమెంటరీ గురించి నాకు తెలియదు, కానీ అభివృద్ధి చెందుతున్న, శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశాలైన అమెరికా, భారత్ కలిసి పంచుకుంటున్న ప్రజాస్వామిక విలువల గురించి బాగా తెలుసు."అని వ్యాఖ్యానించారు. భారతదేశంలో ప్రజాస్వామ్యంపై ప్రైజ్ ప్రశంసలు కురిపించారు. "మమ్మల్ని బంధించి వుంచే ప్రతిదాన్నీ మేం చూస్తాం." అని అన్నారు. ఇరు దేశాల మధ్య సన్నిహిత రాజకీయ, ఆర్థిక సంబంధాలు వున్నాయి. ఇరుదేశాల ప్రజల మధ్య సత్సంబంధాలు వున్నాయి. రెండు దేశాల ప్రజాస్వామ్య సమాజాల్లో ఉమ్మడిగా వుండే విలువలను మేం పంచుకుంటున్నాం" అని ఆయన పేర్కొన్నారు.

శ్రద్ధా వాకర్ కేసులో ఛార్జిషీట్ దాఖలు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాల్‌సెంటర్ ఉద్యోగి శ్రద్ధా వాకర్ హత్య కేసులో ఢిల్లీ పోలీసులు మంగళవారం ఛార్జిషీట్ దాఖలు చేశారు. స్నేహితుడ్ని కలవడానికి వెళ్లిందనే కోపంతోనే నిందితుడు ఆఫ్తాబ్ పూనావాలా శ్రద్ధను హత్య చేసినట్లు ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు 6,629 పేజీల అభియోగ పత్రాన్ని సాకేత్ కోర్టుకు సమర్పించారు. దాదాపు 150 మంది సాక్షుల నుంచి సేకరించిన వివరాలను పేర్కొన్నారు. శ్రద్ధా వాకర్ హత్యకు నిందితుడు ఐదు రకాల పదునైన ఆయుధాలను వినియోగించాడని, హత్య చేసిన తర్వాత రంపంతో మృతదేహాన్ని ముక్కలుగా కోసి గురుగ్రామ్, దక్షిణ ఢిల్లీలోని డంపింగ్ యార్డు ప్రాంతాల్లో విసిరేశాడని పోలీసులు ఛార్జిషీట్‌లో తెలిపారు. ఈ కేసును ఛేదించడానికి తొమ్మిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటిని హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్రకు కూడా పంపించామన్నారు. శ్రద్ధా వాకర్ శరీర భాగాలను గుర్తించేందుకు చాలా సమయం పట్టిందని, దీనికోసం అధునాతన సాంకేతికతను వినియోగించామన్నారు.కాగా, మరోరోవైపు, నిందితుడు ఆఫ్తాబ్ జ్యుడీషియల్ కస్టడీ మంగళవారం ముగియడంతో పోలీసులు అతడిని కోర్టు ఎదుట హాజరుపర్చారు. అతడి కస్టడీని కోర్టు ఫిబ్రవరి 7వ తేదీ వరకు పొడిగించింది.

దుర్వినియోగం అవుతున్న 5 జి సాంకేతికత

న్యూఢిల్లీ : దేశంలో కొన్ని ప్రాంతాల్లో 5జి నెట్‌వర్క్ సేవలు గతేడాది చివర్లో ప్రారంభమయ్యాయి. ఈ 5జి స్మగ్లర్లు, ఆర్థికపరమైన నేరగాళ్లు, ఉగ్రవాద సంస్థలకు ఇది వేదికగా మారే అవకాశం ఉందని అధికారులు ఆందోళన ఈ వ్యక్తం చేశారు. ఈ మేరకు పలువురు ఐపిఎస్ అధికారులు న్యూఢిల్లీలో జరుగుతున్న రాష్ట్రాల డిజిపి, ఐజిల సమావేశంలో 5జీ నెట్‌వర్క్‌పై ఒక నివేదికను సమర్పించారు. 5జీ నెట్‌వర్క్ సాయంతో హెచ్‌టీటీపీ, ట్రాన్స్‌పోర్ట్ లేయర్ సెక్యూరిటీ వంటి ఇంటర్నెట్ ప్రోటోకాల్స్‌ను సైబర్ నేరగాళ్లు సులభంగా యాక్సెస్ చేసి వాటి సాంకేతిక వ్యవస్థలలోకి మాల్‌వేర్‌ను పంపి సైబర్ దాడులకు పాల్పడే అవకాశం ఉందని నివేదికలో పేర్కొన్నారు. క్రిప్టో కరెన్సీ లేదా బ్యాంకింగ్ వ్యవస్థల్లో 5జీ నెట్‌వర్క్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పలు సందర్భాల్లో సైబర్ నేరాలు జరిగిన తీరును గుర్తించడం సంక్లిష్టంగా మారుతుందని తెలిపారు. మాదక ద్రవ్యాల సరఫరా, అక్రమ మానవ రవాణా, మనీలాండరింగ్, ఉగ్రవాద సంస్థలకు ఆర్థిక సాయం వంటి నేరాలకు పాల్పడే వ్యక్తులు తమ మధ్య సమాచార మార్పిడికి 5జీ నెట్‌వర్క్‌లోని భద్రత వ్యవస్థ వేదికగా మార్చుకునే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 5జీ నెట్‌వర్క్ ఎన్నో రకాల ఏఐ ఆధారిత ఇంటర్నెట్ ఆఫ్ దింగ్స్‌ను సపోర్ట్ చేస్తుండటంతో మొబైల్ నెట్‌వర్క్ మ్యాపింగ్, సేవల్లో అంతరాయం కలిగించడం, బ్యాటరీ ఛార్జింగ్ తగ్గించడం, సేవలను నెమ్మదింపజేయడం, మాల్‌వేర్ ప్రవేశపెట్టడం, సీఎన్‌సీ క్రియేషన్, డీఎన్‌ఎస్ స్పూఫింగ్ వంటి వాటిని సైబర్ నేరగాళ్లు సులభంగా చేయగలరని తెలిపారు. 5జీ నెట్‌వర్క్ సంస్థలు యూజర్ల విలువైన సమాచారాన్ని అడ్వర్‌టైజ్‌మెంట్ సంస్థలకు అమ్మే సందర్భంలో అవి సంఘవిద్రోహులకు చేరే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.





మీకోసం

కూరలో ఉప్పు ఎక్కువైతే ఒక బంగాళ దుంపను ముక్కలు చేసి అందులో వేసి ఉడికించండి. ఉప్పదనం తగ్గుతుంది. కూర తినేముందు ఆ దుంప ముక్కలు తీసేయండి.

జీవన సౌరభం

గెలిచినవాడు ఆనందంగా ఉంటాడు. ఓడినవాడు విచారంగా ఉంటాడు. అవి రెండూ శాశ్వతం కాదని తెలిసినవాడు నిత్యం సంతోషంగా ఉంటాడు.

మహా కవులకు జేజేలు



అక్షరాలను పొదిగించి
భావానికి ప్రాణం పోసి
వాక్యాలను నడిపించిన
నాటి కవులకు వందనం

సామాజిక రుగ్మతలను
వ్యవస్థలో పోగొట్టదలచి
జన జీవన చైతన్యానికి
పద్యాలను రాశాడు వేమన

సరళ భాష సాహిత్యంలో
కన్యాశుల్కమను రచనతో
పామరులను మేల్కొలుపు దిశగా
కదిలిన మహాకవి మన గురజాడ

చక్కటి పదావిష్కరణతో
నాటి నేటి వ్యవస్థ తీరుని
నిర్మోహమాటంగా గద్దిస్తూ
కవిత్వాన్ని అల్లినాడు శ్రీ శ్రీ


మనసుకు హత్తుకునే
వాక్య నిర్మాణంతో పాట రాసి
ఆహ్లాదాన్ని నింపుతూ
రాగాలను పలికించాడు సినారె

సాహిత్యానికి మెరుగులద్ది
ఛందస్సును నడిపించి
అలంకార పదాలను కూర్చి
గేయాలను మలిచాడు దాశరథి

కూనలమ్మ పదాలను అల్లి
ఇంటింటా పద్యాలను పలికించి
కథ నవలను అలవోకగా
లిఖించి చిక్కగా అందించాడు ఆరుద్ర

ఎందరో మహా మహా ప్రజాకవులు
ఇంకెందరో ప్రజాపక్ష రచయితలు
ప్రజల హితం కోసం
అక్షర సేద్యం చేసిన శ్రామికులు


- నరెద్దుల రాజారెడ్డి
96660 16636



చుక్కలు కలపండి

చిన్నారులూ , ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

నేను గీసిన బొమ్మ





- షేక్ ఆబీద్,
6వ తరగతి,
కృష్ణవేణి టాలెంట్ స్కూలు,
ఒంగోలు.
ప్రకాశం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

రాళ్లల్లో.. రప్పల్లో బుగ్గవుతున్న జీవితాలు..



ఎటుచూసినా రాళ్ల దిబ్బలు.. కనుచూపుమేర చదునైన నేల కనిపించదు. ఆ రాతి గుట్టలు.. ఎత్తుపల్లాల మధ్యే ఆ ప్రాంతవాసుల బతుకు తెల్లారుతుంది. రాతి గనుల్లో పనులకెళ్లి సిలికోసిస్ వ్యాధి బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నా ఆ పని తప్ప వేరే జీవనోపాధి లేని బతుకులు వాళ్లవి. తండ్రులను కోల్పోయిన బిడ్డలు.. బిడ్డలను కోల్పోయిన తల్లులు.. భర్తలను కోల్పోయిన మహిళలు వేలాదిమంది అక్కడ కనిపిస్తారు. రాజస్థాన్ జోధ్‌పూర్ ప్రాంతంలో ఉన్న ఓ రాతి గనిలో ప్రాణాలు పణంగా పెట్టి జీవిస్తున్న కొంతమంది కన్నీటి వెతలివి..

జోధ్‌పూర్ గండేరో కి ధాని గ్రామంలో ఉండే శ్రావణ్ తండ్రి రాతిగనిలో పనిచేసేవాడు. శ్రావణ్‌కు 11 ఏళ్లప్పుడు సిలికోసిస్ వ్యాధి సోకి తండ్రి చనిపోయాడు. తండ్రి చావుతో శ్రావణ్ జీవితం తలకిందులైంది. అర్ధంతరంగా చదువుకు స్వస్తిచెప్పాడు. తల్లికి సాయంగా రాతిగనిలో పనికి కుదిరాడు. దశాబ్దకాలం గడిచింది. శ్రావణ్‌కు 21 ఏళ్లు వచ్చేసరికి తండ్రిని పొట్టనబెట్టుకున్న సిలికోసిస్ వ్యాధి తనకు కూడా సోకింది. ఆ గ్రామంలో శ్రావణ్ లాంటి వారెంతోమంది. బాల కార్మికులుగా రాతి గనుల్లో పనులకెళ్లి 25 ఏళ్లు కూడా నిండకుండా వ్యాధిబారిన పడుతున్నారు.

11 ఏళ్లకు గనిలో పనికెళ్లిన లాలారామ్ వయసు ఇప్పుడు 30 ఏళ్లు. 'మా అమ్మానాన్నకు సిలికోసిస్ వ్యాధి సోకింది. వాళ్లు ఎక్కువసేపు పనిచేయలేక పోయేవారు. దీంతో ఇంటికి పెద్దవాడినైన నేను నా ముగ్గురు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెళ్ల బాధ్యతను తీసుకున్నాను. అమ్మానాన్నతో కలిసి పనిచేయడం మొదలుపెట్టాను. వ్యాధి ముదిరి కొంతకాలానికి నాన్న చనిపోయాడు. పనిచేసే శక్తి లేక ఇప్పుడు అమ్మ ఇంటిపట్టునే ఉంటోంది' అంటున్న లాలారామ్‌కు కూడా వ్యాధి సోకింది.



వితంతువుల గ్రామం

జోధ్‌పూర్ చుట్టుపక్కల మైనింగ్ పరిధిలో ఉన్న 25 గ్రామాల్లో గండేరో కి ధాని ఒకటి. సిలికోసిస్ కారణంగా భర్తలను కోల్పోయి గ్రామంలో 40 నుండి 50 మంది వితంతువులయ్యారు. దీంతో ఈ గ్రామాన్ని వితంతువుల గ్రామంగా పిలుస్తున్నారు. ఆడుతూపాడుతూ తిరగాల్సిన అక్కడి పిల్లలు తండ్రులను కోల్పోయిన దు:ఖం తడి ఆరకుండానే అమ్మ కొంగు చాటున పలుగు, పార పట్టుకుని ఆ రాతి గనివైపే అడుగులు వేస్తున్నారు.

'నా భర్త ఈ వ్యాధితోనే మరణించాడు. నా నలుగురు బిడ్డల్లో ఒకడు ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. నా బిడ్డలందరూ ఏదో ఒకరోజు ఈ వ్యాధిబారిన పడతారని తెలిసినా మాకు ఈ పని చేయక తప్పడం లేదు. మా ప్రాంతంలో ఎంతోమంది చిన్నబిడ్డలు నా కళ్ల ముందే రాతి పనిలోకి వెళ్తున్నారు. చాలా కష్టంగా ఉంటుంది. కాని ఇది తప్ప మాకు వేరే గత్యంతరం ఉండదు' అంటూ ఉబికివస్తున్న కన్నీళ్లతో చెబుతోంది 60 ఏళ్ల వృద్ధురాలైన కమలాభిల్.

'రోజంతా కష్టపడినా రూ.200 నుండి రూ.400 సంపాదించలేం. ఆ సొమ్ముతో బిడ్డలను పోషించుకోవాలా? చదివించుకోవాలా? అందుకే మా పిల్లలను కూడా పనుల్లోకి తీసుకెళ్తాం. మా కళ్ల ముందే మా భర్తలను కోల్పోయాం.. సోదరులను కోల్పోయాం.. బిడ్డలనూ కోల్పోయాం' అంటోన్న 55 ఏళ్ల శాంతాదేవి భర్త సిలికోసిస్‌కు బలయ్యాడు. ఆమె కొడుకు క్యాన్సర్‌తో చనిపోయాడు. ఆమెకు కూడా నోటి క్యాన్సర్ వచ్చింది.



భర్తను, బిడ్డను కోల్పోయిన శాంతాదేవి పనిచేసే శక్తి లేక ఇంటి పట్టునే ఉంటోంది. 'కాస్తో కూస్తో ఉన్న బంగారం అమ్ముకుని లాక్‌డౌన్ కాలంలో గడిపాను. ఇప్పుడు రోజులు లెక్కబెట్టుకుని జీవిస్తున్నాను. వైద్య ఖర్చుల కోసం కూడా డబ్బులు లేవు' అంటూ రోదిస్తోంది.

తడిసిమోపెడవుతున్న అప్పుల భారం

వ్యాధితో బాధపడుతున్న గ్రామస్తులను వేధించే మరో సమస్య రుణభారం. నయంకాని వ్యాధి నుండి తాత్కాలిక ఉపశమనం కోసం వైద్య ఖర్చులు భరించే శక్తి లేని గ్రామస్తులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కొంతమంది దళారులు అధిక వడ్డీలకు రుణాలిచ్చి వారి జీవితాలను మరింత దుర్భరం చేస్తున్నారు.

సాంఘిక వివక్ష

వితంతువులను చూడకూడదు.. ఎదురవ్వకూడదు అన్న దురాచారం అక్కడ కనిపిస్తుంది. పనుల్లోకి వెళ్లేటప్పుడు వితంతువులను చూడడానికి గ్రామస్తులు ఇష్టపడరు. దీంతో అందరూ పనికి వెళ్లిన తరువాత ఎవరి కంటా పడకుండా వడివడిగా అడుగులు వేస్తూ భర్త కోల్పోయిన ఆ స్త్రీలు పనుల్లోకి వెళతారు. 'భర్త కోల్పోయిన మేము మానసికంగా ఎంతో కుంగిపోయి ఉంటాం. ఈ జీవితం మేము ఊహించనిది. బతకడం కోసమే పనుల్లోకి వెళ్తుంటాం. అయితే వితంతువులవ్వడం వల్ల అందరూ పనుల్లోకి వెళ్లిన తరువాతే మేము బయల్దేరాలి. దీంతో పని గంటలు తగ్గిపోవడం వల్ల కూలీ తగ్గుతోంది' అంటోన్న ఉమా భాయ్ భర్త 24 ఏళ్లకే సిలికోసిస్‌తో మరణించాడు. భర్త చనిపోయేటప్పటికి ఉమా 7 నెలల గర్భవతి. ఇప్పుడు ఆ బిడ్డ కూడా తల్లి వెంట రాతి పనికి వెళుతోంది.


పరిహారం అందని వారే అత్యధికం..

గనుల్లో పనిచేసే కార్మికులు మరణిస్తే ప్రభుత్వ నుండి వచ్చే పరిహారం సొమ్ము అందని కుటుంబాలు అక్కడ చాలా ఉన్నాయి. సిలికోసిస్ వ్యాధి సోకిన రోగికి రూ.3 లక్షలు, అతను చనిపోయిన తరువాత కుటుంబానికి రూ.2 లక్షలు పరిహారం అందివ్వాలన్న పథకం కాగితాలకే పరిమితమైంది. 'నా భర్తకు వ్యాధి సోకినప్పుడు అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్లడానికి, మందులకు, డాక్టరు బిల్లులు చెల్లించేందుకు అప్పు తీసుకున్నాను. పరిహారం అందక పోవడంతో ఆ అప్పు అలాగే ఉంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో 10 ఏళ్ల నా కొడుకును పనికి తీసుకెళ్తున్నాను' అంటూ వాపోతోంది గులాబ్‌దేవి. దశాబ్దాలు గడిచినా పరిహారం అందని ఎన్నో కుటుంబాలు అక్కడ ఉన్నాయి.

'మేము పడిన కష్టాలు మా బిడ్డలను పడనివ్వం. వాళ్లు చదువుకుంటున్నారు. ఈ రాతి గనివైపు వాళ్లను నడవనివ్వం. మా పిల్లల భవిష్యత్తు బాగుండాలి' అని కోరుకుంటున్నారు శ్రావణ్, లాలారామ్. బిడ్డల భవిష్యత్తు బాగుండాలని అందరి తల్లిదండ్రులు కోరుకున్నట్లుగా వీళ్లూ ఆశపడుతున్నారు. మరి మన పాలకులు వారి ఆశలను నెరవేరుస్తారా?

రాతిగనులు, లోహపు గనుల్లో పనిచేసే కార్మికులకు వచ్చే ప్రాణాంతక వ్యాధి సిలికోసిస్. ఎక్కువ పని గంటలు, సుదీర్ఘకాలం గనుల్లో పనిచేయడం వల్ల సిలికా ధూళి కార్మికుల ఊపిరితిత్తుల్లోకి చేరి ఈ వ్యాధి బారిన పడతారు. ఊపిరితిత్తులు దెబ్బతిని, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. అనారోగ్యానికి తోడు మద్యపానం వీరిని మరింత ప్రాణాపాయ స్థితికి నెడుతోంది. ఓ నివేదిక ప్రకారం 2018 నుండి 2023 మధ్య కాలంలో రాజస్థాన్ వ్యాప్తంగా దాదాపు 50 వేల సిలికోసిస్ కేసులు నమోదైతే ఒక్క జోధ్‌పూర్‌లోనే 11 వేల పైచిలుకు కేసులు నమోదయ్యాయి. దేశంలో రాతి గనులు ఉండే ప్రాంతాలైన తొమ్మిది రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఈ వ్యాధి ప్రబలంగా ఉందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

ఆర్‌ఆర్‌ఆర్ ఖాతాలో మరో అవార్డు




అంతర్జాతీయ వేదికలపై ఇప్పటికే ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్న ఆర్‌ఆర్‌ఆర్ జపాన్ 46వ అకాడమీ అవార్డ్సులో అవుట్ స్టాండింగ్ ఫారిన్ ఫిల్మ్ కేటగిరిలో స్థానం సంపాదించింది. ఈ రేసులో హాలీవుడ్ మూవీస్ 'అవతార్ ద వే ఆఫ్ వాటర్..' 'టాప్ గన్..' 'మావెరిక్' వంటి హాలీవుడ్ చిత్రాలను దాటి ఆర్‌ఆర్‌ఆర్ ఈ అవార్డును కైవసం చేసుకుంది. ఇటీవలె అమెరికాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గోల్డెన్ గ్లోబ్ అవార్డ్ అందుకున్న ఈ చిత్రానికి భారతీయులే కాకుండా విదేశీయులు సైతం ఫిదా అవుతున్నారు.



'దేశంకోసం భగత్ సింగ్'


రవీంద్ర గోపాల దర్శకత్వంలో ఆయనే హీరోగా నటించిన 'దేశం కోసం భగత్ సింగ్' చిత్రంలోని పాటలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖ రచయిత, నటుడు, దర్శకుడు పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ, 'స్వాతంత్ర్య సమరయోధుల పాత్రలంటే ఎన్టీఆర్ గారే గుర్తొస్తారు. అలాంటిది రవీంద్ర గోపాల్ ఈ సినిమాలో ఏకంగా 14 మంది స్వాతంత్ర్య సమర యోధుల పాత్రలు వేశాడు. ఎంతో నమ్మకం ఉంటే కానీ ఇది సాధ్యం కాదు. ఈ సినిమా తన కోసం కాదు.. దేశం కోసం చేసిన సినిమా' అని అన్నారు. ప్రముఖ నిర్మాత దామోదర ప్రసాద్ మాట్లాడుతూ, 'డబ్బు కోసమే సినిమా తీసే ఈ కాలంలో దేశం కోసం సినిమా చేయడం అభినందించదగ్గ విషయం. నేటి తరానికి గాంధీ, భగత్ సింగ్ అంటే ఎవరో తెలియని పరిస్థితి. కాబట్టి ఇలాంటి సినిమాలు వస్తే ఎంతో మంది త్యాగఫలం మన స్వాతంత్ర్యం అనే విషయం వారికి తెలుస్తుంది' అని చెప్పారు. డిస్ట్రిబ్యూటర్‌గా, ఎగ్జిబిటర్‌గా, ప్రొడ్యూసర్‌గా రవీంద్ర గోపాలకు ఎంతో అనుభవం ఉందని, దేశభక్తి ఉట్టిపడేలా ఇందులో పాటలు ఉన్నాయని నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్ తెలిపారు. ఈ చిత్రంలో రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రలలో నటించగా సూర్య, జీవా, ప్రసాద్ బాబు, అశోక్ కుమార్, సుధ ఇతర పాత్రలు పోషించారు. ఫిబ్రవరి 3న ఈ చిత్రం విడుదలకానుంది.

కోలివుడ్ చిత్రాల నిర్మాణంలోనూ



వివరాలివే కార్తికేయ 2 సినిమాతో పాన్ ఇండియా స్థాయి సక్సెస్‌ను అందుకుంది ' పీపుల్ మీడియా ఫ్యాక్టరీ'. ఈ నిర్మాణ సంస్థ ఇప్పుడు కోలీవుడ్ సినిమాలనూ నిర్మించేందుకు సిద్ధమైంది. తమిళంలో తీస్తున్న తన మొదటి సినిమాను ప్రకటించింది. పాపులర్ తమిళ యాక్టర్ సంతానం టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'వడక్కుపట్టి రామసామి'. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రం త్వరలో సెట్స్ పైకి వెళ్లనుంది. సీన్ రోల్డన్ సంగీతం అందిస్తున్నాడు.

26న 'రావణాసుర' గ్లింప్స్ వీడియో



మాస్‌హీరో రవితేజ నటిస్తోన్న చిత్రం 'రావణాసుర'. యూనిక్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సుధీర్ వర్మ దర్శకత్వం వహిస్తున్నాడు. మరో రెండు రోజుల్లో రవితేజ పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ గిఫ్ట్ అందించేందుకు మేకర్స్ ప్లాన్ చేశారు. జనవరి 26న రావణాసుర గ్లింప్స్ వీడియోను లాంచ్ చేయనున్నట్టు ఓ వీడియో ద్వారా తెలియజేశారు. రావణాసురలో అనూ ఎమ్మాన్యుయేల్, పూజిత పొన్నాడ, దక్షా నగార్కర్, ఫరియా అబ్దుల్లా, మేఘా ఆకాశ్ ఫీ మేల్ లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో యువ నటుడు సుశాంత్ విలన్‌గా నటిస్తున్నాడు. అభిషేక్ పిక్చర్స్, రవితేజ టీమ్ వర్క్స్ బ్యానర్లపై నిర్మిస్తున్న ఈ చిత్రంలో రావు రమేశ్, మురళీ శర్మ, సంపత్ రాజ్, నితిన్ మెహతా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 7న థియేటర్లలో విడుదల చేస్తున్నారు.

'... తుపాకుల గూడెం'



వైవిధ్యమైన అంశంతో 'రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం' అనే చిత్రం రాబోతోంది. వారధి క్రియేషన్స్ ప్రై.లి. బ్యానర్ మీద ఈ సినిమాను జైదీప్ విష్ణు తెరకెక్కిస్తున్నారు. ప్రవీణ్ కండెలా, శ్రీకాంత్ రాథోడ్, జాయెత్రి మకానా, శివరామ్ రెడ్డి ఇలా నలభై మంది కొత్త నటీనటులతో రాబోతోన్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషనల్ కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. మణిశర్మ ఈ సినిమాకు సంగీతం అందించారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్ నుంచి ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ వచ్చింది. ఫిబ్రవరి 3న ఈ చిత్రం విడుదల కాబోతున్నట్టుగా మేకర్లు ప్రకటించారు.

మార్చి 17న 'కబ్జ'



కన్నడ స్టార్ హీరోలు ఉపేంద్ర, కిచ్చా సుదీప్ ప్రధాన పాత్రలో నటించిన మల్టీస్టారర్ మూవీ 'కబ్జ'. ఆర్.చంద్రు దర్శకత్వం వహించిన ఈ చిత్రం అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కింది. ఈ నేపథ్యంలో సినిమా మార్చి 17న పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు ఓ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. పోస్టర్‌లో ఉపేంద్ర విలన్‌ను చావగొట్టి బైక్‌పై పడుకోబెట్టి తీసుకెళ్తున్నాడు. ఈ సినిమా కథ 1947 నుండి 1984 మధ్య జరుగుతుందని సమాచారం. శ్రియాశరణ్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా కన్నడతో పాటు తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, మరాఠి, బెంగాలీ భాషల్లో రిలీజ్ కానుంది. ఇలా ఏడు భాషల్లో విడుదలవుతున్న మొదటి కన్నడ సినిమాగా ఈ చిత్రం రికార్డు సృష్టించింది.

రోహిత్, గిల్ శతకాలు

న్యూజిలాండ్‌పై 90పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం
కాన్వే సెంచరీ వృథా ● వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్



రోహిత్-గిల్ తొలి వికెట్‌కు 212పరుగుల భాగస్వామ్యం

ఇండోర్: చివరి వన్డేలోనూ భారత్ గెలిచి 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. న్యూజిలాండ్‌తో శనివారం జరిగిన మూడో వన్డేలో టీమిండియా 90 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 386పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో న్యూజిలాండ్ జట్టు 41.2ఓవర్లలో 295పరుగులకే కుప్పకూలింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాను ఓపెనర్లు రోహిత్, శుభ్‌మన్ సెంచరీలతో కదం తొక్కారు. రోహిత్ శర్మ(101), శుభ్‌మన్(112) తొలి వికెట్‌కు 212 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత హార్దిక్ పాండ్యా(54), కోహ్లీ(36), శార్దూల్ ఠాకూర్(25) ఫర్వాలేదనిపించారు. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫీ, బ్లెయిర్ టిక్నెర్‌కు మూడేసి, బ్రాస్‌వెల్‌కు ఒక వికెట్ దక్కాయి. ఛేదనలో న్యూజిలాండ్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ ఫిన్ డకౌటైనా.. మరో ఓపెనర్ కాన్వే(138) బ్యాటింగ్‌లో రాణించాడు. నికోల్స్(42), సాంట్నర్(32) ఫర్వాలేదనిపించారు. శార్దూల్, కుల్దీప్‌కు మూడేసి, చాహల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ శుభ్‌మన్ గిల్‌కు లభించింది. ఇక ఇరుజట్ల మధ్య మూడు టి20ల సిరీస్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది.

బాబర్ రికార్డు సమం చేసిన శుభ్‌మన్

టీమిండియా యువ సంచలనం శుభ్‌మన్ గిల్ వన్డే క్రికెట్‌లో ఓ రికార్డును తనపేర లిఖించుకున్నాడు. 23ఏళ్ల శుభ్‌మన్ ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో బాబర్ అజామ్ పేరిట ఉన్న 360(3మ్యాచ్‌ల్లో) పరుగుల రికార్డును సమం చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో శుభ్‌మన్ 208, 40, 112 పరుగులు చేశాడు. దీంతో బాబర్ రికార్డును సమం చేశాడు. ఇక భారత్‌లో తరపున వరుసగా మూడు వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన విరాట్ కోహ్లీ (283 పరుగులు) రికార్డును శుభ్‌మన్ బ్రేక్ చేశాడు.

స్కోర్‌బోర్డు..

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి)బ్రాస్‌వెల్ 101, శుభ్‌మన్ (సి)కాన్వే (బి)టిక్నెర్ 112, కోహ్లి (సి)అలెన్ (బి)డఫీ 36, ఇషాన్ (రనౌట్) నికోల్స్ 17, సూర్యకుమార్ (సి)కాన్వే (బి)డఫీ 14, హార్దిక్ (సి)కాన్వే (బి)డఫీ 54, సుందర్ (సి)మిచెల్ (బి)టిక్నెర్ 9, శార్దూల్ (సి)లాథమ్ (బి)టిక్నెర్ 25, కుల్దీప్ (రనౌట్) లాథమ్/ఫెర్గుసన్ 3, ఉమ్రన్ (నాటౌట్) 2, అదనం 12. (50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 385పరుగులు. **వికెట్ల పతనం:** 1/212, 2/230, 3/268, 4/284, 5/293, 6/313, 7/367, 8/379/, 9/385 **బౌలింగ్:** డఫీ 10-0-100-3, ఫెర్గుసన్ 10-1-53-0, టిక్నెర్ 10-0-76-3, సాంట్నర్ 10-0-58-0, మిచెల్ 4-0-41-0, బ్రాస్‌వెల్ 6-0-51-1.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: ఫిన్ (బి)హార్దిక్ 0, కాన్వే (సి)రోహిత్ (బి)ఉమ్రన్ 138, నికోల్స్ (ఎల్‌బి)కుల్దీప్ 42, మిచెల్ (సి)ఇషాన్ (బి)శార్దూల్ 24, లాథమ్ (సి)హార్దిక్ (బి)శార్దూల్ 0, ఫిలిప్స్ (సి)కోహ్లి (బి)శార్దూల్ 5, బ్రాస్‌వెల్ (స్టంప్)ఇషాన్ (బి)కుల్దీప్ 26, సాంట్నర్ (సి)కోహ్లి (బి)చాహల్ 34, ఫెర్గుసన్ (సి)రోహిత్ (బి)కుల్దీప్ 7, డఫీ (ఎల్‌బి) చాహల్ 0, టిక్నెర్ (నాటౌట్) 0, అదనం 19. (41.2 ఓవర్ల లో ఆలౌట్) 295పరుగులు. **వికెట్ల పతనం:** 1/0, 2/106, 3/184, 4/184, 5/200, 6/230, 7/269, 8/279, 9/280, 10/295 **బౌలింగ్:** హార్దిక్ 6-0-37-1, సుందర్ 6-0-49-0, శార్దూల్ 6-0-45-3, ఉమ్రన్ 7-0-52-1, కుల్దీప్ 9-0-62-3, చాహల్ 7.2-0-43-2.

సెమీస్‌కు అజరెంక, రైబకినా



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి రష్యాకు చెందిన 24వ సీడ్ విక్టోరియా అజరెంక, 22వ సీడ్, కజకిస్తాన్‌కు చెందిన రైబకినా ప్రవేశించారు. మంగళవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో 33ఏళ్ల అజరెంక 6-4, 6-1తో 3వ సీడ్ జెస్సికా పెగులా (అమెరికా)పై, రైబకినా 6-2, 6-4 తో 17వ సీడ్ ఒస్టాపెంకో (లాత్వియా)పై వరుససెట్లలో గెలిచారు. ఏడేళ్ల బిడ్డకు తల్లి అయిన అజరెంకా 2011, 2013లో ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంపియన్ కూడాను. ఇక 25ఏళ్ల రైబకినా గత ఏడాది వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలుపొందగా.. తొలిసారి ఆస్ట్రేలియన్ సెమీస్‌కు చేరింది. గురువారం జరిగే సెమీస్‌లో రైబకినా-అజరెంకాల మధ్య జరగనుంది.

సిట్సిపాస్, ఖచనోవ్ కూడా...

పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి 3వ సీడ్, గ్రీక్‌కు చెందిన స్టెఫానస్ సిట్సిపాస్, 18వ సీడ్ ఖచనోవ్(రష్యా) ప్రవేశించారు. మంగళవారం జరిగిన తొలి క్వార్టర్‌ఫైనల్లో ఖచనోవ్ 7-6(7-5), 6-3, 3-0 ఆధిక్యతలో ఉండగా.. 29వ సీడ్ కొర్డా(అమెరికా) గాయంతో మ్యాచ్ మధ్యలో నిష్క్రమించాడు. దీంతో ఖచనోవ్‌కు వాకోవర్ లభించి తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌కు చేరాడు. మరో సెమీస్‌లో సిట్సిపాస్ 6-3, 7-6(7-2), 6-4తో అన్‌సీడెడ్ లెహెక్రా (చెక్)పై వరుససెట్లలో గెలిచి సెమీఫైనల్లోకి ప్రవేశించాడు.

సానియా-బొప్పన్న జోడీకి వాకోవర్..

మిక్స్‌డ్ డబుల్స్‌లో సానియా మీర్జా-రోహన్ బొప్పన్న జోడీకి వాకోవర్ లభించింది. మంగళవారం జరగాల్సిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ నుంచి వేగే(స్పెయిన)-ఒస్టాపెంకో(లాత్వియా) జోడీ నిష్క్రమించారు. దీంతో భారత జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగే సెమీస్‌లో భారత జోడీ 3వ సీడ్ సుప్పీ(బ్రిటన్)-క్రాజిక్(అమెరికా)తో తలపడనున్నారు.



113 పరుగులకే అస్సాం ఆలౌట్

ఆంధ్ర 160/3.. రంజీట్రోఫీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చింతలవలస పివిజి రాజు క్రికెట్ మైదానంలో మంగళవారం అస్సాం, ఆంధ్ర జట్ల మధ్య రంజీ క్రికెట్ మ్యాచ్ ప్రారంభమైంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన అస్సాం జట్టు 113 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అస్సాం జట్టును తక్కువ స్కోర్ చేయడంలో ఆంధ్ర జట్టు బౌలర్లు ఎం రాయుడు 4 వికెట్లు, కె వి శశికాంత్ 3 వికెట్లు తీసి కట్టడి చేశారు. అనంతరం బ్యాటింగ్ దిగిన ఆంధ్ర జట్టు తొలిరోజు అట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 160 పరుగులతో బ్యాటింగ్ చేసింది. దీంతో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఇప్పటికే 47పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. ఆంధ్ర జట్టులో అభిషేక్ రెడ్డి 75, విహారి 80 పరుగులు చేసి ఆంధ్ర జట్టుకు గట్టి పునాది వేశారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68